# పదార్చన

రచన :

డా॥ చిట్రాజు గోవిందరాజు

శ్రీనివాస ప్రచురణలు
కర్నూలు
ఫిబ్రవరి – 1993

PADARCHANA
By
Dr. CHITRAJU GOVINDARAJU

ప్రచురణ : 1993

ప్రతులు : 1000

వెల : రూ. 30-00

[C] : చిత్రాజు గోవిందరాజు


శ్రీనివాస ప్రచురణలు-4

ప్రతులకు :

యం. నాగేశ్వరి
18/82-A16, కమలానగర్, "బి" క్యాంప్ పోస్టు
కర్నూలు-2

ఫ్రెండ్స్ బుక్ డిపో
పార్క్ రోడ్
కర్నూలు-1

ముద్రణ :
శ్రీ సత్యసాయి ప్రింటర్స్,
తిరుపతి.



This Book is published with the financial assistance of
Tirumala Tirupathi Devasthanams under their
scheme Aid to Publish Religious Books

ఆచార్య కె. సర్వోత్తమరావు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

తిరుపతి.
12-2-93

# అభినందన

వ్యాసాలు వ్రాయడం, పుస్తకాలు ప్రచురించడం, సెమినార్లలో పాల్గొనడం మొదలయినవి విశ్వవిద్యాలయానికి నిరంతం సాగవలసిన అంశాలు. డా॥ సి. గోవిందరాజు లోగడ అన్నమయ్య సాహిత్యాన్ని పరిశోధించి వ్రాసిన పుస్తకాలు మూడు. పదార్చన నాల్గవది.

కొందరి రచనలు "సద్యోగర్భం" లాంటివి. కొందరికి "లేడికి లేచిందే పరుగు" లాంటివి. మరి కొందరికి "నత్త నడకలాంటివి" ఇంకా కొందరివి ఆచితూచి వేసిన అడుగుల లాంటివి. కొందరివి "అంతర్వాహినుల లాంటివి. డా॥ సి. గోవిందరాజు రచనలు చివరి కోవకు చెందినవి.

తాళ్ళపాక కవుల సాహిత్యం తరగని గని. ఈ "గని"ని త్రవ్వి రత్నాలు బయటికి దీసి వాటి అందచందాలను పరిచయం చేసినవారు కొందరే. అకుంఠితదీక్ష, నిర్విరామ కృషి, నిజాయితీ ఉన్నవారే ఈ పనికి పూనుకొంటారు. డా॥ గోవిందరాజు పరిశ్రమతో వెలువడుతున్న "పదార్చన"ను స్వామి సంతోషంతో ఏలుకున్నాడు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారం లభించడం దీనికి సాక్ష్యం.

డా॥ గోవిందరాజు "సాహిత్యార్చన" నిరంతరం సాగాలని కోరుతున్నా. మనసార అభినందిస్తున్నా.

కె. సర్వోత్తమరావు

# అభినన్దనం

ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య
సంస్కృతవిభాగం,
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి.

పదకవితా ప్రక్రియ భగవత్పదపద్మారాధనానికి కవులెన్నుకున్న చక్కని సాధనం. పదకవితాపితామహుడుగా ప్రసిద్ధిపొందిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు ఈ ప్రక్రియలో ఎన్నెన్నో అందచందాలను, అలంకారాలను సాధించి సరసమధురమైన పదకవితా కుసుమాలతో శ్రీనివాసుని పదపద్మాలనర్చించాడు. ఆ మహనీయుని సాహిత్యంలో విశేష పరిశ్రమ చేసి డాక్టరేట్ పట్టాన్ని పొందిన చిరంజీవి డా॥ గోవిందరాజు, పదసాహిత్యంలో పరిశోధనవ్యాసంగాన్ని ఈనాటికీ నిర్వహిస్తూ ఎన్నో రచనలను చేస్తూ విమర్శకుల మన్ననలను పొందగలగడం అభినందించదగిన అంశం.

డాక్టర్ గోవిందరాజు "పదార్చన" అనే ఈ చిన్ని పుస్తకంలో పరిశీలనాత్మక దృష్టితో పొందుపరచిన వ్యాసాలన్నీ పదికాలాలపాటు నిలబడగలిగినవే. "అన్నమయ్య సంకీర్తనల్లో చూపులు" అనే అంశంలో ఒక నూతన దృక్కోణం సాహితీ విమర్శకులకు అందించబడింది. శ్రీవేంకటేశ్వరోదాహరణంపై సమగ్రమైన సమీక్ష రెండో వ్యాసంలో కనబడుతుంది. మూడో వ్యాసంలో పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలలో దేవతామూర్తులు, ఉత్సవాలు చక్కగా పరిశీలించబడినాయి.

ఇంత చక్కటి చిక్కటి రచనను ఆంధ్రులకందించిన డా॥ గోవిందరాజును అభినందిస్తూ ఇక ముందుకూడా పదసాహిత్యంతో మంచి రచనలను చేయగల అవకాశాలను శ్రీపద్మావతీ శ్రీనివాసులనుగ్రహించాలని ప్రార్థిస్తున్నాను.

వినావేంకటేశం ననాథో న నాథః

తిరుపతి
20-3-1993

ఎస్.బి. రఘునాథాచార్య

# కృతజ్ఞతలు

కొండలలో నెలకొన్న కోనేటి రాయని గురించి అక్షరలక్షలతో అర్చించిన భక్త మహాకవులెంతమందో ఉన్నారు. వాళ్ళలో తాళ్ళపాక వంశీకులు ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవారు. వీరు శృంగార అధ్యాత్మ సంకీర్తనల్లోనూ, ద్విపదుల్లోనూ, శతకరూపాల్లోకూడ స్తుతించారు. వీళ్ళలో పదకవితాపితామహుడుగా పేరుపొందిన ప్రఖ్యాత పదకవి తాళ్ళపాక అన్నమయ్య. ఈయన దాదాపు ముప్పైరెండువేల అధ్యాత్మ శృంగార సంకీర్తనల్ని రచించారని ప్రసిద్ధి. అన్నమయ్య బాటలోనే పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య పయనించి శృంగార అధ్యాత్మ సంకీర్తనల్ని రచించారు. ఈ భక్తకవులందరి ప్రధానోద్దేశ్యం వైష్ణవమతాన్ని వ్యాప్తిచేయడమే. వీళ్ళు రాముని కీర్తించినా, నారసింహుని కీర్తించినా, చెన్నరాయని కీర్తించినా వేంకటేశ్వర స్వామికి ప్రతిరూపంగానే భావించేవారు. ఆ కారణంచేత దేవతా మూర్తులసంఖ్యనుకూడ పెంచారు. వైష్ణవ ఆలయాల సంఖ్యనుకూడ ఆంధ్రదేశంలో పెంచారు.

తాళ్ళపాక అన్నమయ్య సాహిత్య పరిశోధన పిహెచ్.డి.తోనే ఆగిపోకుండా, అధ్యాపకవృత్తిని చేపట్టిన తర్వాతకూడ కొనసాగిస్తున్న నన్ను ప్రోత్సహిస్తూ అభిప్రాయం వ్రాసి యిచ్చిన మద్గురువర్యులు ఆచార్య సర్వోత్తమరావు గారికి....

ఆగమ సంప్రదాయాలను తెలియజేసి, నా ప్రయత్నాన్ని ప్రోత్సహించి నామనసులోని మాటను తెలియజేయగానే అభిప్రాయం వ్రాసి యిచ్చిన పండితప్రకాండులు, గురుతుల్యులు ఆచార్య ఎస్.బి రఘునాథాచార్యులు గారికి....

అన్నమయ్యమీద నిరంతరం కృషిచేయమని ప్రోత్సహిస్తున్న మిత్రులు, సహాధ్యాయి (ఎం.ఏ.,) డా॥ మేడసాని మోహన్ గారికి....

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, గొప్ప పరిపాలనాధ్యక్షులు శ్రీ ఎం.వి.ఎస్. ప్రసాద్, ఐ.ఎ.ఎస్., గారికి....

నా నిరంతర కృషిని ప్రోత్సహిస్తున్న నా శ్రీమతి నాగేశ్వరి, మిత్రుడు డా॥ టి. జి. ఆర్. ప్రసాద్, డా॥ ఎస్. విజయకుమార్ గార్లకు....

అతి స్వల్పకాలంలో అందంగా అచ్చొత్తించి ఇచ్చిన శ్రీ సత్యసాయి ప్రింటర్సు వారికి....

అందరికీ కృతజ్ఞతలు.

కర్నూలు
ఫిబ్రవరి 93

**డా॥ చిట్రాజు గోవిందరాజు**

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1 | అన్నమయ్య చూపులు | 1 |
| 2 | శ్రీవేంకశ్వరోదాహరణం | 15 |
| 3 | పెదతిరుమలయ్య-చినతిరుమలయ్య దర్శించిన దేవతామూర్తులు-ఉత్సవాలు | 39 |
| 4 | అనుబంధం | 103 |

# పదార్చన

## 1. తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనల్లో చూపులు :

"చూపులెన్ని లేవు నీవు సొలయుచు జూచేవి" (29-353)

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్" అని పెద్దలంటారు. అన్ని అవయవాలలో కళ్ళకున్న ప్రాధాన్యం మాటలతో చెప్పడానికి వీలులేదు. దేవతల పాదాలు కనిపించవంటారు. కాని ఆ దేవతల కండ్లను కవులు, రమణీయంగా వర్ణించడం వుంది. దేవతలకు, రాక్షసులకు, మనుషులకు, చివరికి జంతుజాలానికి కూడా కళ్లు చాలా ముఖ్యం. పురాణాలలో కళ్ళకు సంబంధించిన కథలు చాలావున్నాయి అలంకార గ్రంథాలలో కళ్ళకు, కళ్ళచూపులకు ఎన్నో కవి సమయాలు చూపినారు. అయితే తాళ్ళపాక అన్నమయ్య పండితులకు, పామరులకూ, మధ్య శిష్టసాహిత్యానికి, జానపద సాహిత్యానికీ మధ్య ఒక

సేతువులాంటివాడుకావడంవల్ల కనుల్ని, కనుచూపుల్ని అనేకరకాలుగా వర్ణించాడు. వాటిలో కొన్నిటిని మాత్రం చెప్పడం ఈ వ్యాసోద్దేశం.

అన్నమయ్య చూపుల్ని ఔపమ్యవీక్షణాలు, ఆంగిక వీక్షణాలు, భావాత్మక వీక్షణాలు, స్థానగతవీక్షణాలు, మరికొన్ని చూపులు అని వర్గీకరించడానికి వీలుంది.

ఔపమ్యవీక్షణాలు :

ఉపమ అంటే పోలిక. ఉపమయొక్క భావం ఔపమ్యం. ఆయా చూపులకు పోలికలు చెప్పడం. పోలికలతోకూడిన వీక్షణాలు చెప్పడం ఈ విభాగంలో చేరుతుంది. కెందామరలవంటి కనుచూపులు క్రొమ్మెరపు చూపు, గాలపుచూపులు మొదలైనవి.

కెందామరలవంటి కనుచూపులు :

"మచ్చికగల పతివి మంచిదయ్యీని
ఇచ్చకము సేసుకొన యెనయ రాదా ॥పల్లవి॥
వసమై కెందామరలవంటి కనుచూపులు
దెసలనెట్టి నుండక తెల్లనుండినా
యెసగి కోపమంటాను యేల దూరేవు
పొసగ గ్రపము గొంతపొదుపుకోరాధా ॥మచ్చి॥(29-3-4)

కన్నులను, కలువలతోను, తామరతోను, పోల్చడం కవి సమయం. ఇక్కడ కవి కెందామరలవంటి కనుచూపులని వాడాడు.

నాయకుడు నాయికకోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడు. ఏ కారణంవల్లనో నాయిక సమయానికి సంకేతస్థలం చేరుకోలేదు. నాయకుడు బిగుసుకున్నాడు. నాయిక నయాన, భయాన బతి-

మాలింది. అయినా కొండెక్కి కూర్చున్నాడు నాయిక చెలికత్తె చూచింది. నాయికాపక్షంగా వాదాడడం మొదలుపెట్టింది. కెందామర కనుచూపులతో నాయిక చూడడం తప్పుకాదా అన్నాడు నాయకుడు. కెందామర అంటే ఎర్రతామర. ఇక్కడి ఎర్రదనం కోపంవల్ల కావచ్చు. విసిగి వేసారిన విరహం కావచ్చు. కారణాలు చెప్పినా బిగుసుకోవడం చూడవచ్చు. అంచేత నాయిక కెందామర చూపులు తప్పుకాదని చెలికత్తె సమర్థించింది. ఏలుకొంటే చాలు అవన్నీ అనురాగపు గుర్తులని భరోసా పలికింది.

క్రొమ్మెరుగుచూపు :

కోరినట్టె ఆయనీకు గోవిందుడా మా
కూరిమి మఱవకుమీ గోవిందుడా ॥పల్లవి॥
క్రొమ్మెఱుగుచూపు గోవిందుడా
కుమ్మరించేవు వలపు గోవిందుడా
కుమ్మెవో గోరనొత్తకు గోవిందుడా నీ
కొమ్మలెల్లా నవ్వేరు గోవిందుడా ॥కోరి॥ (30-452)

ఈ చూపు పురుషునికి సంబంధించినది. నందకులంలో నారీలోకమంతా సరోవరంలో స్నానమాడుతుంటే, కీర్తించే సందర్భంలో ఈ చూపు వర్ణన వుంది. ఈ ప్రయోగంలో ఒక విశేషం వుంది. మెరుపులను చూచిన చూపా లేదా మెరపువంటి చూపా అన్నది సందేహం. స్త్రీలను మెరపులతో పోల్చడం కవి సమయం. సరోవరంలో స్నానం చేసి స్త్రీలు మెరపులాగా మెరసి మాయామవుతున్నారు. మబ్బు నల్లన్న నీళ్ళుకూడా నల్లన. మబ్బులనుండి తళుక్కున మెరసే మెరపును నీళ్ళలో మెరపులా మెరిసే స్త్రీలను వీళ్ళందరిని పొన్నచెట్టు కొమ్మల్లో

నుండి గోవిందుడు చూచే చూపు కావచ్చు లేదా మెరపువంటిదైన గోవిందుని చూపు కావచ్చు. మెరపు క్షణకాలం మాత్రం ప్రకాశించి మాయామవుతుంది. అలాగే భగవంతునియొక్క కరుణమెరపులాంటిదే ఆ కరుణా వీక్షణం అందరికి అందేదికాదు. ఆ భాగ్యం పొందినవారు మహనీయులు, మాననీయులు.

గాలపుచూపులు :

కానీ పోయి అందుకేమి కడపరాయ
కానవచ్చె నీ పనులు కడపరాయా ॥పల్లవి॥
కాలుదాకించకు మంత కడపరాయా
గాలపుచూపులు మాలి కడపరాయ
కాలమందె నీవారము కడిపరాయ మాలో
కైబాటాలు వెట్టకుమీ కడపరాయ (29-326)

ఈ చూపులు ప్రసక్తి కడపరాయనికి సంబంధించినది. కడపలోని రాయడు శ్రీ వేంకటేశ్వరుడు. అతనిది కమనీయ విగ్రహం. కాంచిన వారిని మరపించే ఆకారం, కాని అతన్నే కట్టివడవేసిన కాంతామణులు కూడ వున్నారు. వారి చూపులు గాలపు చూపులు. గాలంతో చేపలు పట్టడం సామాన్య విషయం. అయితే గాలపు బారినుండి చేపలు తప్పించుకొంటాయి. ఇక్కడ గాలపుచూపులతో అది మీనమూర్తి అయిన స్వామిని తమ వానిగా జేసుకోవడం ఇక్కడి విశేషం. భగవంతుడు ఎంత స్వతంత్రుడైనా భక్తులకు లొంగిపోతున్నాడు.

భక్తుల ఆత్మలనుండితప్పుకోవడం సాధ్యమయ్యేవిషయంకాదు. చూపులతో కట్టివడెయ్యడం అంటే భగవంతుని తన వశం చేసుకోవడం

లాంటిదే. పుండరీకుడు విఠ్ఠలుణ్ణి ఇటుకమీద నిలబడమన్నాడు. బాణాసురుడు శివుని తన వాకిటికి కావలాగా వుండమన్నాడు. సత్యభామ కృష్ణుని తని చూపులతోనే కదలనీయకకుండా కట్టి పడవేసింది.

సానబెట్టినచూపులు :

కలది గలట్టె యీడు కాదనే మా
నిలుకడైన పనికి నీకేల వెఱవ
సానబట్టకు చూపులు సాధించెనంటా నాపై
అనలు వెట్టకు మరి అది దోసము
నానబెట్ట కంతేసి నవ్వులు నామోము చూచి
నేనేమ(మం)టిని నిన్ను నీకేల వెఱవు ॥కల॥ 31-349

కత్తుల్ని కత్తెరల్ని సానబెట్టడం అందరికి తెలిసిందే. సానపెట్టడంవల్ల వాటిలో వాడితనం పెరుగుతోంది. సానలేకపోతే మొద్దుబారుతుంది. మొద్దుబారినవి దేనికి పనికిరావు. నాయిక గడుసరి. నాయకుడు తన మాట వింటున్నంతసేపు ఇంటికొదిగిన ఇల్లాలిగా నటించింది. ఏ పని తెలియని అమాయకపు స్త్రీలా మెలగింది. తేట మాటలాడింది. నాయకుడు కాస్త తనమాట వినడంలేదని తెలిసేసరికి సానబెట్టిన చూపులతో జపించిదంట. అనుకూలంగా విన్నంతమాత్రాన మొద్దు-బారిందనుకోకు. అవసరమయితే ఈ చూపుల పదునుతో దారికి తెస్తా-నని గదమాయించింది.

జూటరిచూపు :

అడివో కనుగొను మదియొకతె
యెదుటనే నెలకొనె నిదియొకతె ॥పల్లవి॥
తేటల మాటలదెరలదే కట్టి

గాటుక కన్నుల కలికొకతె
జూటరిచూపుల జొక్కులు చల్లీ
నీటుగత్వముల నెలకొకతె (30-68)

"జూటరి" అంటే అబద్ధాలాడేవాడు. అబద్ధాలుపలకడం హృదయగతం. కాని అబద్ధాలాడే వ్యక్తి ఆంగికంగా చాల జాగ్రత్తపడతాడు. తాను సత్యవంతుడని నమ్మించడానికి అమాయకపు చూపులు ప్రసరిస్తాడు. నమ్మితే చాలు బుట్టలో పడేస్తాడు.

నాయిక చాల గడుసరి. అసలే అందగత్తె. ఆపై మాటలు తెరలుగట్టింది. చూపులు చొక్కులు చల్లింది. ఆ కనువాలుకు, ఆ నీటు దనానికి సొమ్మసిల్లిన వ్యక్తి ఈచూపులతో ఇంకా డీలాపడిపోయాడు.

ఇవేగాక సూడిదెగా చూపులు (29-322) బొమ్మలవిల్లు చూపులు (30-48) చూపుల అమ్ములు (30-48) విడుదలచూపుల నిలంబు (30-49) మొదలైనవి. ఔపమ్యవీక్షణ వర్గీకరణలో చేర్చదగినవి.

ఆంగికవీక్షణాలు :

అంగాలకు సంబంధించింది ఆంగికం. చూనేడమనేది కనులకే ముఖ్యమైంది. అలా చూడడంతో ఇతర అంగాలకుకూడ కొంత ప్రాధాన్యం జతచేసి చెప్పడం అంగికవీక్షణం. అంతేగాక అవయవాల కదలికలకు తక్కువ ప్రాధాన్యంకల్పించి చూపులకు మాత్రం ప్రాముఖ్యం యివ్వడం తప్పనిసరి. ఈ విభాగంలో శిరసెత్తి చూచి, కులుకుచూపు మొదలైనవి చేరతాయి.

శిరసెత్తి చూచి :

ఎఱగనట్టే వున్నాడవేమీ నీవు
నెఱయుదెరమఱగు నీవే తేరుచుమీ ॥పల్లవి॥

సరిపెండ్లికూతులను సంతము వేయుమంటే
శిరసెత్తి చూచి చూచి సిగ్గుపడేవు
నిరతి శ్రీ వేంకటేశ నేరుపెల్లా నీవాళ్ళిదే
తిరమై నన్నేలితివి తేరుచుమా నీవే (31-416)

ఇక్కడ నాయకుడు దక్షిణుడు. అతనిచుట్టూ అంగనాజనం వున్నారు. ఎంత మగవాడయినా అంతమంది ఆడవారి మధ్య వుండడంలో సిగ్గు పడడం నాయకుని వంతు అయింది. నాయకుడు సిగ్గు పడుతుంటే చెలికత్తెలు ఆట పట్టించాలనుకున్నారు. ఇంత సిగ్గుపడేవాడివి కాపురం ఎలా చేస్తావయ్యా అని పరిహాసం చేశారు. తప్పు చేయడం నీ వంతు. తప్పుగా సమర్థించుకోవడం కూడా నీవంతే. పెళ్ళికూతుళ్ళను చూడ-వయ్యా అని మరీ బతిమాలితే, శిరసెత్తి చూచి "సిగ్గుపడతావెందుకు. అన్నారు.

పెళ్లి వేళ శిరసెత్తి చూడడం స్త్రీలకు సాధ్యమయ్యే విషయం కాదు. స్త్రీల చేష్టల్ని పురుషులకి అన్వయించడం ఇక్కడి ప్రత్యేకత. అలాగే "నాయిక" చాల జాగ్రత్త మనిషి. నాయకుణ్ణి చూడాలను-కొంటుంది. తాను చూడడం ఇతరులు చూడరాదని భావిస్తుంది. అదే సందర్భంలో నాయకుని మమతానురాగాలు తనకే దక్కాలని ఊహించుకుంటుంది. ఈ కథ అంతా చెలికత్తెలు పసిగట్టారు. ఇంకా దాచడం మంచిదికాదనుకున్నారు. చెలికత్తె బండారం బయట పెట్టారు.

అయ్యా నాయికకు నిన్ను చూడగానే చిరుచమటలు పట్టాయి. ఆ చెమటలే కాలువలై ప్రవహిస్తున్నాయి. నిన్ను చూడగానే ఆమె సంతోషపారవశ్యాన్ని అణచుకోలేకపోయింది. తాను పట్టుపడ్డాననే

సైవంతో తల వంచింది. తల వంచుకొని నాయకునివైపు దృష్టి సారించింది.

ఉలుకుచూపు :

ఒక్కమాటే ఇంతయేల వోరుచుకొనేవు
వెక్కసపు నీనుతికి వేడకయ్యీగాని ॥పల్లవి॥
చలమెంత గలిగినా సారె సారె బతికి
గులుకుజూపులలోనే నువ్వళించవే
చెలగి ఇద్దరికిసె (సెండి) జెరి వెంత గలిగినా
పలుకుల రసాల బచ్చిదేరీగాని ॥ఒక్క॥ (30-80)

తన అధీనంలో తాను లేనప్పుడు పారవశ్యం కలిగినపుడు ఉలకడమనే క్రియ జరుగుతూ వుంటుంది. దీనితో ఒక ప్రయోజనంకూడ జత అయితే ఈ ఆంగికచలనం ఎక్కువగా వుంటుంది. స్వామిని జూచిన స్త్రీలు వశం తప్పారు. వారిచేతల్లో సౌందర్య గర్వంకూడా వుంది. సౌందర్య ప్రదర్శన కూడా వుంది. ఇలాంటి చూపులకు అతనిరూపమే లక్ష్యం కావడం ఒక ప్రత్యేకత.

ఇవేగాక ఓరగండ్లను చూచి (29-51), కొనచూపులు (29-597) కదలుగన్నుల జూచి (29-41), నిక్కిచూతురు (28-104), నిట్టచూచి, (30-61), తొంగిచూచి (31-84), అవలనీవల్లా జూచి (31-234), తల వంచుకొని చూచి (31-422) మొదలైనవి ఈ విభాగంలో చేరతాయి.

భావాత్మకవీక్షణాలు :

మనసులోని భావాలను మాటలతోకాని, కళ్ళద్వారా కనుచూపుల ద్వారా ప్రదర్శించేవి భావాత్మక వీక్షణాలు అవుతాయి. ఈభావాత్మక వీక్షణాలు ఒట్టినచూపు, తప్పకచూపు, మోహపుచూపులు మొదలైనవి చేరుతాయి.

ఒట్టినచూపు :

నామేనే యంత సేసె నాయెదకు
కామించి కడవారు గాబోయేరు ॥పల్లవి॥
ఇన్నియు నోరుచుకొని ఇంతుల దూరగలేక
కన్నులపెట్టె పొద్దు గడపగను
వున్నరీతినే వుండి పొట్టిన చూపులు నాకు
పున్నమవెన్నెల నీడై పొంగు వచ్చీనే ॥నామే॥(29-578)

తన సత్యాన్ని నిరూపించుకోవడం ఒట్టు పెట్టడం అలవాటు. ఈ ఒట్టు పాదాల ఆనగా, మనసు ఆనగా తరచూ చెప్పడం అలవాటు. కాని ఒట్టు పెట్టుకొన్న చూపులుగా చెప్పడం ఒక వింత ప్రయోగం.

ఇక్కడ నాయకుడు మౌనుడు. నాయికతో మాట. పలుకు సాగించినట్టులేదు. కేవలం నాయికను దర్శించడంతో ఆ చూపుల్ని తట్టులేకపోయింది. ఒక్కసారిగా పూతపూసినట్లుగా పులకలుపుట్టినాయి. స్త్రీల మధ్య వున్నప్పటికి నాయికపైపు ఒట్టినచూపులు ప్రసరించినాడు. అంగనామణులమధ్య వున్నప్పటికి తాను అందరిలాంటివాడను కానని తన అనురాగమంతాకూడ నాయిక మీదనే తెలిపే విధంగా చూపులు ప్రసరించినాడు. చూపుల్లో దైన్యం వుండవచ్చు. ధైర్యం వుండ-వచ్చు, ధీమా వుండవచ్చు, ధీశక్తి వుండవచ్చు. కాని ఒట్టుపెట్టినట్టుగా చూడడం ప్రత్యేకత.

తప్పకచూచు :

నిలుచున్నాడల్లవాడె నివ్వెరగుతో
తలపెట్ల జేకొని దగ్గరవె తరుణి ॥పల్లవి॥
తప్పక చూచుచునట్టె తలచు నిన్నాతుమలో

పుష్పొడిగా జుంజుకొన బులకించును
పుప్పతిల్లు విరహాన పూరకే గోరగిరు
దప్పి దేరనిమ్మని దగ్గరవే తరుణి ॥నిలు॥ (29-56)

రెప్పవాల్చకుండా తప్పక చూడడం తప్పక చూడడంలోని భాగం. తప్పక చూచుచునట్టె తలచు నిన్నాతుమలోచూడడం రెండూ ఒకేసారి సాధ్యమయ్యే విషయాలుకావు. కాని వేంకటేశ్వరునిలో రెండుభాగాల సమైక్యతను అన్నమయ్య నిరూపించినాడు.

పై కీర్తనలో దశావతార సమన్వయంవుంది. తప్పకచూడడంలో మత్స్యావతారం కనిపిస్తుంది. నాయికకోసం నాయకుడు రెప్పవాల్చకుండా చూడడం సౌందర్య ఆరాధ్యంలో భాగమే.

మోహపుచూపులు :

ఎఱిగిన జాణలది ఇట్టి మోహము
మఱవరా దాలికి మగని మోహము ॥పల్లవి॥
వినయము చేసితేను వెగ్గళించు మోహము
ననుపు చక్కనయితే నాటు మోహము
యెనసిన మాటలైతే యీడేరు మోహము
మనసురా మెలగితే మాననీదు మోహము ॥ఎఱి॥

యేపొద్దు గాచుకుండితే యిరవౌను మోహము
యేపుమీరి పైకొంటే ఇంపు మోహము
కోపమెందు లేకుండితే కొనసాగు మోహము
చూపుసెట్టుకో జూచితే సులభమౌ మోహము ॥ఎఱి॥

ఇచ్చకమే సెరపితే నియ్యకోలౌ మోహము

నిచ్చకొత్తగా గూడితే నిండు మోహము
వచ్చి శ్రీవేంకటేశుడే వదలక నన్ను నేలె
తచ్చితచ్చి కొసరితే తగులౌనుమోహము ॥ఎటి॥(30-557)

కీర్తనలో వర్ణించాడు.

అనురాగం వేరు. మోహం వేరు. మోహంలో ఆంగిక రతికే ప్రాధాన్యం. అందులో వావివరుసలపాలు అంతంతమాత్రమే. అను-రాగం అలాంటిదికాదు. ఇక్కడ నాయిక, నాయకునిపై మరులు గొన్నవి ఆమె చూపుల్లో మోహం తొణికిసలాడుతుంది.

కళ్ళు ఒకచోట, చూపులు ఒకచోట అనడం సాధారణం. కళ్ళేమో వలచిన స్త్రీ దగ్గరే వున్నాయి. కాని కళ్ళ ధర్మమైన చూపుమాత్రం నాయకునితో దోబూచులాడుతునాయి. కొలనులో తామరలుండవచ్చు. చెట్లలో పూవులు వుండవచ్చు. పరిమళం వేరేచోట వున్నట్టు చూపులు వున్నాయి అని అన్నమయ్య పై కీర్తనలో చెప్పాడు.

మోహం ఎంతనింద్యమైనప్పటికీ దానికి పరిమళం అంటగట్టడం అన్నమయ్య ప్రత్యేకత. ఈ మోహం పరమాత్మపరం కావడమే గమనార్హం. పరమాత్మపట్ల అనురాగమైనా, మోహమైనా రెండూ కూడా ఒకేరకమైన ఫలితాన్ని యిస్తాయి.

చూపులైనా అవి నిన్ను చుట్టుకొనవా :

నగవింటే యేమనినా నాకు బోవునా
మొగమేడ అద్దమేడ ముచ్చటలు గావా ॥పల్లవి॥
పైపై నాచేత నన్ను బట్టనీక తోసినాను
చూపులైనా నిన్ను నవి చుట్టుకొనవా
పావడాదు పొలుగలపాయపు వారి పొందు
తీపుచేత పూవులేడ తేనెలై కురియవా (30-10)

నాయిక సత్యభామలాంటిది. నాయకుడు ఏమి చేశాడో కాని అలిగింది. మారు మంచమెక్కింది. నాయకుడు దగ్గరికి వచ్చాడు. కాని కోపంతో త్రోసివేసింది. కాని నాయకుడు మగవాడని పంతం పట్టలేదు. నా చూపుల్లో నీవు బందీవని చమత్కరించాడు. చూపుల వరుసల్ని సన్నపు దారాలుగా ఊహించడం ఒక వింతభావన. పూవు ఒకచోట, తావి ఒక చోట వుండదు. నీరులేక మబ్బులేదు. అందువల్ల నాయికా నాయకులు అన్యోన్య అనుబంధం వుందని భావన.

ఇవేగాక మర్మపుజూపు (29-56), అలరినచూపు (29-375), చిమ్మజూపు (29-33), సళుపుజూపు (29-25), వుదుటునజూచి (29-99), కొసరుజూపులు (29-10), ఏమరించజూచేవు (29-226), దయవారు జూపులు (29-328), జంకించి చూచితేను (29-339), చొక్కపుచూపులు (29-390), విడుదల చూపులు (30-49), మొలసేచూపులు (30-355) మొదలైనవి ఈ విభాగంలో చేర్చదగినవి.

స్థానగత వీక్షణాలు :

ఒక వ్యక్తి నిర్దిష్ట ప్రదేశంలో నిలిచి చూచే చూపులు స్థానగత వీక్షణాలు. అది అలా చూడడం చెట్టు వెనుక కావచ్చు, చెట్టుగుబురు కావచ్చు, చుట్టూ కావచ్చు. గోడ అడ్డుగా పొంచి చూడడం కావచ్చు. అన్నమయ్య తోరణాల వెనక దాగి చూచే స్త్రీలను క్రింది కీర్తనలో వర్ణించాడు.

ఏలనీకు వెరపూ ఇన్నిటా గెలిచితివి
నాలిమాని నీతో నేను నవ్వుచుండగాను ॥పల్లవి॥
మంతనాన నీవావెతో మాటలాడిన సుద్దులు
ఇంతయు నాతో జెప్పిరిందరు నేడు
యెంతకెంత సేసి నాతో యేలానలు పెట్టేవు
రంతు చేసి నిన్ను నేను రవ్వ పెట్టేనా ॥ఏల॥

సిగ్గువడకిందరును జేసిన సేతలెల్ల
నిగ్గుల సోరకాగండ్లనేజూచితి
అగ్గమై సోకిరులేల అట్టె నాకు దెలిపేవు
తగ్గించి నిన్నిక నేను తలవంపించేనా ॥ఏల॥

కలసిన మీలోని కాపిరాలు నిన్న రేయి
కలలోనే కంట శ్రీవేంకటగిరీశా
చెలగి నన్నిట్టె కూలి చెక్కులేల నొక్కేవు
పలుమారు యిక నిన్ను బంగించేనా ॥ఏల॥ (29 210)

ఎదురుచూచిన చూపు :

ఇష్టులయిన వ్యక్తులకోసం ఒకచోట కాచుకుకూర్చొని వుండడం ఎదురుచూచిన చూపు. ఈ చూపుల్ని అన్నమయ్య–

ఇటమీద మీ చిత్తమెట్లో కాని
కుటిలకుంతలి పొందే గుణము వో విభుడాని ॥పల్లవి॥
యింతి నీకు మేడమీద నెదురుచూచినచూపు
దొంతులై పెరిగి మరుతూపు లాయను
యింతట విచ్చేయకున్న యివి యిన్నియును నీపై
చెంతల వడ్డికి బారు చెప్పితిబోవిభుడా ॥ఇట॥ (30-42)

కీర్తనలో వర్ణించాడు.

మరికొన్ని చూపులు :

మగిడిచూచితేను (29-30), తేరకొన నన్ను జూచి (29-94), కొసరుజూపులు (29-101), ఎలయింపుజూపు [29-141], నిట్టచూపు [29-228], చూపులు నాటించి [29-229], చిలుకుజూపులు[29-262], చక్కగచూచినచూపు [29-302], తేటలూరి నీచూపులు [29-315],

చుంగులనీతెలిచూపులు [30-66], వంచినచూపుల [30-108], నాటు చూపుల [30-175], చంచలగనుచూపు [30-181], చెంగలిచూపుల జూచి [30-351], కలికికన్నులచూపు [30-464], కమ్మిచూపు [30-483], చల్లనిచూపులు [30-496], మొగమాటపుచూపు [30-517], కొంతపు జూపుల [30-496], మరలిచూచేదాని (30-571), తలయెత్తి చూడరాదా [31-5], వాడికచూపుల (31-9), కనుచూపులనే చూచి [31-15], కొంచిచూచిరే [31-58], పొలపుగనుసన్నలచూపు[31-76] ఇరవుగాజూచి [31-79], తొంగిచూచి [31-84], కన్నులదేలించిచూచి [31. 91], నెట్టుకొనెజూపులు [31-108], గాడిపారజూచినాను [31-133], తమితోజూచిన చూపు [31-134], వెనకుజూచే [31-143], దిష్టించి తగులజూచే [31-177], కాటుక కన్నులజూచి [31-178], తమకించజూచేవు [31-195], పొలపుజూపు [31-206], పమ్మిన చూపుల [31-227], వాలుకచూపులు [31-280], చొక్కపుజూపుల (31-286), బిత్తరినీచూపుల, (31-376) సోలించిచూచితి (31-410) మొదలైనవి

మరికొన్ని చూపులు :

రవి గాననిచో కవి కాంచువాడేగదా అనిప్పడంచె పరిపాటి. కవి చూపులు ఎక్స్-రే కళ్ళలాంటివి. ఆ చూపుల్లో పడనివారులేరు. ఆ చూపుల్ని సరసంగా, అందంగా, హుందగా, సాభిప్రాయంగా వర్ణించిన వాగ్గేయకారుడు అన్నమయ్య.

## 2. శ్రీ వేంకటేశ్వరోదాహరణం :

ఆంధ్రవాఙ్మయం ప్రత్యేకతను నిరూపించే శాఖలలో ఉదా-హరణప్రక్రియ ఒకటి. సంస్కృతవాఙ్మయంలో "ఉదాహరణం" అనేమాటవున్నా ఈప్రక్రియ బాగా విస్తరించింది. తెలుగుసాహిత్యం లోనే అనడంలో ఎలాంటి సందేహంలేదు. ఈ ఉదాహరణ వాఙ్మయం గురించి ప్రముఖుల అభిప్రాయాలు.

ఆచార్య యస్వీ. జోగారావు గారు "భగవన్మాహాత్మ్యము నుదా హరించు స్తోత్రప్రాయమైన రచన. కావున నీ కావ్యప్రభేదమునకు ఉదాహరణమనుపేరు ఉచితము, సార్థకమును. స్తోత్రప్రాయ రచన మనగా ఉత్త సాధారణ స్తోత్రముగాదు. అదియొక విశిష్టమైన రచనా పద్ధతి, నిబద్ధతయుగలది" అని పేర్కొన్నారు.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు "జగత్తంతయు క్రియాస్వరూపము. సర్వక్రియయు బరమేశ్వరునందు బర్య-

వసించును. ధాతువు సర్వథా విభక్త్యాశ్రయము ఏవిభక్తికోసంబంధము లేక క్రియలేదు. అందుచేత నన్ని విభక్తులతో బరమేశ్వరుని జెప్పినప్పుడు భగవంతుడు సర్వక్రియా స్థానభూతుడని వ్యంగ్యము. ఇదియుదాహరణ కావ్యరహస్యము" అని అన్నారు.

ఉదాహరణ సాహిత్య ఆవిర్భావం వికాసం :

ఉదాహరణం ప్రధానంగా స్తుతిరూపం. ఈ స్తుతులు వైదిక సాహిత్యంలో మొదటిదైన ఋగ్వేదంలో వున్నాయి. ఈ స్తుతులున్న సూక్తాలకు "కుంతాపసూక్తములు" అనిపేరు. ఈ సూక్తులు ఋగ్వేదంలో 20వ కాండలో వున్నాయి. వీటిని "నారాశంసి" అనికూడా పేర్కొంటారు.

ప్రాచీన లౌకిక సంస్కృతకావ్యాల్లో "ఉదాహరణం" అనే పేరు స్పష్టంగా వుంది. కవికులగురువు కాళిదాసు రఘువంశంలో (4-79) విక్రమోర్వశీయనాటకం (2-15)లో ఉదాహరణం ప్రస్తావించాడు. కాళిదాసుకన్న ప్రాచీనుడయిన భరతముని నాట్యశాస్త్రంలో కళికోత్కళికలను ప్రస్తావించాడు. అయితే అనాటి వీటి స్వరూపం మనకు స్పష్టంగా తెలియదు.

సంస్కృతభాషలో వెలువడిన ఉదాహరణ కావ్యాలను పరిశీలిస్తే అవి తెలుగుభాషలోని ఉదాహరణ రచనారీతిని అనుసరించి రూపొందినట్లు చెప్పవచ్చు. "ద్విపద" అనేమాటలాగా "ఉదాహరణం" అనే పేరుకూడా సంస్కృతభాషనుండి వచ్చి వుంటుందని పండితుల అభిప్రాయం. ఇలా తెలుగు సాహిత్యంలో ప్రవేశించిన ఉదాహరణం అనేక విషయాలతో ఛంద సంప్రదాయాలలో సమ్మేళనరూపంలో రూపొందిన విశిష్ట రచనారీతి అని చెప్పక తప్పదు.

మత ప్రచారానికి సాహిత్యాన్ని సాధనంగా స్వీకరించి అనేక నూతన లఘు ప్రక్రియలకు ప్రారంభకుడై శ్రీకారం చుట్టినవాడు పాల్కురికి సోమన. కాబట్టి ఉదాహరణ వాఙ్మయశాఖకు సాహితీ బ్రహ్మ అయినాడని చెప్పవచ్చు. లభ్యమయిన ఉదాహరణ కావ్యాల్లో బసవోదాహరణమే మొట్టమొదటిది. సంస్కృతభాషలోకూడ ఇతని ఉదాహరణ కావ్యమే ఆద్యమైంది.

పాల్కురికి సోమనాథుని రచనారీతిని అనుసరించి రావిపాటి త్రిపురాంతకుడు త్రిపురాంత కోదాహరణాన్ని తాళ్ళ పెదతిరుమలయ్య శ్రీవేంకటేశ్వరోదాహరణ కావ్యాన్ని రచించారు. వీరిద్దరూ అందులోని కొన్ని మార్పులను చేసి అనుసరించి ఒక నియమిత రూపాన్ని ఏర్పరచారు.

సోమనాథుల రచనలను పరిశీలించి తెలుగు లాక్షణికులైన విన్నకోట పెద్దన (1403) అనంతుడు (1435) సంస్కృతలాక్షణికులైన విద్యానాథుడు (1320) పెదకోమటి వేమారెడ్డి (1400) గౌరన (1400) మొదలైనవారు సమగ్రంగా చర్చించారు. సోమనాథునికి పూర్వులైన లాక్షణికులెవ్వరు ఉదాహరణ వాఙ్మయ లక్షణాలను గురించి ప్రస్తావించలేదు.

ఉదాహరణలక్షణాలు :

1. ఉదాహరణం సప్తవిభక్తులను సంబోధన విభక్తిని ఉదాహరించు లఘుకృతిని. ఈ లఘుకృతి "శ్రీ"కారంతో ప్రారంభింపబడుతుంది.

2. ఇది ప్రధానంగా స్తోత్రరూపం అవడాన్నిబట్టి దేవతాపరంగా క్వాచిత్కంగా మానవపరంగాకూడ వుంటుంది.

3. ఉదాహరణ కావ్యాల్లో ప్రధానంగా ఎనిమిది వృత్తాలు, ఎనిమ్మిది కళికలు, ఎనిమిది ఉత్కళికలు, ఒక సార్వవిభక్తికపద్యం ఒక కవికృత నామాంకిత పద్యం అనే అయిదు విభాగాలతోగూడి మొత్తం 26 పద్యాలుంటాయి. ఈ 26 సంఖ్య సదాశివుని షడ్వింశతి తత్త్వద్యోతకం అంటారు.

4. వృత్తాల్లో అక్షరగణప్రధానాలై చంపక, ఉత్పల, శార్దూల, మత్తేభ వృత్తాలుంటాయి.

5. కళికమాత్రా ఛందస్సంబంధిత రగడభేదం. ఇందులో ఎనిమ్మిది పాదాలుంటాయి.

6. మార్గదేశి కవితా సమ్మేళనరూపమైన సాహిత్యప్రక్రియ.

7. ఉత్కళికలో కళిక సగభాగం అర్ధకళిక. ఉత్కళికలోగూడ ఎనిమిది పాదాలే వుంటాయి.

8. ఎనిమ్మిది పాదాలు వున్న కళికోత్కళికలలో ఒకే రగడ, ఛందం ప్రయుక్త మవుతుంది. కాని కళికలో వుండే మాత్రాగణ సంఖ్యలో సగం మాత్రమే ఉత్కళికలో వుండాలి.

9. సార్వవిభక్తికం ఒక్క పద్యంలోనే అన్ని విభక్తులు ఉదాహరింపబడుతాయి. ఇది సాధారణంగా శార్దూల వృత్తంగాని మత్తేభ వృత్తంగాని వుంటుంది.

10. ఉదాహరణ కావ్యాల్లో విభక్తి ప్రత్యయాలు వృత్తాలలో అన్ని పాదాలలో వుండక్కరలేదు. ప్రాయికంగా నాల్గవపాదంలో వుంటే చాలు. అయితే కళికలో మాత్రం ప్రతిపాదంలో వుండితీరాలి. ఉత్కళికలో ఈ నియమం అక్కరలేదు. కాని ఇందునూ చివరి రెండు

చరణాంతాల్లో ప్రత్యయాలు విధిగా వుండాలి. సంబోధనలో మాత్రం అన్ని పాదాలు సంబోధనాంతాలుగానే వుండాలి.

11. ఒక్క చతుర్థీ విభక్తియందు ఉత్కళికలో మాత్రం ప్రతి పాదాంతంలో "కై" అనే ప్రత్యయం విభక్తి ప్రత్యయం అయినా కాకపోయినా విభక్తివలె తలపిస్తూ వుండాలి. ఇట్లు విభక్తివలె తోచి విభక్తికాకుండే ఈ ప్రత్యయస్వరూపాన్నే లాక్షణికులు "విభక్త్యాభాసం" అని చెప్పారు.

12. కళికల్లో ప్రతిపాదం స్వతంత్ర కావ్యంగా వుండాలి. ఉత్కళికల్లో ఏకసమాసంగా పద్యపాదాలు వుండాలి.

13. వృత్తాల తరువాత కళికల ప్రారంభం "వెండియు"మఱియు అనే వాటితో కలసిపోతూ వుంటుంది.

14. కవికృత నామాంకిత పద్యంలో కవిపేరు, ఉదాహరణం పేరు నియతం.

15. ఇది కేవలం స్తుతిరూపకమైంది, కాబట్టి పాడుకోవటానికి యోగ్యంకూడా. ఇందలి పద్యాలు రాగాంగ ప్రధానాలు అంటే రాగాలతో పాడదగ్గవి. కళికోత్కళికలు తాళాంగ ప్రధానాలు. త్రిపుట-జంపె-రూపక తాళాలలోనే పాడాలి. ఆ తాళాలకు అనుకూలమైన త్ర్యశ్ర, చతురశ్ర, మిశ్ర జాతులందు ప్రకటితం కావాలి.

16. మహాకావ్యమందలి నాయకునివలె ఇందుకూడ నాయక గుణకీర్తనమే ప్రధానం.

17. "అల్పాక్షరముల ననల్పార్థరచన కల్పించుటయుగాదె కవి వివేకంబు" అన్న సూక్తికి ఉదాహరణ కావ్యాలు లక్ష్యాలు.

ఎనిమిది విభక్తులతో ఎనిమిది వృత్తాలు, ఎనిమిది కళికలు, ఎనిమిది ఉత్కళికలు, ఒక సార్వవిభక్తికపద్యం, చివర ఒకఅంకితాంక పద్యంచేర్చి రచింపబడిన స్తోత్రరూపం ఉదాహరణం అనిచెప్పవచ్చు

పెదతిరుమలయ్య - రచనలు :

తాళ్ళపాక అన్నమయ్య - అక్కమాంబల మగసంతానం పెద తిరుమలయ్య. ఇతడు 1458-1554 ప్రాంతంవాడు. శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య కవితార్కికకేసరి, శరణాగత వజ్రపంజర అనేవి ఇతని బిరుదాలు. ఇతని రచనలను పరిశీలిస్తే తిరుమలార్యుడు, తిమ్మయ్య, తిమ్మనార్యుడు, తిమ్మడు, తిరుమలయ్య, తిరుమలయ్యంగార్ అనేవి ఈతని పేర్లని స్పష్టమవుతాయి. ఈ పేర్లేగాక తిమ్మయార్యుడు, అన్నయ తిరుమలార్యుడు, తిరుమల తిరుమలాచార్యుడు, తిరుమల దేశికులు, వేంకటపతియోగి, తలపాక తిరుమలయ్య అనే పేర్లున్నాయని వేటూరి ఆనందమూర్తి వేంకటశేషయ్య గార్లు పేర్కొన్నారు.

పెద తిరుమలయ్య శృంగార ఆధ్యాత్మసంకీర్తనలు, వేంకటేశ్వర వచనాలు, శృంగారదండకం, చక్రవాళమంజరి, శృంగార వృత్త శతకం, వేంకటేశ్వరోదాహరణం, నీతిసీసశతకం, సుదర్శనరగడ, రేఫఱకారనిర్ణయం, భగవద్గీత తెలుగువచనం, ద్విపద హరివంశం, సంకీర్తన లక్షణవ్యాఖ్య, శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవం మొదలైనవి ద్విపదహరివంశం, సంకీర్తనలక్షణవ్యాఖ్య అలభ్యాలు.

ఇతని లఘుకృతులు పెక్కింటిలో శ్రీవేంకటేశ్వరోదాహరణం ఒకటి. ఇది వైష్ణవమతపరంగ వెలసిన మొదటి ఉదాహరణ కావ్యం. ఈ కావ్యం శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమై సప్తవిధ విభక్తుల్ని

ఉదాహరిస్తూ పరమార్థతత్వాన్ని తెలియజెప్పే భక్తిమయ రచన కావడంబట్టి శ్రీవేంకటేశ్వరోదాహరణం అనేపేరుసార్థకం. ఇది తెలుగులో వెలసిన ఉదాహరణ కావ్యాల్లో మూడవది అయినా ఆలంకారికులు నిర్ణయించిన లక్షణాలన్నీ సంతరించుకొన్న మొదటి ఉదాహరణ కావ్యంగూడ ఇదే అని చెప్పవచ్చు. దీనికి ముందు వెలువడిన బసవోదాహరణం, త్రిపురాంతకోదాహరణం రెండూకూడ శైవమత ప్రధానాలైన లఘుకావ్యాలు.

బసవోదాహరణంలో చంపకం, ఉత్పలమాల వృత్తాలు వాడబడినాయి. త్రిపురాంతకోదాహరణంలో షష్ఠీవిభక్తికిమాత్రం చంపకం తక్కిన విభక్తులన్నింటిలో ఉత్పలమాలా వృత్తాలు ప్రయోగింపబడి వున్నాయి. వేంకటేశ్వరోదాహరణంలో అన్ని విభక్తులకు ఉత్పలమాలా వృత్తాలలో రచన కొనసాగింది.

లక్షణ సమన్వయం :

తెలుగులో కావ్య రచన "శ్రీ"కారంతో ప్రారంభించాలనే నియమాన్ని పాల్కురికి సోమన బసవోదాహరణంలో, రావిపాటి త్రిపురాంతకుడు త్రిపురాంతకోదాహరణంలో, పెద తిరుమలయ్య శ్రీ వేంకటేశ్వరోదాహరణంలోను పాటించారు. ముగ్గురూకూడ ప్రారంభంలోఉత్పలమాలా వృత్తాన్నే వాడినారు.

పెద తిరుమలయ్య ప్రథమావిభక్తిలో వాడిన ఉత్పలమాలా వృత్తం.

శ్రీ కరుణా కరుండగుచు దీవుల దీవుల బ్రోచి కాచుచుం
గైకొని లోకముల్ మనిపి కర్తయు భర్తయునై మునుల్‌సురా
నీకము లోకముల బొగడ నీరజ జాతుని తాతయైన సు
శ్లోకుడు వేంకటేశ్వరుడు చూడగనొప్పెడు బ్రహ్మమింతకున్

కృతి చివర అంకితాంక పద్యం ఉండాలి. బసవ, త్రిపురాంతకోదాహరణకావ్యాల్లో అంకితాంకపద్యంలేదు. వేంకటేశ్వరోదాహరణంలో వేంకటేశ్వరస్వామికి అంకితంగా రచింపబడిన చివరి పద్యం.

ఆరవితారకంబుగ నుదాహరణంబు రచించె భక్తివి
స్ఫారత దాళ్ళపాక పురశాసనుడన్నయ తిమ్మనార్యుడిం
పారగ జక్రనందక గదాంబుజధారికి శ్రీవధూమనో
హారికి వేంకటాచల విహారికి శౌరికి నంకితంబుగాన్

ఈ పద్యంలో పెద తిరుమలయ్య తిరుమలాచార్యుడుగ పేర్కొన్నాడు.

ఉదాహరణకావ్యాల్లో విభక్తి ప్రత్యయాలు వృత్తాల్లో సర్వత్రగాక నాల్గవపాదంలో ఉంటేచాలు. కళికలోమాత్రం ప్రతిపాదాంతంలో వుండాలి. ఉత్కళికలో ఈ నియమం పాటించ అక్కరలేదు, అయితే రెండుపాదాల్లో మాత్రం విధిగా వుండాలి. పెద తిరుమలయ్య ఈ నియమం పాటించాడు.

ద్వితీయావిభక్తి

ఉ॥ ఏటికి వేల్పులార చదలేటికి బోయెదరిందు రండు కో
నేటికి వచ్చు దిర్థచయమెల్ల లక్ష్మలతోడగూడుము
క్కోటియునంచు బల్కు మునికోటుల మాటలనేర్చి కీరముల్
చాటు తటాట విస్మితన సల్పెడు వేంకట భర్త గొల్చెదన్

కళిక

మఱియు నెఱిగిన బుధుల మనసు లెనసినవాని
మెఱగులకు గురియైన మేను పూనినవాని

గొల్లెతల నెల్లడల గూడిమాడినవాని
మల్లులను విల్లా[illegible]టు మట్టికొట్టినవాని
జక్రమున నక్రమును జడియ నడిచినవాని
శుక్రుడొక వక్రగతి చూపజోపినవాని
వీరుడగు కౌరవుని వీడనాడినవాని
శూరుడగు సీరితో జోడుగూడినవాని

ఉత్కళిక

మేడెములు గూడుకొని
వాడలను దాడిగొని
యుట్టులను జట్టులను
దెట్టెలుగ గొట్టిచని
యాటలను బాటలను
జోటులను మాటుకొని
కలసి మెలసినవాని
దులసి వలసినవాని

ఉదాహరణంలో ఒక్క చతుర్థివిభక్తిలో మాత్రం ఉత్కళిక ప్రతి పాదాంతంలో "కై" అనే ప్రత్యయం ఉండాలని నియమం. విభక్తి ప్రత్యయం కాకపోయినా విభక్తి ప్రత్యయంవలె తలపిస్తే చాలు. చివరి రెండుపాదాల్లోమాత్రం విభక్తి ప్రత్యయమైన "కై" ప్రత్యయం వుండాలి. ఈ నియమం సోమన బసవోదాహరణంలో కనిపించదు. త్రిపురాంతకోదాహరణంలో "కై" ప్రత్యయం విభక్త్యాభ్యాసరూపంలో కనిపిస్తుంది. చివరి రెండు పాదాంతాల్లోనేగాక కొన్ని యితర పాదాంతాల్లో "కై" విభక్తి" ప్రత్యయం వుంది.

పెద తిరుమలయ్య వేంకటేశ్వరోదాహరణంలో మాత్రం తుది రెండు చరణాంతాల్లో "కై" ప్రత్యయం రూపంలో వుండి మిగిలిన చరణాంతాల్లో తదాభాసరూపంలో వుంది.

ధారుణి భారనివారణకలకై
శౌరవిహార విచారమనెడికై
తవమున జవమున తిరుగుకై
దువుగాని వివిధ సవిధదానవకై
కసరుధిర సలిలమెసగ విసరికై
వసముగ సురవిసరము నేలినకై
లాసనివాస సతీవంద్యునకై
హాస సమున్నత బుధనంగ్యునకై

వేంకటేశ్వరోదాహరణం రచనా ప్రణాళిక క్రిందివిధంగా వుంది.

| విభక్తి | వృత్తం | కళిక | ఉత్కళిక |
|---|---|---|---|
| 1. ప్రథమ | ఉత్పలమాల | వృషభగతిరగడ | హరిణగతిరగడ |
| 2. ద్వితీయ | " | ద్విరదగతిరగడ | (ఇందుసగం) |
| 3. తృతీయ | " | హయప్రచార " | (ఇందుసగం) |
| | | (లేదా తురగవల్గనం) | |
| 4. చతుర్థి | " | హరిగతిరగడ | మధురగతిరగడ |
| 5. పంచమీ | " | ద్విరదగతి " | (ఇందుసగం) |
| 6. షష్ఠీ | " | హయప్రచారరగడ | |
| | | (లేక తురగవల్గనం) | " |
| 7. సప్తమీ | " | ద్విరదగతిరగడకు | (ఇందుసగం) |
| | | సమీపమగు ఛందం | |

8. సంబోధన " ద్విరదగతిరగడ (అంటుసగం)
9. సార్వవిభక్తికం శార్దూలం
10. అంకితాంకపద్యం - ఉత్పలమాల

తిరుమలయ్య వేంకటేశ్వర ఉదాహరణంలో అన్ని వృత్తాలు ఉత్పలమాలలే. సార్వవిభక్తికిమాత్రం శార్దూలవృత్తం గ్రహించడమనే విషయం త్రిపురాంతకోదాహరణంలోకూడ వుంది త్రిపురాంతకోదాహరణంలో షష్ఠికి మాత్రం చంపకమాల వృత్తం వాడబడివుంది. "శార్యస్తనే న్నృపాదీనాం శార్దూల విక్రీడితామతా" అనే నిర్వచనాన్ని బట్టి వుండవచ్చునని వేటూరి ఆనందమూర్తి గారి అభిప్రాయం. శార్దూల పద్యంలోనే అన్ని విభక్తులు వుంటాయి.

నీవీశుండవు నిన్నుగొల్తు వరముల్ నీచేత గైకొందునే
గైవారం బొనరింతు నీకొఱకు సంకల్పింప నీడేఱెమ
త్త్వేవల్ నీవలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీయందుల
క్ష్మీవాల్లభ్యము గంటి భక్తవరదా శ్రీవేంకటాద్రీశ్వరా

పెద తిరుమలయ్య "వేంకటేశ్వరోదాహరణ" స్తుతి ప్రధానమయిన లఘుకృతి. "స్తుతి" అన్నది విష్ణువుకు చాల ప్రీతికరమయిన అంశం. "నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని" అని భాగవతం. అందువల్ల వైష్ణవవాఙ్మయంలో స్తుతి సాహిత్యం ఎక్కువ. ఈ స్తుతి పరబ్రహ్మనికి సంబంధించినదో, లేదా అవతారాలకు సంబంధించినదో లేదా అర్చావతారానికి సంబంధించినదో కావచ్చు. ఈ దృష్టితో పరిశీలిస్తే వేంకటేశ్వరోదాహరణంలో దశావతారాలలో రామకృష్ణాద్యవతారాల ప్రసక్తి ఎక్కువ కనిపిస్తుంది.

స్వామి అనంత కల్యాణగుణుడని వైష్ణవుల విశ్వాసం. అతని గుణకీర్తన కర్తవ్యంగా వారు భావిస్తారు. గుణాలలో ఘనతలుకూడ

చేరుతాయి కాబట్టి అనితరసాధ్యమైన స్వామి చేతల్నికూడ గుణ సంఘంలోనే చేర్చి కీర్తించడం పరిపాటి. వైష్ణవాన్ని ఊపిరిగా పెట్టుకొన్న పెదతిరుమలయ్య కూడా విష్ణుదేవుని గుణాలను,ఘనతలను కొనియాడిన వైనం హృదయాన్ని స్పృశిస్తూ వుంది.

మఱియు గుఱుతగు గుణసుమణులలుగల పతివలన
మఱగు మెఱగులు లేని మానవుల గతివలన
గురువరుని గతసుతులగూర్చు శూరునివలన
బురహరుని వగతుదెగ బోరు ధీరునివలన
గమలమున దనయు గరుడవాహనువలన
నలువసెల వవల ధ్రువునకు నొసగు హరివలన
గలువ చెలియలిని గలయు బిత్తరివలన

సృష్టికర్త బ్రహ్మ. లయకారుడు శివుడు. స్థితికారుడు విష్ణువు. అవతారాలనేవి బ్రహ్మకుగాని, శివునకుగానిలేవు. అవతారాలు విష్ణువుకు మాత్రమే. దుష్టశిక్షణార్థం, శిష్ట రక్షణార్థం విష్ణువు అవతారాలు స్వీకరిస్తాడు. రాముడయినా, కృష్ణుడయినా అతడు విష్ణువే. అందువల్ల కవులు, భక్తులు విష్ణువును అభేదంగా కీర్తిస్తారు. అలాగే పెదతిరుమలయ్య విష్ణువు లోకోత్తర క్రియలను కీర్తించాడు. వాటిలో త్రిపురసంహారం, ధ్రువానుగ్రహం మొతమైనవి చెప్పుకోదగ్గవి.

త్రిపుర సంహారం :

తారకాసురుని కుమారులు తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే ముగ్గురు. వీరు బ్రహ్మను గురించి తపస్సుచేసి వరం సంపాదించారు. తారకాసురుడు స్వర్గంలో హేమపురాన్ని, కమలాక్షుడు ఆకాశంలో రజితపురాన్ని, విద్యున్మాలి భూమిలో అయసపురాన్ని పాలించ..

సాగారు. దిక్పాలకుల పట్టణాలను నేలమట్టం చేస్తూ పర్వతశృంగాలు పగిలేవిధంగా చేస్తూ, గ్రహాలు ఊడిపడేవిధంగా, పాతాళవాసులు పరిగెత్తేవిధంగా, దేవతా విమానాలు నేలకూలేవిధంగా త్రిపురాలు తిరుగసాగాయి ఆ పురాలను అంతమొందించడానికి ఎవరికీ సాధ్యం కాలేదు.

బ్రహ్మ, ఈశ్వరుడు, సకల దేవతాసమూహం అంతావైకుంఠానికి వెళ్లి శ్రీమన్నారాయణుని సందర్శించి, సన్నుతించి త్రిపురదైత్యుల సంగతి విన్నవించారు. మహావిష్ణువు గ్రహించి సమయం చూసి త్రిపుర సంహారం చేస్తాడు. ఈ త్రిపురసంహార విషయాన్ని పెద తిరుమలయ్య ఒక ఉత్కళికలో పేర్కొన్నాడు.

పురము లెఱియఁ శరమనంగబరగి దురము పురికొనంగ
బగతులగల మిగులగొట్టి నగజమగడు పొగడునట్టి
గెలుపు నిలుపు తలపులెంచి బలము చలము కలిమి మించి
జనుల మనుపు ఘనునిచేత వనజ తనుజ జనకుచేత

ధ్రువానుగ్రహం :

సూనృతా (సునీత) ఉత్తానపాదుల కుమారుడు ధ్రువుడు. ఇతని సవతితల్లి సురచి. ధ్రువుడు బాల్యంలో తండ్రి తొడపై కూర్చుండగా అతని సవతితల్లి "నా కుమారుడు కూర్చుండదగినచోట్లో నీవు కూర్చుండ తగదు. నా గర్భంలో జన్మించినగాని నీకంతటి యదృష్టం కలుగదు పొమ్మ" అని కసరుకొంది. ఆ మాటలు విన్న ధ్రువుడు కోపించి తల్లి అంగీకారంతో తపోవనానికి వెళ్ళాడు. మార్గ మధ్యంలో నారదుని కలుసుకొని అతనిచే ప్రేరితుడై విష్ణువునుగురించి తీవ్రంగా తపస్సుచేశాడు. ఈతని తపస్సుకుమెచ్చి విష్ణువు ప్రత్యక్షమై

అనుగ్రహించాడు. పెద తిరుమలయ్య ఇదే విషయాన్ని "నలువనెల వవల ధ్రువునకు నొసగు హరివలన" అని తెలిపినాడు. ఈ అంశాలే గాక "కన్నులరెయెండయుమెండుగ గాయగ జేయగగల విష్ణునకై" అని, "గమలమున దనయు గను గరుడవాహనువలన" అనేవి విష్ణు ప్రశంసను తెల్పేవి.

విష్ణుదేవుని దశావతారాలు ప్రసిద్ధాలైనప్పటికి పెదతిరుమలయ్య రామ, కృష్ణావతారాలకే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు. దీనికి అనేక కారణాలు ఊహించుకోవచ్చు.

1. సీతారాములను తల్లిదండ్రులుగా భావించి ఆంధ్రులు ఆరాధించడం. 2. మానవతా విలువల్ని ఆవిష్కరించే రామగాథ ఆంధ్రులను ఆకర్షించడం. 3. కృష్ణుని బాల్యక్రీడలు హృదయాన్ని, రాచక్రీడలు రసికతను, అద్భుతక్రీడలు లేదా అతిలోకలీలలు అంతరంగాన్ని ఆకట్టుకోవడం, కృష్ణగాథ తెలుగువారిలో బాగా చొచ్చుకుపోవడం. పోతన - అన్నమయ్య కృష్ణుని అతని వ్యక్తిత్వాన్ని పామరులదగ్గరికికూడాతీసుకుపోవడంవల్ల అతడు తెలుగువారికి అత్యంత సన్నిహితుడుకావడం, తెలుగువారిలోని వారుగానే పరిగణన పొందిన రామకృష్ణులు పెద తిరుమలయ్యను అతని కవిత్వాన్ని ఆకట్టుకోవడం, పైగా రామకృష్ణులపట్ల విశేష భక్తిప్రపత్తులు కనబరచి అసంఖ్యాక కీర్తనలు రచించిన అన్నమయ్య ప్రభావం అతనిపై వుండడం, తాను రోజూ వెళ్ళి సేవించే తిరుమల ఆలయ గర్భగుడిలో వున్న రామకృష్ణ విగ్రహాలు భావప్రేరణకు దోహదం చేయడం ప్రధాన కారణాలు కావచ్చు.

రామావతారం :

తాళ్ళపాక అన్నమయ్య తిరుమల ఆలయంలోని శ్రీరామునేగాక

ఒంటిమెట్ట రఘురాముని, గుత్తి రఘురాముని, వావిలిపాడు శ్రీరామ-చంద్రుని, విజయనగరం రాఘవుని, తిరుపతి రఘురాముని కీర్తించి-నాడు. తిరుమల గర్భాలయంలో వున్న ఈ స్వామికి 15వ శతాబ్దం నుండి స్వామివారితోపాటు పూజాదికాలు సాగుతుండినట్లు తిరుపతి శాసనాల్లో వున్నాయి.

ఏనాడు వాల్మీకి కరుణరస హృదయం కరగి రామాయణ కావ్య లహరిగా ప్రవహించిందో ఆనాటినుండి మానవజాతి రామకథా శ్రవణానందకందళిత హృదయారవిందాలతో పునీతమైంది. రాముడు లోకాభిరాముడు. ఇతడు ఎంత ప్రతివీరభయంకరుడో అంత నిజభక్త పారీణుడు. రాముని శౌర్యగుణ పరాక్రమాలను కీర్తించే అన్నమయ్య కీర్తన చూడండి.

జయ జయ రామా - సమరవిజయ రామా
భయహర నిజభక్తపారీణ రామా
జలధి బంధించిన సౌమిత్రి రామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవునేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచే కౌసల్యరామా
అరి రావణాంతక-ఆదిత్య కులరామా
గురుమౌనులనుగాచే - కోదండరామా
ధరనహల్యపాలిటి దశరథరామా
హరురాణి నుతులలోకాభిరామా
అతి ప్రతాపముల మా యామృగాంతకరామా
సుతకుశలవప్రియ సుగుణరామా

వితత మహిమల శ్రీవేంకటాద్రి రామా
మతిలోన బాయని మనువంశ రామా (ix-11)

పెద తిరుమలయ్య రచితమైన బసవోదాహరణంలో రామావతారానికి సంబంధించిన అహల్య వృత్తాంతం, శివధనుర్భంగం, సేతునిర్మాణం మొదలైన అంశాలున్నాయి.

అహల్య వృత్తాంతం :

సీతా స్వయంవరం వార్తవిని రామలక్ష్మణులను విశ్వామిత్రుడు వెంటబెట్టుకొని మిథిలానగరానికి బయలుదేరినాడు. మార్గమధ్యంలో ఆ ముగ్గురుకూడ గౌతమవనం చేరుకున్నారు. భర్తృశాపంవల్ల శిలగా పడివున్న అహల్య రాముని పాదస్పర్శతో రమణిగా మారింది. ఈ విషయాన్నే తిరుమలయ్య "ఖాతి నాతిజేసి వాసిఱట్టుపెట్టు వానిచేత" అని తెలిపినాడు. అంటే కోరకనే శాపవిమోచనం గావించిన మహానుభావుడు రాముడు.

మిథిలలో జనకుని కొలువులో రాముడు శివధనుర్భంగంచేశాడు. సీతారాములకు వివాహం జరిగింది. ఈ విషయాన్ని పెదతిరుమలయ్య "కలుకు విఱిసెఱి విఱుచు ఘనజనక జామాత" అని చెప్పినాడు.

సేతు నిర్మాణం :

రాముడు కపిసైన్యంతో లంకమీదికి దాడి వెడలాడు. సముద్ర తీరం చేరుకుని దారి వదలుమని సముద్రుని ప్రాధేయపడ్డా ఫలితం లేకపోయింది. రాముడు బాణం సంధించగా భయంతో సముద్రుడు రాముని సమీపించి క్షమాపణ కోరుకున్నాడు. సేతునిర్మాణంచేయమని సలహా యిచ్చాడు. ఈ విషయమే వేంకటేశ్వరోదాహరణంలో వుంది. "జలధి నడుమను దెరువు విరివిగ జరపి పరపిన దేవదేవుడు" ఈ

అంశాలేగాక రామునికి సంబంధించనివి "వాతజాతు బనులగొనుచు వసుధ వెసగు వానిచేత; భోజరాజు పుత్ర మైత్రి బొదలి మొదలు శ్రీకరునకు; లేటి శరకోటి నెడలించి త్రుంచిన రామ" వేంకటేశ్వరో-దాహరణంలో వున్నాయి.

కృష్ణావతారం :

తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలలో అనేక బాలకృష్ణ సంకీర్తనలున్నాయి. బాలకృష్ణ స్వామికి శ్రీజయంతినాడు, బ్రహ్మో-త్సవాల్లో విడిగా పూజలు జరిగేవి, జరుగుతున్నాయి కూడ.

బాలకృష్ణుడు ఇద్దరు తల్లుల ముద్దులబిడ్డడు. శ్రీకృష్ణుని కొందరు ప్రణయంతో సాధిస్తే మరికొందరు పగతో సాధిస్తారు. బాలునివలె తిరిగే యోగీశ్వరేశ్వరుడు, రత్నాల గుణాలన్నీ ఈ రాజీవాక్షునిలో రాశీభూతమై నిలచినవని అన్నమయ్య—

ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు
అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసునిపాల వజ్రము
కాంతుల మూడులోకాల గరుడపచ్చ బూస
చెంతలమాలో నున్న చిన్నికృష్ణుడు
రతికేళి రుక్మిణికి - రంగుమోవి పగడము
మితిగోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందులవైఢూర్యము
గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు
కాళింగుని తలపై గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రి యింద్రనీలము

పాల జలనిధిలోన బాలుని దివ్యరత్నము
బాలునివలె దిరిగే బద్మనాభుడు (ix–288)

పెద తిరుమలయ్య వేంకటేశ్వరోదాహరణంలో కృష్ణావతారానికి సంబంధించిన ప్రధానఘట్టాలు 1. సాందీపవృత్తాంతం, 2. కాళీయ మర్దనం, 3. గోవర్ధన పర్వత వృత్తాంతం, 4. బాణాసుర వృత్తాంతం మొదలైనవి.

1. సాందీప వృత్తాంతం :

బలరామకృష్ణులు సాందీపునివద్ద విద్య నభ్యసిస్తారు. గురు-దక్షిణగా చనిపోయిన బాలుని తెచ్చి యిమ్మని కోరాడు. రామకృష్ణులు సముద్రాన్ని సమీపించి తమ గురుపుత్రుని తెమ్మని కోరారు. "ఆ బాలుణ్ణి పంచజనుడు మ్రింగాడని సముద్రుడు చెప్పి అతని నివాసం తెలియజేశాడు." హరి పంచజనుణ్ణి చంపి పొట్టచీల్చి బాలునికి బదులు శంఖాన్ని చూచి దాన్ని గ్రహించారు. యముని దగ్గరకు వెళ్ళి గురుకుమారుని తీసుకువచ్చి గురువుకు అప్పగించారు. ఈ అంశాన్ని తిరుమలయ్య "గురువరుని గతసుతులగూర్చు శూరునివలన" అని తెలిపాడు.

మృత్యువునుకూడా దండించగలడనే లోకోత్తర ప్రవృత్తి విశదీకరించడం ప్రయోజనం.

కాళియమర్దనం :

ఒకరోజు కృష్ణుడు, గోపజనం, గోగణం అంతా కలసి అడవికి వెళ్ళారు. దప్పికతో గోపకులు యమునా నదిలోని కాళీయ హ్రదంలో నీళ్ళు త్రాగి మరణించారు. కృష్ణుడు వారిని బ్రతికించడమేగాక కాళింది మడుగునీరు శుభ్రపరచాలనుకున్నాడు. కృష్ణుడు తీర్థస్థకదంబవృక్షం ఎక్కి మడుగులో దూకి ఈదసాగాడు. అక్కడున్న కాళీయసర్పం

కాటువేసింది. అతన్ని చుట్టుకొంది. కృష్ణుడు తన శరీరాన్ని పెద్దచేసి ఆ పాముపట్టునుండి విడిపించుకొని పడగమీద ఎక్కి నాట్యం చేయ-సాగాడు. కాళీయుడు అతన్ని సాక్షాత్తు మహావిష్ణువుగా భావించి శరణు వేడగా అభయమిచ్చాడు. ఈ విషయాన్నే పెదతిరుమలయ్య "మడుగు పెడలని చిలువ చెలువము మాయజేయు మహానుభావుడు" అని పేర్కొన్నాడు.

దుష్టునికూడా క్షమించే ప్రవృత్తి భగవానునికి కలదని చెప్పడం ఆశయం.

2. గోవర్ధన పర్వత వృత్తాంతం :

గోపవృద్ధులు ఇంద్రయాగం చెయ్యాలని కృష్ణుని దగ్గరికి వచ్చారు. కృష్ణుడు ఇంద్రుని గర్వం అణచాలనుకున్నాడు. ఇంద్రుడు తనను నిర్లక్షించిన గోపకులంమీదపగతీర్చుకోవాలని గోకులంమీద శిలావర్షం కురిపించాడు. "గోకులమంతా తల్లడిల్లి కృష్ణుని ఆశ్రయించారు. కృష్ణుడు గోవర్ధన గిరిఎత్తి తలపేలిమీద నిలిపి గో, గోప, గోపీ జనానికి ఆశ్రయమిచ్చి వారిని కాపాడినాడు. ఈ విషయాన్నిగురించి పెదతిరుమలయ్య "జడికి గొడుగుగ గేల శైలము చాటు వీటికి చేయు బలువుడు" అని చెప్పినాడు.

లౌకిక జీవితంలో ప్రతిదానిని సామాన్యులకు జరిగిందేమిటి? అనే దృక్పథంతో ఆలోచించడం అలవాటు. కాని ఈదృక్పథం వుదాహరణంలో వుందనడానికి ఈ అంశమే సాక్ష్యం.

బాణాసుర వృత్తాంతం :

చిత్రలేఖ తీసుకవచ్చిన కృష్ణపౌత్రునివల్ల ఉషాకన్య గర్భవతి అయ్యింది. ఈవార్త విన్న బాణాసురుడు అనిరుద్ధుని నాగపాశాలతో

బంధించాడు. నారదునిద్వారా కృష్ణుడు ఆవార్త విని బాణుని రాజధాని చేరుకున్నాడు. యుద్ధంలో బాణుని అతనికి సహాయంగా వచ్చిన శివ పరివారాన్ని ఓడించాడు. నాలుగుభుజాలు తప్ప మిగిలినవన్నీ ఖండించాడు. బాణుడు ఉషా అనిరుద్ధులను కృష్ణుని కప్పగించాడు. ఈ విషయాన్ని తిరుమలయ్య "కరములురలగ బాణు ప్రాణము గాచియేచిన నాటి నేర్పరి" అని అన్నాడు.

తన భక్తుడు కాకపోయినా రక్షించేవాడనడం ఇక్కడి విశేషం.

ఇతర అవతారాలు :

తిరుమలయ్య స్తుతి ప్రధానమైన ఈ కావ్యంలో రామకృష్ణావతారాలకు ప్రాధాన్యం యిచ్చినా నరసింహ అవతార ప్రస్తావన సగము మొగము చాయదాయజడియు నడచువానిచేత; కూర్మావతార ప్రస్తావన "మఱియును గొఱగల పుడమికి నొడికపు మగడై నెగడెడు నఖిలేచునకై, దతచిత్ర తరగోత్రధారియందు," వరాహ అవతార ప్రస్తావనలు. "ధరణిధరునందు బరమ గురునందు" కనబడతాయి.

క్షేత్రతీర్థ విశేషాలు :

నదీతీర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు ఎక్కువగా దేవతామూర్తులకు నిలయాలయినాయి. ఆదిశేషుడు భగవంతుని నివాసం-కోసం కొండగా మారినాడనే నమ్మకం వుంది. మాణిక్యాలు చిందించే ఆదిశేషుని తల శ్రీనివాసుని నివాసం. అన్నమయ్య ఈ ఆదిశేషుని

వీడుగదెశేషుడు శ్రీవేంకటాద్రిశేషుడు
వేడుక గరుడనితో బెన్నుద్దిన శేషుడు
నేయి పడగలతోడ మెలసిన శేషుడు
చాయమేని తళుకు వజ్రాల శేషుడు

మాయని శిరసులపై మాణికాల శేషుడు
యేయెడ హరికి నీడై యేగేటిశేషుడు (9-76) కీర్తించాడు.

ఇలాంటి ఆదిశేషుని పడగమీదవున్న స్వామిని సేవిస్తే కొండంత సంపద సమకూరుతుందని కలకాలం సుఖంగా వుంటారని పెద తిరుమలయ్య వెంకటేశ్వరోదాహరణంలో బోధిస్తున్నాడు.

కొండలవంటి సంపదలు కొండని వేగమెచ్చాగమిచ్చునో
గండరగండడై పసిడికంబమునం బడగెత్తియుల్లస
త్కుండలి మండలాధిపతి గోత్ర విచిత్రనివాససౌఖ్యమున్
దండిగగాంచు వేల్పువలనన్ సుఖమందెద యెల్లకాలమున్

స్వామి పుష్కరిణీ మహాత్మ్యం, వేంకటాచల మహాత్మ్యంలోకూడ వర్ణింపబడివుంది. స్వామి పుష్కరిణీ తీర్థమహాత్మ్యాన్ని తాళ్ళపాక అన్నమయ్య

దేవునికి దేవునికి నీ తెప్పల కోనేరమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా
ధర్మార్థ కామమోక్షతతులు నీ సోబనాలు
అర్మిలి నాలుగువేదాలదె నీ దరులు
నిర్మలపు నీ జలములు నిండు సప్తరాగాలు
కూర్మము నీ లోతు హో కోనేరమ్మా
తగిన రంగాది తీర్థములు నీ కడళ్ళు
జగతి దేవతలు నీ జలతంతులు
గగనపు బుణ్యలోకాలు నీ దరిమేడలు
మొగినిచుట్టు మాకులు మునులో యమ్మా (7-192)

అని కీర్తించాడు.

ఈ కీర్తననే తాళ్ళపాక చిన్నన్న ద్విపదలో స్మరించాడు.

స్వామి పుష్కరిణిని తాళ్ళపాక కవులెంతో పవిత్రంగా భావించి కొలిచారు. క్రీ.శ. 1532లో తాళ్ళపాక పెద తిరుమలయ్య స్వామి పుష్కరిణిని బాగు చేయించి నీరాళి మంటపాన్ని నూతనంగా నిర్మించినట్లు (సం. 40, 41, తి.తి.దే. శా.సం. 4) ఒక శాసనంలో వుంది.

పెదతిరుమలయ్య వేంకటేశ్వరోదాహరణంలో తీర్థమహాత్మ్యాన్ని యిలా తెలిపాడు.

ఏటికి వేల్పులార చదలేటికి బోయెద రిందు రండుకో
నేటికి వచ్చు దీర్థచయ మేబదిలక్షలతోడ గూడుము
క్కోటియునంచు బల్కు మునికోటుల మాటలునేర్చి కీరముతో
చాటు తటుట విన్నటన సల్పెడు వేంకట భర్త గొల్చెదన్

అంతేగాక తీర్థంలో స్నానం చేస్తే సమకూరే సత్ఫలితాన్ని గురించి క్రింది పద్యంలో వివరించాడు.

తీరునఘంబులెల్ల నిలు దీర్థము వచ్చిన యంత సంపదల్
మీఱు సుఖంబుగూరు-మతి మిక్కుటమై శ్రుతివీథిదూఱువే
నూఱులు జెప్పనేల సుమ-నోవిభుచే దిరు వేంకటేశుచే
జూఱలుగా వరంపులిల బొప్పడ గొందము రండు మానవుల్

ఉత్సవాలు :

తిరుమల శ్రీనివాసునికి నిచ్చకళ్యాణం పచ్చతోరణంలా అనేక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఉత్సవాలలో స్వామి కళ్యాణోత్సవానికి, ఉట్ల ఉత్సవానికి తాళ్ళపాక వారే ప్రారంభకులు. పెద తిరుమలయ్య ఉట్ల ఉత్సవాన్ని ఒక ఉత్కళికలో స్తుతించాడు.

మెడెములు గూడుకొని
వాడలను, దాడిగొని

యుట్టులను జట్టులను
దెట్టెలుగ గొట్టిచని
యాటలను బాటలను
జోటులను మాటుకొని
కలసి మెలసినవాని
దులసి వలసినవాని

రచనా విధానం :

శ్రీవేంకటేశ్వరోదాహరణం రచనా విధానం మిక్కిలి హృద్య-మైందిగా చెప్పవచ్చు.

"భువన సువన ఫలము లలమి
జవన పవన బలము కలిమి
యెదలు పొదల మరగి తిరిగి
చదల తుదల కరిగి పెరిగి
పేపుమాపు మించి పొంచి
రూపుచూపి సంచరించు
యోగరాగ కీరమునకు
యాగ భాగసారమునకు"

అను షష్ఠీ ఉత్కళికలో "కీరపరంగ" ఒక సామాన్య అర్థాన్ని, యోగిపరంగ విశేష అర్థాన్ని చెప్పుకోవచ్చు. ఫలరసాలను స్వీకరిస్తూ వాయువేగంతో ఆకాశగమనం కలిగి హృద్యమైన ఆకారంతో సంచరించేది "కీరం". అలాగే ఫలాలను జలాన్ని స్వీకరిస్తూ ప్రాణాయామం బలిమితో హృదయాంతరాళంలో వున్న షట్చక్రాలను (కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యం అనే అంతశ్శత్రువులనుజయించి)అధిగమించి ఆత్మ పరమాత్మస్వరూపాన్ని తెలిసికొని సంచరించేవాడు యోగి. ఇలా భౌతికమైన సామాన్య అర్థాన్ని ఆధ్యాత్మికమైన విశేషార్థం, రాజభోగ, రాజయోగాలు కూడిన

పరమాత్మునితో అన్వయింపబడుటలో కవి రచనాపాటవం వ్యక్త మవుతుంది.

అలాగే చతుర్థీవృత్తంలో వటపత్రశాయి అయిన మహావిష్ణువును "భావజు తండ్రివై కుసుమబాణునిమామ మఱందివై చకోరావళి మిత్రు గన్నతని యల్లుడవై" అని చమత్కరించడంలో షష్ఠీవృత్తంలో శంఖ, చక్ర స్వభావాలను, "మానిసిదిండ్ల మెుత్తు నెఱమంటల పిల్లల కత్తివేల్పు పెన్‌బోనపుముద్దములహాల్పు దొలంకెడు సంకు" అని వర్ణించడంలోకూడ పెద తిరుమలయ్య రచనా సౌభాగ్యం స్పష్ట-మవుతుంది.

పెదతిరుమలాచార్యుని శ్రీవేంకటేశ్వరోదాహరణ లఘుకావ్యాన్ని అనుసరించి తరువాతి కాలంలో సలక్షణంగా ఎన్నో ఉదాహరణ కావ్యాలు వెలసినాయి. 20వ శతాబ్దందాకా వెలువడిన ఉదాహరణాలు ప్రధానంగా భక్తిపరమైనవి. ఆతరువాత మానవపరమైన ఉదాహరణ కావ్యాలు వెలువడినాయి.

# తాళ్ళపాక పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలలో దేవతామూర్తులు, ఉత్సవాలు.

తాళ్ళపాక కవులనగానే చప్పున గుర్తుకు వచ్చేవారు తాళ్ళపాక అన్నమయ్య. పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలు. వీరి ఆరాధ్యదైవం తిరుమల శ్రీనివాసుడు. వేంకటేశ్వరస్వామి మహిమల్ని భక్తిని, సామాన్య ప్రజానీకానికి తెలియజేయడం వీరి ప్రధానోద్దేశ్యం. దీనికి సాధనంగా వీరు సంకీర్తనల్ని ఎన్నుకొన్నారు. అంతేకాకుండా వైష్ణవమతాన్ని వూరూర ప్రచారం చేశారుకూడా. స్థానికంగా వున్న ఆయా దేవతల్ని వేంకటేశ్వరాత్మకంగా కీర్తించారు. దానివల్ల వైష్ణవం ఒక ప్రాంతీయులది, ఒకభాష వారిది అనే భావం తొలగిపోయింది. వైష్ణవులకు ఆరాధ్యమయిన 108 తిరుపతులతోబాటు తాళ్ళపాకకవులు అనేక ప్రదేశాలలోని ఆలయాలను దర్శించి దివ్య తిరుపతుల సంఖ్య పెంచారు.

తాళ్ళపాక పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్యలు ఇతర ప్రాంతాలలోవున్న శ్రీనివాస, చెన్న కేశవ, నారసింహ,శ్రీరామచంద్ర విట్టలమూర్తులను కూడా కీర్తించారు.

తెలుగువారి ఇలవేల్పు ఏడుకొండలయ్య. తిరుమలను దర్శించడం అనాదికష్టమే. అందుకోసం రాజులు, రాజప్రతినిధులు, ప్రజలు ఆయా ప్రాంతాలలో వైష్ణవ ఆలయాలను నిర్మించారు. తిరుమలకు రాలేని భక్తులు తమకు సమీపంలోవున్న శ్రీనివాసమూర్తిని దర్శించి సాక్షాత్తు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించామని సంతృప్తిపడడం నాటికి నేటికీ సమానం. ఆ భావం మరింత ప్రజల్లో బలపడాలనే వుద్దేశంతో తాళ్ళపాక కవులు ఇతర ప్రాంతాల్లో వెలసిన శ్రీనివాసమూర్తిని కీర్తించారు.

శ్రీనివాసుడు :

పెద తిరుమలయ్య, అతని కుమారుడు చిన తిరుమలయ్య కడప పట్టణంలోని, నెల్లూరిలోని వేంకటేశ్వరస్వామిని కీర్తించారు. అంతేగాక పెద తిరుమలయ్య విజయనగరం వేంకటేశ్వరుని, చిన తిరుమలయ్య కోసువానిపల్లె వెంకటనాథుని కూడా కీర్తించారు.

ఆ రోజులలో తిరుమల వేంకటేశ్వరస్వామిని చేరుకోవడానికి కడప ప్రవేశద్వారంగా భావించబడింది. ఆ కారణంచేత కడప ప్రసన్న వేంకటేశ్వరస్వామిని తొలిదేవునిగా, తిరుమల వేంకటేశ్వర స్వామిని "మలి" దేవునిగా (మూలవిరాట్టు) ఆ ప్రాంతం వారు భావించారు. తాళ్ళపాక గ్రామ నివాసులైన అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య కడప పట్టణానికి తరచూ వెళ్ళి ఆ స్వామిని దర్శించేవారని వారి కీర్తనలవల్ల తెలుస్తూంది. ఈనాటికికూడా

తిరుపతికి వచ్చే ఆ ప్రాంతపు కొంతమంది భక్తులు తొలుత కడప దేవుని ప్రార్థించి తరువాత తిరుమలకు వచ్చే సంప్రదాయం వుంది.

కడప - ప్రసన్న వేంకటేశ్వరుడు :

రాయలసీమలో కడప ఒక జిల్లా కేంద్రం. కడప పట్టణంలో "పాత కడప" మండల కేంద్రం. దీన్నే వ్యవహారంలో "దేవుని కడప" అంటారు. ఈ దేవుని కడపలో ప్రసన్న వేంకటేశ్వరుని ఆలయం వుంది. ఇది మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని కడప రైల్వే స్టేషనుకు నాలుగు మైళ్ళ దూరంలో వుంది.

స్థలపురాణం-స్థానిక కథలు :

తిరుమల క్షేత్రానికి కడప ప్రసన్న వేంకటేశ్వరాలయం గడపగా ప్రసిద్ధి. తిరుమల స్వామిని దర్శించే ముందు ఈ స్వామిని దర్శించి బయలుదేరేవాళ్లు కాబట్టి ఈ క్షేత్రానికి దేవుని కడప అని పేరు వచ్చిందంటారు.

కడప పట్టణానికి వ్యవహారంలో అనేక పేర్లున్నాయి. అవి దేవుని కడప, దేవరి కడప, పాతకడప, కృపనగరం, కడప, గడప, నడవ. కడప కృత శబ్దభవం. దీనినే వేదాంతదేశికులు "దేహళీపుర"మని పేర్కొన్నారు. "దేహళీ" అంటే గడప.

దేవుని కటపలో ప్రత్యక్షమై వున్న స్వామి వేంకటేశ్వరుడు. భక్తాదులు ఈ మూర్తిని ప్రసన్న వెంకటేశ్వరస్వామిగా ఆరాధిస్తారు. ఈ స్వామిని కృపాచార్యులు ప్రతిష్ఠించారని ప్రసిద్ధి.

శాసనాలలోని ఆలయ వివరాలు :

కడప ఆలయవివరాలు తెలుసుకోవడానికి ప్రధానంగా నాలుగు శాసనాలున్నాయి.

మొదటిది క్రీ. శ. 1517వ సంవత్సరం శాసనం. ఈ శాసన దానకర్త శ్రీకృష్ణదేవరాయల ప్రధాని అయిన తిమ్మరుసు. ఇతడు తిరువేంగళనాథుని అరగింపులు, చతుర్మూర్తిహోమం, బలి ప్రదానం మొదలయినవి ఏర్పాటు చేశాడు.

రెండవది క్రీ.శ. 1537వ సంవత్సరం శాసనం. ఈ శాసనకర్త అయిన ఔభళమహారాజు "చలివేంద్రం" ఏర్పాటు చేశాడు.

మూడవది క్రీ.శ. 1553వ సంవత్సరం నంద్యాల పిన్న ఔభళ రాజు శాసనం, ఇతడు తిరువేంగళనాథదేవునికి ఉద్యానవనం నిర్మించాడు.

నాల్గవది క్రీ. శ. 1553వ సంవత్సరం పెద్ద ఔభళరాజు కుమారుడు చిన్న ఔభళరాజు శాసనం. ఇతడు తిరువేంగళనాథదేవునికి తులసిమాల సమర్పణ, తోమాల కైంకర్యం మొదలయినవి కట్టడి చేసినాడు.

ఆలయ విశేషాలు :

కడప వేంకటేశ్వర ఆలయం పశ్చిమాభిముఖంగా ఉంది. ఈ ఆలయానికి ఒక రాజగోపురం ఉంది. దీనిఎత్తు ఆరు అంతస్థులు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయగోపురం. దేవుని కడప రాజగోపురం ఒకేకాలంలో నిర్మించారని ప్రతీతి. ఆలయానికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ప్రవేశ ద్వారాలున్నాయి. తూర్పుదిక్కులో ప్రవేశ ద్వారంలేదు.

ఆలయానికి చుట్టూ ప్రహారీ ఉంది. ప్రధాన ఆలయానికి ముఖమంటపం, అంతరాళం, గర్భగుడి వున్నాయి. ముఖమంటపంలోని స్తంభాలపై నాట్యభంగిమలో తాండవ గణపతి, రామాయణ శిల్పాలు, శ్రీనివాసుని కళ్యాణఘట్టాలు చిత్రీకరించబడినాయి. అంతరాళంలో జయ విజయులున్నారు.

స్వామి మందిరానికి ఎడమవైపు పద్మావతి ఆలయం వుంది. ఈ ఆలయానికికూడ ముఖమంటపం పైకప్పులో రాతిబల్లులున్నాయి.

కంచిలోవలె ఈ ఆలయంలోని బల్లులను స్వామిని తలచుకొని తాకితే పాపం పరిహారం అవుతుందనే నమ్మకంకూడ అక్కడి ప్రజలకు వుంది.

ఆలయ ప్రాంగణంలోనే విష్వక్సేన, అండాళ్ ఆలయాలు, నాగుల విగ్రహాలు, ఆళ్వార్ల సన్నిధి, పాకశాల, రథవాహనశాల, యాగశాల, అలంకారమంటపం, కళ్యాణమంటపం, గరుడ ఆళ్వార్ల సన్నిధి, తులసి బృందావనం, బలిపీఠం మొదలైనవి వున్నాయి.

ప్రధాన ఆలయంలోని స్వామి "కృష్ణశిల"తో నిర్మించబడివుంది. ఈ స్వామి భక్తాదులకు అభయమిస్తున్నాడు. స్వామివారి పాదాల ముందు ఉత్సవమూర్తులు వున్నారు. స్వామికి ఎదురుగా అంజలి ఘటిస్తున్న భంగిమలో గరుత్మంతుడు వున్నాడు.

పూజాదికాలు :

ఈ ఆలయంలో వున్న స్వామి ప్రసన్న వేంకటేశ్వరుడు. ఈ స్వామికి పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమం ప్రకారం ఈ ఆలయంలో షట్ బేరాలున్నాయి. ఆలయాలలో షట్ బేరాలుండడం చాలా అరుదు.

ఇక్కడ శ్రీవారికి పునర్వసు నక్షత్రోత్సవం, ఉగాది, కృష్ణ-జయంతి, దీపావళి, చిలుకద్వాదశి, సంక్రాంతి, నవరాత్రి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవం మొదలైనవి నిర్వహిస్తున్నారు. అలాగే శ్రీలక్ష్మి అమ్మవారికి ఉత్తరా నక్షత్రోత్సవం, వరలక్ష్మీవ్రతం, అండాళమ్మవారికి తిరువావడి పుణ్యోత్సవం జరుపుతున్నారు.

భక్తులు తమ కోర్కెలు నెరవేరిన తర్వాత లేక నెరకముందే తమ మొక్కులు చెల్లించడంకోసం సహస్రనామార్చన, ఆకుపూజ,

అభిషేకం, పూలంగి, అర్చన, కళ్యాణోత్సవం మొదలైన ఆర్జిత సేవలు దేవాలయ అధికారులు ఏర్పాటు చేశారు.

పెదతిరుమలయ్య కడప ప్రసన్న వేంకటేశ్వరుని ఆరుశృంగార కీర్తనల్లో చినతిరుమలయ్య రెండు శృంగార కీర్తనల్లో కీర్తించినారు. పెదతిరుమలయ్య సంకీర్తన పరిశీలనవల్ల తెలిసే అంశాలు రెండు—

ఒకటి కడప పట్టణంలో నెలకొన్న దైవం ప్రసన్న వేంకటేశ్వరుడు• ఆ స్వామిని పెదతిరుమలయ్య కడప రాయనిగా కీర్తించాడు. రెండు కీర్తన నిర్మాణంలో తేడాలు కనిపిస్తాయి.

1. కడపరాయుడు :

కాంతగలనాడు యేకాంతముల మాట శ్రీ
కాంతుడవు నీవు యిందుకొఅకు నాకాకలేక కడపరాయ(23-296)

ఎరా యిపుడు నా యెదుట గడపరాయ
నారీ నేను నిన్నెఱుగుదునను నీవెఱుగుదువు (23-295)

జరుపులనే పొద్దువోయ చాలదాయింక
సరుస గడపరాయ చాలదాయింకా (23-294)

గద్దించి శ్రీవేంకటాద్రి కడపరాయుడు గూడె
పొద్దువొద్దు వింతలును భోగముఁలేకాకా (23-44)

కైకొని శ్రీవేంకటాద్రి కడపరాయుడు గూడె
వాకున నాడక మానవదె నేమి సేతునే (23-30)

కన్నిచో శ్రీవేంకటాద్రి కడపరాయుడవై
పన్నిల గూడితివింకా జాలునన్నా మానవు (23-286)

2. కీర్తన నిర్మాణంలో తేడా :

సాధారణంగా సంకీర్తనల్లో పల్లవిలో రెండుపాదాలు, చరణంలో నాలుగుపాదాలు వుంటాయి. అయితే పెదతిరుమలయ్య కడపరాయని కీర్తించిన సంకీర్తల్లో రెండుమాత్రం (23-295,296) దీనికంటె వేరుగా వున్నాయి. అన్ని కీర్తనలలాగే పల్లవిలో రెండుపాదాలు, చరణాల్లో మాత్రం పల్లవిలోలాగే రెండే పాదాలున్నాయి. మచ్చుకు

"ఏరా యిప్పుడు నా యెదుట గడపరాయ
నారీ నేను నిన్నెఱుగుదును నీ వెఱుగుదువు ॥పల్లవి॥
పలుకుల బదరకురా కడు బగటు చెలియనేను
చెలగి యే పనులు మనసున గలిగినజేసి చూపుదువుగాని ॥ఏరా॥

తనిసితి నీకతలా మఱి తగవు చెప్పనేలా
వెనకటివలెనే కదనీ బాసలు వింటి గంటి నలనాడే ॥ఏరా॥
నగవుల బనిలేదు యింక నాకు నీకు బోదు
వెగటు వాయనను గడపరాయ శ్రీవేంకటగిరిపై గూడితివి
(23-295)

చినతిరుమలయ్య కడప ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఒక కీర్తనలో కడపరాయుడని, మరొక కీర్తనలో వెంకటనాథుడని స్తుతించాడు.

కడపరాయుడు :

గరిమగూడితి శ్రీవెంకటనాధననునిట
నిరతి గడపరాయ నిను మించగలనా (16-2-86)

వెంకటనాథుడు :

అగ్గమై శ్రీవెంకటనాథ కడపలో

దగ్గరి నన్ను గూడగా తలపెల్లా గంటిమి (16-2-7)

స్వామి అమాయకుడు. అతనిని వలచిన వనిత అన్నివిధాల రాటు-దేలిన అంగన. స్వామి అందచందాల్ని గొల్లకొన్న "గొంటరి." ఆమె అతిమోహానికి గురి అయిన స్వామిని చూచి చినతిరుమలయ్య తాను చెలికత్తెగా భావించుకుని చెప్పే మాటలు భక్తాదులవల్ల స్వామి పడే బాధలు అనేకరకాలు. ఇదికూడా ఈలాంటిదే.

అయ్యో దలవలదా అటుదానికి
చయ్యాటమాడినాను సంగతి నావలనా ॥పల్లవి॥

జీరల నీమేను చూచి సిగ్గయ్యా నాకైతే
ఆరడి నీకెట్టి తరువాయి నోకాని
కూరిమితో నాపెకు నీకుందణము వంటిమేను
యీరీతి జేయగ జేతులెట్టాడెనో ॥అయ్యో॥

గంటైన నీమోవి చూచి కనికి (క?)ర మయ్యీని
కంటకము నీకెట్లా గాదోగాని
గొంటరియాపె దాని చిగురువంటి నీమోవి
అంటి యింత సేసె నెంత అగ్గలికోకాని ॥అయ్యో॥

కురులు నలిగిన నీకొప్పు చూచి వెరగయ్యా
శిరసు నీకెట్టోరిచెనో కాని
గరిమ గూడితి శ్రీవెంకటనాథ ననునిటె
నిరతి గడపరాయి నిను మించగలనా ॥అయ్యో॥ (16-2-86)

నెల్లూరు - వేంకటేశ్వరస్వామి :

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య నెల్లూరు వేంకటేశ్వర-స్వామిని కీర్తించారు. ఆంధ్రరాష్ట్రంలో జిల్లా కేంద్రమయిన

నెల్లూరులో శ్రీరంగనాయకుల ఆలయం వుంది. నేడు వేంకటేశ్వ-రాలయం లేదు. ఒకప్పుడు వుండి నేడు రూపుమాసిందా? లేదా రంగనాయకస్వామిని వెంకటేశ్వరస్వామిని అభేదంగా కీర్తించారా? వీరిద్దరూ దర్శించిన నెల్లూరు ఇదెనో కాదో స్పష్టంగా చెప్పలేం.

పెదతిరుమలయ్య —

చెప్పరాదు నీ సిగ్గరితనము
మిప్పిరి గొంటె వోపెడుగాదా ॥పల్లవి॥

గారవించి రతిగాలు చాచితే
నేరమాయిది నీవనేవు గాకా
యీరీతి శ్రీవేంకటేశ నెల్లూరిలో
గోరిన సతులు కోట్లుగారా (23-152)

అని కీర్తించినాడు.

చినతిరుమలయ్య —

ఇదియేమె వీనిగుణమెటువంటిదే
వదలక నవ్వ నూరవదినెనా నేను ॥పల్లవి॥

నేరుపరి ధానైతె నెమ్మది నుందుగాక
కేరికేరి యెవ్వరిపై గేలు చాచీనె
చేరవచ్చి నెల్లూరి శ్రీవెంకటనాథుడిట్టె
యీరీతినె ననుగూడె యిందిర నా నేను (16-2-89)

అని పాడినాడు.

విజయనగరం - వేంకటేశ్వరస్వామి :

రాజకీయంగా, ధార్మికంగా, సంస్కృతీపరంగా 15, 16శతాబ్దు-లలో ప్రసిద్ధి పొందిన నగరం విజయనగరం బళ్ళారి జిల్లా హాస్పేటు

తాలూకాలో వుంది. ఇది హుబ్లి-గుంతకల్లు మార్గంలోని హోస్పేటు రైల్వే స్టేషనుకు ఏడు మైళ్ళ దూరంలో వుంది.

స్థలపురాణం, స్థానిక కథలు :

విజయనగరానికి హంపిక్షేత్రం, విద్యానగరం, విజయనగరం అనే పేర్లున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి సంబంధించి ఈ హంపి స్థాపన గురించి అక్కడి ప్రజలు అనుశ్రుతంగా చెప్పే కథ ఒకటుంది. హరిహరరాయలు, బుక్కరాయలు అన్నదమ్ములు. వీరిలో ఒకరు మంత్రి, ఒకరు సేనాధిపతి. పాదుషా ఢిల్లీ వెళ్ళేటపుడు ఆ అన్నదముల్ని జమీనుగా ఉంచుకొన్నాడు. యుద్ధాల్లో తనకు అయిన ఖర్చంతా యిస్తే ఆ భూభాగం వారికి వదలివేస్తానన్నాడు. తెలుగు వారు డబ్బు యివ్వలేదు. తరువాత అన్నదమ్ములు అవమానంతో అడవుల్లో తిరుగాడుతూ ఉండగా వారిని విద్యారణ్యస్వామివారు చూచి రాజలక్షణాలు గ్రహించారు. హంపిలో వారిని ప్రభువులుగా నియమించాడని ఈ స్థానిక కథవల్ల తెలుస్తుంది. విద్యారణ్యస్వామి దీన్ని నిర్మించడంవల్ల విద్యానగరం అనేపేరు వచ్చిందని మరోకథ. స్థానికుల కథలవల్ల పరంపరాగత వృత్తాన్నిబట్టి ఇది రామాయణ కాలంనాటి కిష్కింధ అనికూడా అంటారు. మతంగపర్వతం, ఋష్యమూకం, మాల్యవంతం ఆనేవి ఇక్కడి పేర్లు.

విజయనగరం క్రీ.శ. 1336లో స్థాపించబడింది. క్రీ.శ. 1565వ సంవత్సరం తళ్ళికోట యుద్ధంతో అంతరించిపోయింది. విశాలమయిన వీధులు, చక్కటి సౌధాలు, సమీపంలోని తుంగభద్రనది, నిర్మల వాతావరణంగల ప్రదేశం యిది. విజయనగరంలో ఎన్నో ఆలయాలు వెలిశాయి. వాటిలో విఠలేశ్వరుడు, హజారరామాలయం, కోనేటి వేంకటేశ్వరుడు, (?) నృసింహస్వామి, పెద్దహనుమంతుడు, బాలకృష్ణుని ఆలయాలు ముఖ్యమైనవి.

పెదతిరుమలయ్య విజయనగరం కోనేటి శ్రీవెంకటేశ్వరస్వామిని రెండు శృంగార కీర్తనల్లో కీర్తించాడు.

ఇతవు సేసిన వారికిది వాటా యమ్మలాల
కతలు చెప్పగబోతే కాకరేగే నితడు ॥పల్లవి॥

కడు దప్పిదేరగాను కప్పురమీయ్యగబోతే
వుడికి తిట్టగ వచ్చెనో యమ్మ వీడు
వడియు జెమట తుడువగబోతే వయ్యెదను
తడిపాత మెడకొంత తలమనీ నితడు ॥ఇతవు॥

కురులు చెదిరినవికూడ జెరుగగబోతే
విరసాల విదలించి వేసీనే వీడు
సరుగ కస్తూరి బొట్టు చక్కతిద్దబోతేను
వురసీనందుకు బోడువ్వని నితడు ॥ఇతవు॥

సిగ్గుతో విజయనగర సింగార వనములోన
వెగ్గళించి కోనేటి శ్రీవేంకటేశుడు
నిగ్గుల నన్నుగూడగా నిజాన మెచ్చగబోతే
పొగ్గి మాటల బెల్లాల కొడిగట్టీ నితడు (23-33)
మనసు లేకములైన మనలోని పిలుపులకు
తనివి దీరుచుకొనగ తరినేడుగదరా ॥పల్లవి॥

చెలగి విజనగరపు సింగారవనములో
వెలయు గోనేటి శ్రీవేంకటేశ
కొలదిమీరిన వేడ్కగూడితిమి యుద్దరము
యిలమీద మనభాగ్యమెంచంగవలెరా (23-343)

పై సంకీర్తనబట్టి కోనేరు, చుట్టూవనం విజయనగర వేంకటేశ్వరునికి

ఉన్నట్టు స్పష్టమవుతుంది. తిరుమలలోని స్వామి కోనేటిరాయడని చెప్పడం అలవాటు. అలాగే ఈ స్వామిని కోనేటి శ్రీవేంకటేశుడని పెదతిరుమలయ్య కీర్తించాడు.

కోసువానిపల్లె వెంకటనాథస్వామి :

కడప జిల్లా జమ్మలమడుగు తాలూకాలో ఒక "కోసనేపల్లె"వుంది. "కోసువాని"పల్లె "కోసునేపల్లె" అయిందేమో. ఇదేగాక చిత్తూరు జిల్లాలో ఒక కోసువారిపల్లె, కర్నూలు జిల్లా డోన్ తాలూకాలో ఒక కోసనేపల్లె వున్నాయి.

వీటిలో ఏ గ్రామమో తెలియదుకాని కోసనెపల్లెలోని వెంకటనాథుని చినతిరుమలయ్య రెండు శృంగార కీర్తనల్లో కీర్తించాడు.

కాంతాళిం-బాడినమాటగాడు సుమ్మీ వో విభుడ
దొంతి మాయల జిక్కగ దొరలకు జెల్లునా ॥పల్లవి॥

ఆసపడి నీవాపెకు అట్టె కొలువు సేయగా
యీసున నాకును గోపమంత వచ్చెరా
కోసువానిపల్లెలోన గూడి శ్రీవేంకటనాథ
తోసి పోవైతివి యింత దొరలకు జెల్లునా (16-2-71)

ఈడేర వలచితే యేపని సేయగరాదు
యేడనైనా యెగ్గు సిగ్గులెంచరా భూమిని ॥పల్లవి॥

అతివ చూచి కల్లలాడుమన్నా నాడేవు
బతిమిజా రాడుమన్నా బారాడేవు
పతివైన కోసువానిపల్లె శ్రీవేంకటనాథ
గతియై కూడుండుమన్నా గాగిట నుండేవు (16-2-75)

2. చెన్న కేశవుడు :

చెన్న కేశవుడు అర్చామూర్తి. ఈ మూర్తి అవాంతరవ్యూహాలలో ఒకటి. సంకర్షణ, ప్రద్యుమ్న వ్యూహాలు ప్రధాన వ్యూహాలు. ఈ చెన్న కేశవ ఆలయాలు కడప, కర్నూలు, చిత్తూరు మండలలోనే ఎక్కువ.

"కేశవుడు" అంటే విష్ణువు, ప్రశస్తమైన వెంట్రుకలు కలవాడు. "చెన్నుడు" అంటే చెన్న కేశవస్వామి. అందగాడు. "చెన్ను" అంటే వన్నె, కాంతి, అందం, విలాసం, అందమైనది, ఎట్టిది, సౌందర్యం, విధం, సుందరం అని నిఘంటువులవల్ల తెలిసే అర్థాలు. ఈ అర్థాలను పరిశీలిస్తే కేశవమూర్తిలో రకరకాల భంగిమల్నిబట్టి అనేక అర్చావతారమూర్తులు ఏర్పడినట్లు తెలుస్తోంది. వాటిలో అందంగా' మనోహరంగా, అందరిని ఆకర్షించే కేశవరూపమే చెన్న కేశవమూర్తి కన్నడంలో "చెన్నాగి ఇద్దానే" అంటే బాగున్నాడని అర్థం. పర్యాయార్థంలో అందంగా వున్నాడని అన్వయం. విగ్రహనిర్మాణంలోను ఆ విగ్రహానికి అలంకరింపబడే అలంకారాలలోను భక్తాదుల్ని ఆకట్టుకోవడంలోను ఈ కేశవుడుచెన్న. అంటే బాగు, దిట్ట అని అర్థం చెప్పుకోవచ్చు, ఈ అర్చామూర్తి గొప్పతనాన్ని తాళ్ళపాకకవులు గుర్తించారు.

పెదతిరుమలయ్య చగలమర్రి చెన్నుని, చినతిరుమలయ్య సంబటూరిచెన్నరాయుని, కోనచెన్నరాయుని, ఊటుకూరు చెన్నరాయుని కీర్తించారు.

చాగలమర్రి చెన్న కేశవుడు :

కర్నూలు జిల్లాలో చాగలమర్రి ఒక మండల కేంద్రం. ఇది

మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని కడప పట్టణానికి 57 కి. మీ. దూరంలో ఉంది.

స్థలపురాణం-స్థానిక కథలు :

పూర్వం ఈ గ్రామంలో చాగలమ్మ అనే గ్రామదేవత వుండేది. ఆమెపై ప్రజలకు భక్తితోపాటు నమ్మకంకూడా ఎక్కువగా ఉండేది. కరువు కాటకాలు, అంటువ్యాధులు వచ్చినపుడు చాగలమ్మ ఆ గ్రామాన్ని కాపాడేది. ఆ దేవతమీది భక్తికొద్దీ చాగలమ్మను ఊరికి దక్షిణంగా ప్రతిష్ఠించారు. ఆమె పేరుతో ఈ వూరికికూడా చాగలమర్రి అనేపేరు ఏర్పరచుకున్నారు. ఈచాగలమర్రి క్రమంగా చాగలమట్టిగా మారిందని కథ. చాగలమ్మ విగ్రహం ఇప్పటికీవుంది. ఈచాగలమట్టిలో వెలసిన స్వామి చెన్నకేశవుడు.

ఆలయ విశేషాలు :

ఈ ఆలయానికి చుట్టూ గట్టి ప్రాకారం వుంది. రాజగోపురం మాత్రం శిథిలమైంది. ఆలయం తూర్పుదిక్కుగా వుంది. ఆలయ ప్రాంగణం విశాలంగా వుంది. ప్రధాన ఆలయానికి ముఖమంటపం, గర్భగుడి వున్నాయి. గర్భగుడిపై విమానం వుంది. గర్భగృహం ఎదురుగా ధ్వజస్థంభం, బలిపీఠం వున్నాయి. గర్భగృహంలో అభయహస్త భంగిమలో వున్న చెన్నకేశవస్వామి తప్ప మరే విగ్రహంలేదు. గర్భగుడికి దక్షిణంగా కోనేరు వుంది. ఈ కోనేరులో స్వామివారికి తెప్పోత్సవం జరిగేదని కథ. స్వామివారికి నిత్యం పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజలు జరుపుతున్నారు. స్వామి వారికి ప్రతి సంవత్సరం మాఘమాసంలో ఉత్సవాలు జరుగుతాయి.

పెదతిరుమలయ్య చాగలమర్రి చెన్నుని ఒక శృంగార కీర్తనలో కీర్తించాడు.

సిగ్గుగల యాటదైతే జేరవచ్చునా
వొగ్గినే గానీతో నొక్కపైతిగాకా ॥పల్లవి॥

పొందు మరిగిలి గాన పొత్తుకు వచ్చితిగాక
చెంది వేగిరించ నీతో జెల్లునా నాకు
కందువ గూడితివి చాగలమట్టి చెన్నుడపై
అందపు శ్రీవేంకటేశ అరుదా నాకు (23-12)

సంబటూరు చెన్న కేశవుడు :

కడప జిల్లా కమలాపురం మండలంలోని గ్రామం సంబటూరు. ఇది మద్రాసు-రాయచూరు రైలుమార్గంలోని కమలాపురానికి మూడు మైళ్ళ దూరంలో పెన్నానదీ తీరంలో వుంది.

స్థలపురాణం-స్థానిక కథలు :

చ్యవన రుషి ఆశ్రమం ఒకటి ఇక్కడ వుండేది. దీనికి చ్యవన ఆశ్రమం అని పేరుండేది. ఈ ఆశ్రమం కొంతకాలానికి ఊరుగా మారి చమటూరుగా పిలువబడింది. క్రమంగా సమ్మటూరు, సంబటూరుగా మారింది. సంబటూరుకే శ్రీభాష్యపుర అగ్రహారం అనికూడా పేరు.

శాసనాలలో ఆలయ విశేషాలు :

ఈ ఆలయ విశేషాల్ని తెలిపే శాసనాలు ఐదు వున్నాయి. 1467వ సంవత్సరం కమలాపురం తాలూకాలోని సంబటూరు చెన్న-కేశవస్వామి దేవాలయ ప్రవేశద్వారంవద్ద ఉండేశాసనం, సంబటూరు చెన్న కేశవస్వామికి "అభిజిన్" లగ్నంలో జరుగుతున్న పూజా

కైంకర్యాలు, లక్ష్మీనారాయణస్వామికి జరగాలని చెప్పల్లిలోని సింగప్ప గంగాయమ్మ అనతిచ్చింది.

రెండవది చెన్నకేశవ దేవాలయ గోడపై వున్న శాసనం. ఇది అసంపూర్ణంకావడంవల్ల వివరాలు పూర్తిగా తెలియలేదు. సంబటూరు గ్రామ ప్రజలనుంచే ధన్యం, ధాన్యం రోజుకు "యిరుస" వంతున వసూలు చేసి భద్రపరచి అందులో సగం లక్ష్మీనారాయణస్వామికి, మిగిలిన సగం ఆ దేవాలయ యజమానులైన నియోగులకు ఖర్చు పెట్టాలి.

మూడవది సంబటూరు చెన్నకేశవ దేవాలయ ముఖమంటపం వద్ద స్థంభంపై ఉండే శాసనం. సంబటూరు లక్ష్మీనారాయణస్వామికి, వెంకన్న, వెంకటపతి, కోనేరు లక్ష్మీనారాయణ గార్లు నిత్యదాన సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నాల్గవది క్రీ.శ. 1554వసంవత్సరం సంబటూరు కేశవపెరుమాళ్లు సకలవిధకైంకర్యాలు నిర్వహించడానికి భోజనపల్లి శ్రీనివాసయ్యం గారు కల్యాణమంటపాన్ని కట్టించాడు.

ఐదవది ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో ఒక స్థంభానికి తెలుగు శాసనం వుంది. ఇందులో నాలుగు, అయిదు వరుసలలో సంబటూరుకు శ్రీభాష్యపురం అనేపేరు స్పష్టంగా వుంది.

ఆలయ విశేషాలు :

సంబటూరులో వున్న చెన్నకేశవస్వామి ఆలయం శిథిలావస్థలో వుంది. ఆలయ రాజగోపురం పడిపోయింది. ప్రవేశద్వారం మాత్రం ఎత్తుగా శిలా నిర్మితమై వుంది.

ఆలయంచుట్టూ విశాలమైన ప్రాకారంవుంది. ప్రధాన ఆలయా నికి ముఖమంటపం, అంతరాళం, గర్భగుడి వున్నాయి. ముఖమంటప స్తంభాలపై సింహాలు చెక్కబడి వున్నాయి. అవి మీదికి దూకునట్లుగా కనిపిస్తాయి. ముఖమంటపానికి మూడు ప్రవేశద్వారాలు వున్నాయి.

అంతరాళంలో వున్న ఒక పెద్ద రాతిబండ పగిలి శిథిలమైంది గర్భగృహంపై విమానం వుంది. ప్రధాన ఆలయంచుట్టూ యాగశాల తలంబ్రాలమంటపం, లక్ష్మీదేవిఆలయం, కల్యాణమంటపంవున్నాయి. కల్యాణమంటపానికి మాత్రం ఇరవైనాలుగు స్తంభాలున్నాయి.

ఆలయానికి ఉత్తరభాగంలో మరో రెండు గుళ్ళు ఉన్నాయి. వీటికి ముఖమంటపం, గర్భగుడి, గర్భగుడిపై విమానం వున్నాయి. గాని విగ్రహాలులేవు. మొదటి గుడి గర్భగృహంలో పెద్దపుట్ట పెరిగింది

ఆలయంలో అక్కడక్కడా స్తంభాలు, నాగులకట్ట చెల్లాచెదురుగ పడివున్నాయి. వీటినిబట్టి ఒకపుడు ఈ చెన్న కేశవ ఆలయంలో రాజ. శీవితో గడపినట్లు కనబడుతుంది.

ఇక ఆలయంలో శ్రీచెన్న కేశవస్వామి నిలబడి అభయహస్తంలో వున్నాడు. అంతరాళంలో లక్ష్మీదేవి విగ్రహం, ఆళ్వార్ల విగ్రహాల వున్నాయి. ప్రధాన ఆలయానికి ఎడమవైపు గోడకు ఆనుకుని ఒక పెద్ద ఆంజనేయస్వామి విగ్రహం పడివుంది. స్థలమార్పిడివల్లనో ఏమో తలభాగం శిథిలమై అక్కడే వుంది. ఈ ఆంజనేయస్వామికి పూజాల లేవు.

పూజాదికాలు :

ఒకప్పుడు చెన్న కేశవస్వామికి పాంచరాత్ర ఆగమం ప్రకారం నిత్యపూజలు జరిగేవి. కానీ యిప్పుడు ఒక్క శనివారం మాత్రమే

పూజలు జరుగుతున్నాయి. చెన్నకేశవస్వామి ఉత్సవాలు చైత్రశుద్ధ పాడ్యమిలోను (మార్చి, ఏప్రిల్, సెప్టెంబరు, అక్టోబరు) లోను మరియు పుష్యమి (జనవరి) లోను జరుగుతాయి. ఈ ఉత్సవాలు సాధారణంగా రాత్రి తొమ్మిదిగంటలకు ప్రారంభమౌతాయి. స్థానిక ప్రజలంతా ఈ ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారు. కానీ నేడు ఈ ఉత్సవాలు జరగడంలేదు.

చినతిరుమలాచార్యులు సంబటూరి చెన్నకేశవస్వామిని దర్శించి స్తుతించినట్లు ఒక కీర్తనవల్ల తెలుస్తూంది.

వద్దునాతో వెచ్చి వేవని మాయలు
వుద్దండవు వోసంబటూరి చెన్నరాయడా
అమ్మమీద నానపెట్టి ఆసపుట్ట మాటలాడి
నమ్మించ వచ్చేవు నాకు గొత్తలా
సమ్మతి నీవలపుల సతుల వద్దకె వోయి
యెమ్మెలు నెరపేపారి నెలయించవయ్యా
మానము వోకన్నాడి మచ్చిక జాపలిచ్చేవు
యీనె పాలెల్లా నేనెఱగనివా
వూనిన వేడుకల నీవు విదలతోడ తను
నీ నేరుపు సటలెల్లా నెరపవయ్యా
కాగిటికి జేరదీసి కన్నుల మొక్కులు మొక్కి
ఆగేవు నేదెలియని పనులా
నాగువార శ్రీవేంకటనాథ నన్ను గూడితివి
యేగివచ్చి యిట్టె మాయింటి నుండవయ్యా (16-2-23)

కోన చెన్నరాయుడు :

కడప పట్టణానికి దక్షిణంగా నాలుగు మైళ్ళ దూరంలో వున్న

పుణ్యక్షేత్రం కోన. దీన్నే పాలకొండకోన అని వ్యవహరిస్తారు. ఈ కొండలో నెలకొన్న స్వామి చెన్నకేశవుడు. ఈ స్వామిని పాలకొండ రాయడు అనికూడా అంటారు. దట్టమయిన పొదలు, కొండచరియలు జలాశయాలతోకూడిన ఇది ప్రసిద్ధ యాత్రాస్థలం.

ఆలయ వివరాలు :

ఆలయం పడమటి ముఖం కలిగి వుంది. గర్భగుడిపై విమానం వుంది. ఆలయానికి ప్రాకారంగాని, గోపురాలుగానిలేవు. స్వామివారు నిలబడి భక్తాదులకు అభయమిస్తున్నాడు. ఈ స్వామికి పూజలు పాంచరాత్ర అగమం ప్రకారం జరుగుతున్నాయి.

చినతిరుమలయ్య ఈ స్వామిని మూడు కీర్తనలలో కీర్తించినాడు—

మిక్కిలి నేరు పతివి మేలు మేలోయి
గుక్కని వలపుల వోకోన చెన్నరాయడా
యెన్నిక సరసాల నాకిచ్చకాలు సేసేవు
కన్నెవలపు వేడుక కాడవుగావా
నన్ను నిటె శ్రీవేంకటనాథుడు కూడితివి
కొన్నదె కోలిక నీకు గోన చెన్నరాయడా (16-2-19)
ఇంచుక యసమిచ్చితే యెవ్వరూ నేలమానేరు
కొంచేవా నీవిక గోన చెన్నరాయడ (16-2-62)
కొంతుడు మరుని యాజ్ఞ కడవ లేడింతేకాక
కొంతైనా నెరగడా కోన చెన్నరాయడా (16-2-68)

ఊటుకూరు చెన్నరాయడు :

ఊటుకూరు కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామానికి అయిదుమైళ్ళ దూరంలో వుంది. తాళ్ళపాక గ్రామానికి ఇది దగ్గరగా వుండడం, అంతేగాకుండా వారి బంధువులు వుండడాన్ని

బట్టి చినతిరుమలయ్య అక్కడికి తరచూపోతూ ఊటుకూరు చెన్న-రాయని దర్శించి కీర్తించారని తెలుస్తూంది.

తియ్యని మాటల వేలించేవూ
వొయ్యారపు వూటుకూరి చెన్నరాయ
నవకపు శ్రీవెంకటనాథ నన్నుగూడి
తులిదలలో నూటుకూరి చెన్నరాయ (16-2-24)

3. నారసింహస్వామి :

"మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామోరామో రామశ్చ బుద్ధః కల్కిరేవచ"

అని దశావతారాలను చెప్పడం సంప్రదాయం.

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. ఇతడు విష్ణుభక్తుడు. ఈసామాన్యుడయిన భక్తునికోసం విష్ణువు స్వయంగా నరసింహావతార మెత్తడం ఈ అవతారంలోని ప్రత్యేకత. నరసింహస్వామిని ద్వైత, అద్వైత,విశిష్టాద్వైతమతానుయాయులు కొలుస్తారు. కానీ ఆ సేవనంలో ద్వైతులకు, విశిష్టాద్వైతులకు భేదం వుంది. అద్వైతుల దృష్టిలో అతడు హరిహరమూర్తి.

"ఆ కంఠం విష్ణు రూపాయ ఇత ఊర్ధ్వం శివరూపిణే"అనడాన్ని బట్టి క్రిందిభాగాన్ని విష్ణురూపంగా కంఠం పైభాగాన్ని శివరూపంగా పేర్కొంటారు. శైవులు శివుని పూజించేటపుడు నమకచమకాలతో పూజించడం సంప్రదాయం. అందుకే అన్నమయ్య

"నమక చమక హిత నారసింహావో
నముచి సూదన సంధ్య నారసింహ" (1-259)

అని పేర్కొన్నాడు.

పెదతిరుమలయ్య అహోబిల నరసింహస్వామిని ఏడు కీర్తనల్లో చినతిరుమలయ్య కదిరి నరసింహస్వామిని మూడు కీర్తనల్లోనూ, ఓగునూతుల నరసింహస్వామి ఒక సంకీర్తనలో కీర్తించాడు.

అహోబలం నరసింహస్వామి :

కర్నూలు జిల్లా శిరివోలు మండల కేంద్రంలో రుద్రవరం అనే వూరుంది. ఈ వూరికి ఐదుమైళ్ళ దూరంలో అహోబలం ఆలయం వుంది. ఈ ఆలయం అడవులమధ్య నల్లమల కొండల్లో వుంది. నంద్యాల గుంటూరు రైలుమార్గంలో నంద్యాల రైల్వేస్టేషనుకు నలభై రెండు మైళ్ళ దూరంలో వుంది. కొండమీద ఉండే ప్రాంతానికి ఎగువ అహోబలం, పెద్ద అహోబలం అని, క్రింది ప్రాంతాన్ని దిగువ అహోబలం, చిన్న అహోబలం అని అంటారు.

స్థలపురాణం-స్థానిక కథలు :

పూర్వం శ్రీమహావిష్ణువు ఉగ్రనరసింహావతారం ధరించి చండ ప్రచండుడై హిరణ్యకశిపునిపట్టి తన తొడలపై వేసుకొని సంహరించగా సకల దేవతలు, మునులు, అహో....బలం....అహో....బలం అన్నారట అంటే "అహా ఎంత బలం" అని అర్థం. ఆ పదమే కాలక్రమంలో అహోబలంగా మారిందని కథ. హిరణ్యకశిపునికి విష్ణువంటే పడదు. విష్ణు భక్తుడైన తన కుమారుని పభాభవనంలోని ఒక స్తంభంలో విష్ణుమూర్తిని చూపమన్నాడు. హిరణ్యకశిపుడు స్తంభాన్ని తన్నగా అది ముక్క చెక్కలైంది. అందులోంచి నృసింహుడు అవతరించి హిరణ్యకశిపుని వధించాడు. హిరణ్యకశిపుని చంపిన ప్రదేశం ఈ అహోబలం అని అంటారు. షష్ట పరాంకుశస్వామి అనేవారు ఇక్కడ తపస్సు చేస్తూ బిలం ప్రవేశించాడు. అంచేత ఈ ప్రదేశానికి అహో. బలం అని పేరు వచ్చింది.

నంద్యాల రాజు అయిన ఔభళరాజు నరసింహస్వామి భక్తుడు. అతని పేరుమీదనే ఈ క్షేత్రానికి ఔభళక్షేత్రం అనేపేరు వచ్చింది. కాలక్రమంగా అది అహోబలంగా మారిందని కథనం.

పీఠాధిపతులకు మూలపురుషుడు శ్రీనివాసాచార్యుడు. అతనికి నరసింహస్వామి స్వప్నంలో కనబడి సన్యాసాశ్రమం యిచ్చాడు. వైష్ణవాళ్వారులు ఈ క్షేత్రాన్ని "శింగవేల్‌కున్రం"గా పేర్కొంటారు. నవనారసింహులు ఐదు కోశాల చుట్టుప్రక్కల్లో ఉండడంవల్ల ఈ క్షేత్రానికి "పంచకోశతీర్థం" అనేపేరు వచ్చిందని కథ.

శాసనాలలో ఆలయ విశేషాలు :

అహోబలస్వామి ప్రశంసన వున్న శాసనాలు మొత్తం ఇరవై. అందులో చిన్న అహోబలం ప్రశంస పదిహేను శాసనాల్లోను. పెద్ద అహోబలం ప్రశంస ఐదు శాసనాల్లోను కనిపిస్తుంది. శాసనాల్లో చిన్న అహోబలం, పెద్ద అహోబలం అని స్పష్టంగా వున్నాయి. ఇవన్నీ అన్నమయ్య తరువాతి కాలం నాటివే.

చిన్న అహోబలం :

1. క్రీ.శ. 1515వ సంవత్సరం శ్రీవీరకృష్ణ మహాదేవరాయల శాసనంలో స్వామి అంతరంగ వైభవాతి ప్రశంస కనబడుతుంది.

2. క్రీ. శ. 1532వ సంవత్సరం గుబ్బిరాజు కుమారుడు అబ్బిరాజు శాసనంలో తిరువందవనం ప్రశంస. క్రీ. శ. 1545వ సంవత్సరం నరసింగదేవమహారాజు కుమారుడు తిమ్మయ్యరాజు శాసనంలో మోపూరు గ్రామ రథోత్సవవైభవం, క్రీ. శ. 1547వ సంవత్సరం రామరాసయ్య కుమారుడు ఉగ్గరాసయ్యంగారి శాసనంలో "క్షీరాబ్ధిమహోత్సవ" ప్రశంస, క్రీ. శ. 1548వ సంవత్సరం మహా-

మండలేశ్వర, గోబూరి ఓబయ్యగారి నరసమ్మ శాసనంలో నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సర ఉత్సవాల ప్రశంస, క్రీ. శ. 1552వ సంవత్సరం మహామండలేశ్వర రామరాజకోనేటిరాజ కుమారుడు కొండయ దేవమహారాజు శాసనంలో రామానుజ కూటంలో జరిగే కార్యక్రమ ప్రశంస, క్రీ. శ. 1554వ సంవత్సరం శఠగోపజియ్య హరిహరనాథముని పెద్దరాజు వగైరా శాసనంలో పూలతోట పెంపకం, క్రీ.శ. 1563వ సంవత్సరం కోనేటి అయ్యదేవ మహారాజు కుమారుడు ఒబులయ్య శాసనంలో అహోబల స్వామికి 308 వరహాల ఉపయోగం, సదాశివరాయుల కాలంనాటి శాసనంలో తిరువందవనం తోట పదహారు కాళ్ళ మంటపంలో అహోబలస్వామి ఆసీనులగుట, క్రీ. శ. 1536వ సంవత్సరం తిమ్మన్న కుమారుడు వెంకట్రాజు దేవచోడ మహారాజు శాసనంలో అహోబలస్వామి దేవాలయ కార్యక్రమాల ప్రశంస మొదలయినవి కనిపిస్తాయి. నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ, రథోత్సవ, క్షీరాబ్ది మహోత్సవస్వామి అంగరంగ వైభోగాల ప్రశంస మొదలైనవి కనిపిస్తాయి.

పెద్ద అహోబలం :

క్రీ. శ. 1548వ సంవత్సరం నరసింగయ్య దేవకుమారుడు మహామండలేశ్వర నంద్యాల చిన్న ఔభళరాయని శాసనంలో అహోబలస్వామి అరగింపు. తళిగెల ప్రశంస, క్రీ.శ. 1553వ సంవత్సరం ఓబుళ రాజకుమారుడు అప్రతీకమల్ల వెంకటాద్రి మహారాజు శాసనంలో ప్రతి సంవత్సరం పదహారు కాళ్ళమంటపంలో అహోబలస్వామి పదహారురోజుల ఉత్సవాల ప్రశంస, క్రీ.శ. 1563వ సంవత్సరం శఠగోప జియ్యంగారుశాసనంలో అహోబలేశ్వరస్వామి తిరునాళ్ళ ప్రశంస కనిపిస్తాయి.

పై శాసనాలలో అరగింపు సేవ, 16 రోజుల ఉత్సవ ప్రశంస, తిరువీధుల ఉత్సవాల ప్రశంస కనిపిస్తాయి.

పశ్చిమభూపతి రెండవ విక్రమాదిత్యుని (1078-1126)శాసనంలో ఆలయానికి అనేక దానధర్మాలు చేసినట్లు ప్రస్తావన ఉంది. ఆ శాసనంబట్టి మూలబేరం మాత్రం ఆ ఆలయంలో వుండేదని స్పష్ట-మవుతుంది. కడపటి కాకతీయ ప్రభువు రెండవ ప్రతాపరుద్రుడు (1300-1325) బంగారంతో ఉత్సవ విగ్రహం చేయించడమే కాకుండా స్వామికి సక్రమంగా పూజావిధానం సాగేటట్లు చేశాడట. అయినా రాయలకాలంలోనే ఈ స్వామికి పూజానైవేద్యాలు బాగా ప్రచారంలోకి వచ్చినట్లు స్పష్టమవుతాయి.

ఆలయ విశేషాలు :

కొండమీద ఉండే ప్రాంతానికి ఎగువ అహోబలం, పెద్ద అహోబలం అనిపేరు. ప్రధానంగా ఆలయంచుట్టూ ఎత్తుగా బలిష్టంగా నిర్మించిన ప్రాకారం వుంది. ఆలయానికి పడమట, తూర్పున రాజ-గోపురాలున్నాయి. పడమట గోపురం ఆలయ ప్రవేశద్వారంగా వుంది. స్వామి పశ్చిమాభిముఖుడు. ఆలయానికి ముఖమంటపం, గర్భగృహం ఉన్నాయి. అంతరాళంలేదు. ముఖమంటపం వరుసకు నాలుగు స్తంభాల చొప్పున రెండువరుసలలో ఏడుఅడుగుల ఎత్తున్న స్తంభములచేత నిర్మించబడింది. ముఖమంటపం స్తంభాలు ఒకే కాలంలోనివి అయినా నిర్మాణంలో భేదం కనబడుతుంది. ముఖ మంటపం తర్వాత గర్భగృహం, గర్భాలయద్వారానికి ఇరువైపుల గూళ్ళయందు ద్వారపాలక విగ్రహాలున్నాయి. గర్భగుడి మధ్య-భాగంలో ఉగ్రనరసింహస్వామి అతని తొడలమీద హిరణ్యకశిపుడు

వున్న మూలబేరం ఉంది. స్వామి పాదాలచెంత ప్రహ్లాదుని విగ్రహం ఉంది. స్వామిని స్వయంప్రభువు అంటారు. ఆలయ సమీపంలోని నీరు ఎర్రగా ఉంటుంది. నరసింహస్వామి హిరణ్యకశిపుని చంపడం ఆ రాక్షసుని రక్తం ఒక మడుగుగా ఏర్పడిందని, అదే నేడు రక్త గుండమనే పేరుతో వ్యవహరింపబడుతున్నది. భవనాశి అనే తీర్థం అంతర్వాహినిగా వేదాద్రి గరుడాద్రులమధ్య ప్రవహిస్తుంది. ప్రహ్లాద వరద నరసింహాలయానికి ఒకఫర్లాంగు దూరంలో ఆళ్వారుల కోనేరు ఉంది. ఈ ప్రదేశంలోనే "లంజకోనేరు" అన్న తీర్థం ఉంది. దీన్ని ఒక వేశ్య తన పాపప్రక్షాళనకోసం కట్టించిందని అంటారు.

పూజాదికాలు :

అహోబలం లక్ష్మీనరసింహస్వామికి ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో (ఫిబ్రవరి-మార్చి) బ్రహోత్సవాలు జరుగుతాయి. ఇవి ఫాల్గుణ శుద్ధపంచమినుండి పదకొండురోజులపాటు జరుగుతున్నాయి. ప్రాచీన సంప్రదాయం ప్రకారం జరిగే ఈ కార్యక్రమాల్లో మొదటి దినం దిగువ అహోబలస్వామికి అంకురార్పణ, రెండవదినం ధ్వజా-రోహణం, భేరిపూజ, మూడవదినం సూర్యప్రభవాహనం, నాల్గవ దినం హనుమద్వాహనాల్లో ఊరేగిస్తారు. ఎగువ అహోబలంలోకూడ అంకురార్పణ, శేషవాహనం, అశ్వవాహనం, హనుద్వాహనంలలో ఊరేగింపు, కళ్యాణోత్సవం, గరుడోత్సవం మరియు అవరోహణం అనేవి క్రమంగా పదకొండురోజులు జరుగుతున్నాయి. ఇందులో బ్రహోత్సవం వైభవంగా జరుగుంది. ఫాల్గుణ పూర్ణినాడు ఈ దేవునికి తిరునాళ్ళు జరుగుతుంది. ఈ ఉత్సవాలలో చెంచులకు ఒక ప్రత్యేకస్థానం వుంది. ఎందుకంటే చెంచుల ఆడపడుచు చెంచులక్ష్మి స్వామి దేవేరి కావడమే.

పెదతిరుమలయ్య అహోబల నరసింహస్వామిని ఏడు కీర్తనల్లో కీర్తించాడు. అందులో అధ్యాత్మిక కీర్తనల సంఖ్య ఆరు, శృంగార సంకీర్తన ఒక్కటి మాత్రమే.

తాళ్ళపాక అన్నమయ్య పెద్ద అహోబలాన్ని, దిగువ అహో-బలాన్ని వేరువేరు కీర్తనలలో కీర్తించాడు. పెదతిరుమలయ్యమాత్రం దిగువ అహోబలంలో వుండే నరసింహస్వామిని మాత్రమే కీర్తించాడని వూహించవచ్చు. దీనికి ప్రధానకారణం ఇతని కీర్తనల్లో "పెదయాభళ" మని పేర్కొనకపోవడమే.

పట్టి దైత్యుల వేటాడే బలుదీము సింహము
మెట్టి అహోబలముపై మెఱసీ దానదివో (21-119)

భాసురముగ శ్రీవేంకట గిరిబాయని దైవమువటుగానా
వోసరకిపుడేగతి పిట్ట నహోబల నరసింహా (21-131)

అందె కంబములో బుట్టి ఆయుధాలు చేతబట్టి
వెదకి అహోబలాన వేడుకబుట్టి (21-132)

నమామహం మానవ సింహం
ప్రముదాకం మహోబల సింహం (21-160)

సిరిసెర గౌగిట శ్రీనరసింహ మంచి
సిరుల యహోబల శ్రీనరసింహా (21-227)

ఇందే కలిగె నీకు నిన్ని భోగాలు
అందముగా జిత్తగించు మహోభళేశ్వరా (21-228)

అద్దా శ్రీవేంకటాద్రి నహోబలమునందు
తిద్దితివి నన్ను నేడనెకి వోబులేశుడా (23-395)

కొలువు :

"కొలు" అన్నది ద్రావిడభాషా పదం. శబ్దరత్నాకరంలో ఆస్థానము, సేవ, ఉత్సవవిశేషములు అనే అర్థాలున్నాయి. తెలుగులో "కొలువు", "దర్బారు" అని వ్యవహారం.

కొలువు అన్నది మొదట దేవాలయ పరిభాష అయినా కాలక్రమేణా రాజుల కొలువు అని రూఢి అయింది. కొలువుకూటం, కొలువు చేస్తున్నారు అనేవి ఇపుడు వ్యవహారంలోఉన్నవి. ఇవేగాక నవరాత్రి పండుగలలో బొమ్మలకొలువు పెట్టడంకూడా సాంప్రదాయంగా ఉంది.

పెదతిరుమలయ్య అహోబల నరసింహస్వామికి జరిగే కొలువును క్రింది కీర్తనలో కీర్తించాడు.

నానా మహిమల శ్రీనారసింహము
పూని మమ్ము రక్షించీ పొగడెదనిదిగో ॥పల్లవి॥

కొండవంటి వేదాద్రి గుహలలో సింహము
దండి భవనాశి యేటి దరి నరసింహము
అండ నారు శాస్త్రముల అడవిలో సింహము
నిండి అహోబలముపై నిక్కి సూచీ నదిగో ॥నానా॥

దిట్ట యోగీంద్రుల మతి తెరమఱగు సింహము
పట్టి దైత్యుల పేటాడే బలుదీము సింహము
మెట్టి అహోబలముపై మెఱసీదా నదిగో ॥నానా॥

పలుదేవతల వెనుబలమైన సింహము
కెలసి కంభాన చెనగిన సింహము
కొలుపై అహోబలాన గురుతాయు నిదిగో (21-119)

కదిరి-నృసింహుడు :

రాయలసీమలో అనంతపురం జిల్లా ఒకటి. ఈ జిల్లాలో వెలసివున్న ప్రసిద్ధ ఆలయాలలో కదిరి నరసింహస్వామి ఆలయం పేర్కొనదగింది. ఈ కదిరి పట్టణం 1910వ సంవత్సరందాకా కడప జిల్లాలో వుండేది. ప్రస్తుతం పట్టణం అనంతపురం జిల్లాలో ఒక మండల కేంద్రం. ఇది పాకాల-ధర్మవరం రైలు మార్గంలో వుంది.

ఆలయం-స్థానిక కథలు :

కదిరి పట్టణంలో వెలసిన నృసింహస్వామికి సంబంధించిన ఆరు స్థానిక కథలు ప్రచారంలో ఉన్నాయి.

1. కదిరికి "ఖాద్రి" అని పౌరాణికనామం. ఖాద్రి అనే పేరు కల్గిన చెట్టుకింద ఒక పుట్ట వుండేది. ఆ పుట్టలో నుండి లక్ష్మీనరసింహస్వామి అవతరించాడని, దాంతో "ఖాద్రి" అని పేరు ఏర్పడినట్లు కథనం.

2. పూర్వం ఈ క్షేత్రంలో ఖాదిరి వృక్షం వుండేది. ఆ వృక్షం క్రింద ఒక భక్తునికి నరసింహస్వామి దివ్యదర్శనం కల్గింది. అందుచేత కదిరి అనే పేరు వచ్చిందని ఇతిహ్యం.

3. "ఖ" అంటే విష్ణుపాదం. అద్రి అంటే కొండ అని అర్థాలు. విష్ణువు పాదం ఉన్న కొండ కాబట్టి దీనికి "కదిరి" అనే మరో అభిప్రాయంకూడా వుంది.

4. ఈ క్షేత్రానికి శ్రీమత్ఖాద్రి లక్ష్మీనరసింహ క్షేత్రమనికూడా పేరు. "ఖాదిరి" అంటే చంద్రవృక్షం. ఈ వృక్షసంపద ఎక్కువగా ఉండడంతో దీనికి ఖాదిరి క్షేత్రం అని, దాని రూపాంతరమే కదిరి అని ఏర్పడింది.

౪. పూర్వం "ఖదిరీ వృక్షారణ్యంలో" వెలకొన్న నరసింహస్వామి మహిమవల్ల ఆ ప్రాంతానికి కదిరి అనే పేరు వచ్చింది.

౫. ఒకప్పుడు ఈ మహారణ్యంలో భృగుమహర్షి నివసించేవాడు. అందువల్ల దీనికి "భృగు ఆశ్రమం" అని స్థానికుల అభిప్రాయం.

స్థలపురాణం :

కదిరి క్షేత్రానికి సంబంధించిన "మహిమలు" శ్రీఖాద్రి స్థల పురాణంలో వుంది. ఈ క్షేత్రమహాత్మ్యాన్ని శంకర భగవానుడు నారద మహర్షికి చెప్పాడు. శంకర భగవానుడు నరసింహస్వామి మహిమతోపాటు ఆ ప్రదేశంలో వున్న తీర్థ, స్థలవిశేషాల్ని విపులంగా వివరించాడు. ఈ ఖాద్రి స్థల పురాణాన్ని దేవాలయ అధికారులు ముద్రించారు. దీన్ని చెట్లూరు నరసింహాచార్యులు గారు పూర్వోత్తర, భాగ వచన కావ్యంగా వ్రాసి ముద్రించారు.

శాసనాలలో ఆలయవిశేషాలు :

కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పూర్వపుచరిత్ర అంతగా తెలయదు. కానీ ఆలయ వివరాలను తెలిపే శాసనాలు క్రీ. శ. 1352వ సంవత్సరం నుండే కనిపిస్తున్నాయి.

మొదటిది క్రీ. శ. 1352వ సంవత్సరం వీరబుక్కణ ఒడయరు దోరసముద్రం పెనుగొండ ప్రాంతాలను పరిపాలించే కాలంలో "పందిమ సన్నాయ చెలినాయక" కదిరి ఔభళదేవ నగరిమంటపాన్ని కట్టించాడు.

రెండవది క్రీ.శ. 1367వ సంవత్సరం పాపినాయుడు కుమారుడు బ్రహ్మనాయుడు పొంతరవల్లి ఆయుకట్టు చెరువు నీళ్లుపారే "ఒకపుట్టి"

భూమిని కదిరి అహోబలస్వామి నైవేద్య ఉపయోగార్థం నియమనం చేశాడు.

మూడవది క్రీ. శ. 1418వ సంవత్సరం వీరహరిహరరాయల కుమారుడు వీరకుమారదేవరాయలు, హరిజన, అరుంధతీయులకు (మాల, మాదిగలకు) పన్ను లేకుండా చేసి దేవాలయ ప్రవేశం కల్పించాడు.

నాల్గవది క్రీ. శ. 1529వ సంవత్సరం శ్రీకృష్ణదేవరాయల పరిపాలనా కాలంలో కోనపరాయుని అల్లుడు వెంకటనాయుడు, మొక్కుబడి చెల్లించే నిమిత్తం కదిరి వరసింహస్వామికి "మడిని" కట్టడి చేశాడు.

ఐదవది క్రీ.శ. 1547వవ సంవత్సరం అబ్బారాజు ఓబులరాజు కుమారుడు మహామండలేశ్వర అప్రతీక మల్ల అచ్యుతరాజు పొంతర-పల్లి గ్రామానికి చెందే భూములను సంకీర్తన కేశవయ్య సుదర్శన ఓబులయ్య మరియు కాలువ కృష్ణయ్యలకు కదిరి నృసింహస్వామి సన్నిధిలో శ్రీజయంతి పుణ్యకాలంనాడు ఉంబళికిగాను ఏర్పాటు చేశాడు. ఈ పొంతరపల్లి గ్రామం "పట్టువగుళ్ళ" సీమకు చెందినది.

ఆలయ విశేషాలు :

ఒకప్పుడు నాలుగు రాజగోపురాలను ఈఆలయం కలిగివుండేది. వాటిలో దక్షిణదశలో వున్న రాజగోపురం 1963లో శిథిలమైంది. ప్రస్తుతం ఇది నిర్మాణంలో వుంది, ఉత్తరదిక్కులో వుండే రాజగోపురాన్ని 1978వ సంవత్సరంలో తూర్పు పడమర దిక్కుల్లో వుండే రాజగోపురాలను 1930-82 సంవత్సరాల్లో జీర్ణోద్ధరణ గావించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం చాలా విశాలమైంది. చుట్టూ

ప్రహారీ, నాలుగుపక్కలా ద్వారాలు వాటిమీద గోపురాలు వున్నాయి. ఈ ఆలయం తూర్పుముఖంగా కట్టబడి వుంది తూర్పుముఖంనుండి లోనికి ప్రవేశిస్తే ఆంజనేయస్వామి మంటపం కనిపిస్తుంది. ఈమంటప గర్భగృహంలో ముకుళిత హస్తుడైన ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠింపబడింది.

ఆలయానికి ముందు భాగంలో వున్న చిన్నమంటపంలో గరుడ విగ్రహం వుంది. ప్రధాన ఆలయం గర్భగుడిమీద ఏకతల విమానం వుంది. దీనికి నాలుగుదిక్కుల్లో నాలుగు కూర్చున్న సింహాలు, అంజలి ఘటిస్తున్న నాలుగు గరుడ విగ్రహాలు వున్నాయి.

ఆలయం దక్షిణదిక్కులో చిన్నమ్మ మందిరం వుంది. ఆ మందిరంలో చిన్నమ్మ రాతి విగ్రహం, ఆమె త్రవ్వించిన బావి వున్నాయి. క్రీ.శ. 1829లో శ్రీనివాసరాయరు ఆలయ మంటపంమీద రామాయణ భారత గాథలను రకరకాల రంగుల బొమ్మలతో చిత్రించి నారు. ప్రస్తుతం వీటి రూపం పాడయింది.

గర్భగుడిలో నరసింహస్వామి (మూలబేరం, మూలవిరాట్) పద్మపీఠంపై వీరాసనపద్ధతిలో ఆసీనుడై వున్నాడు. ఈ స్వామి అష్టబాహువులు కలిగి, ఉగ్రస్వరూపుడై భయంకరమైన కోరలుకలిగి హిరణ్యకశిపుని తొడలపై పెట్టుకొని సంహరిస్తున్నట్లుసాక్షాత్కరిస్తున్నాడు స్వామి వారికి వెనుకభాగంలో ప్రహ్లాదుడు, అదే ఆలయంలో స్వామి వారి మరో విగ్రహం వుంది. ఆ విగ్రహం ఎడమతొడపై దేవి ఆసీను రాలైంది. ఈ స్వామి చతుర్భుజుడు. శంఖచక్రాలు కలిగి వున్నాడు. ఇక్కడివారు ఈ స్వామిని ప్రహ్లాద అనుగ్రహమూర్తిగా భావిస్తారు.

పూజా విశేషాలు :

ఈ ఆలయంలో పూజలు వైఖానస ఆగమ పద్ధతిలో కొనసాగు

తున్నాయి. ఇక్కడ స్వామివారికి నిత్య, వార, విశేష ఉత్సవాలు సంబరంగా జరుగుతున్నాయి.

తిరుమలలో మూలమూర్తికి అభిషేకం శుక్రవారం నిర్వహిస్తారు. కదిరిలో మూలబేరానికి శనివారం, అమ్మవారికి మాత్రం శుక్రవారం పంచామృత అభిషేకోత్సవం చేయడం సంప్రదాయం.

సంవత్సరోత్సవాలుగా ఉగాది, అస్థానం, శ్రీరామనవమి, నృసింహజయంతి, వినాయకచవితి, ముక్కోటి ఏకాదశి, బృందావన పూజ, సంక్రాంతి, వసంతోత్సవం, దసరా ఉత్సవం, కార్తికదీపోత్సవం ధనుర్మాసోత్సవం, ఉత్తరాయణ పుణ్యకాలం, పారువేట ఉత్సవం మొదలైనవి ప్రసిద్ధాలు.

ఈ ఉత్సవకాలంలో జరిగే ప్రత్యేక సంప్రదాయాలు రెండు— 1. బ్రహ్మోత్సవ కాలంలో సుద్దులు చెప్పేవారు కొందరు సాసవుల చిన్నమ్మకథను గానం చేస్తారు. ఆ భక్తురాలికి శ్రీనరసింహస్వామి మద్దులేటయ్య స్వరూపంలో దర్శనమిచ్చి అత్తగారు పెట్టిన కష్టాలను నివారించినట్లు కథలు వల్లిస్తారు. 2. పన్నెండవ దినం ఉదయం రథం కదలక ముందే కదిరి పట్టణంలో వున్న అలంఖాన్ మసీదులో చదివింపులు జరుపుతారు. ఈవిధంగా చదివింపులు జరుపకపోతే రథం ముందుకు కదలదనే నమ్మకం వుంది. నేటికీ ఈ సంప్రదాయం నిలిచి ఉండడం ఒక విశేషం.

ఆంధ్రదేశంలో నృసింహ క్షేత్రాలు అనేకం వున్నాయి. నవ నారసింహ క్షేత్రనిర్ణయంలో పలుచోట్ల పలురకాలుగా వున్నాయి. మంగళగిరి, అహోబిలం, సింహాచలం, అంతర్వేది, వేదాద్రి, యాదవాద్రి, ఖాద్రి, ఆకిరిపల్లి, నగిరి క్షేత్రాలే నవనారసింహ

క్షేత్రాలని చెప్తున్నారు. తాళ్ళపాకవారి దృష్టి నవనారసింహ క్షేత్రాలు భిన్నంగా వున్నా, కదిరి (ఖాద్రి) నృసింహుడు మాత్రం నవ నారసింహులలో ఒకడు.

చినతిరుమలయ్య కదిరి నారసింహస్వామిని మూడు కీర్తనలలో కీర్తించినాడు. వీటిలో 16-37 కీర్తన ఆధ్యాత్మిక సంబంధి, 16-38, 58 కీర్తనలు శృంగార సంబంధులు.

తగవో బలిమో నీ తలపు నాతో జెప్పర
నగుమోముతో గదిరినాథ నీవు (16-2-38)

చెప్పరే మీరైనా బుద్ధి చెలులార
అపసము మా కదిరి యప్పనికి (16-2-58)

చినతిరుమలయ్య ఆధ్యాత్మ సంకీర్తనలో స్వామివారి ఆకార వర్ణనకే ప్రాధాన్యం కనిపిస్తుంది.

తనదాసుని కొరకు ధరియించె నీ రూపము
దినదిన వేడుక, గదిరి నారసింహుడు

బలురక్కసు నొడిసి పట్టి తొడలపై బెట్టి
చెలగి కొనగోళ్ళ జించినాడు

చలపట్టి ప్రేగుల జంధ్యాల తోడుతను
తెలిపై వున్నాడు కదిరి నారసింహుడు

ఘోర దానవు కంఠకుహర రక్తము ముంచి
సొరెకు వసంతముగా జల్లినాడు
మారుకొన్న దైత్యుని చర్మమొలిచి మేనిమీద
ధీరత గప్పినాడు కదిరి నారసింహుడు (16-1-37)

లక్ష్మీనరసింహస్వామి ఒక పుట్టినుండి అవతరించాడని స్థానికుల ఐతిహాసం. దీన్ని తలపించే విధంగా చినతిరుమలయ్య—

అందపు లక్ష్మియు బ్రహ్లాదుఁడు మతింపగాను
విందుగా నాగముపాల వెలసినాడు (16-37)

అని కీర్తించినాడు.

నేడు కదిరి నృసింహస్వామిని ముఖ్యమైన నిత్య, వార, విశేషోత్సవాలు జరుగుతున్నాయి. అయితే కల్యాణోత్సవం గురించి అన్నమయ్య సంకీర్తన రాశిలోగానీ, ఆలయగోడలపై వున్న శాసనాలలోగానీ, కల్యాణోత్సవ ప్రస్తావన కానరాదు. కానీ చినతిరుమలయ్య

అబ్బురపు శ్రీవేంకటాద్రినాథ కూడితివి
సిబ్బితివాయి బెండ్లి సేసిరా నీకూ (16-38)

అని కీర్తించడాన్నిబట్టి అతని కాలంలో కల్యాణోత్సవం జరిగే-దేమో అనిపిస్తుంది.

వేయినూతుల కోననరసింహుడు :

కడప జిల్లా పెండ్లిమఱ్ఱిమండలంలోని గ్రామం చిన్నదాసరిపల్లె. ఈ పల్లెకు దక్షిణదిక్కు రెండు కి.మీ. దూరంలో కొండలోయలు వున్నాయి. ఈ ప్రదేశాన్ని వేయినూతుల కోన అంటారు. అక్కడ నరసింహస్వామి ఆలయం వుంది. ఈ ప్రాంతమందలి కొండను మందల పాలకొండమల అంటారు. ఇది పెండ్లిమఱ్ఱికి మూడుమైళ్ళ దూరంలో వుంది. మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని కడప పట్టణానికి పదమూడుమైళ్ళ దూరంలో వుంది.

స్థలపురాణం-స్థానిక కథలు :

పూర్వం వాల్మీకి మహర్షి చిన్నదాసరిపల్లె కొండలోయల్లో నివసించేవాడు. అతడు వేయినూతులను త్రవ్వించినాడు. ఈ మహర్షే నరసింహస్వామిని ప్రతిష్ఠించినాడని ప్రతీతి. అహోబలంలాగే ఇది కూడ నరసింహక్షేత్రం. కాబట్టి ఔభలేశుడని అంటారు.

ఈ ప్రాంతానికి వేనూతుల కోన, ఓనూతుల కోన, ఓగు నూతులకోన, వెయ్యినూతులకోన అని పేర్లు వ్యవహారంలోఏర్పడినాయి అంతేకాని, ఓగునూతుల అనే ప్రదేశం కాని, ఊరుకానీ లేదు.

ఇక్కడి స్వామి మహిమలు విచిత్రంగా వుంటాయి. గుడిలోన గంట మ్రోగడం, రాత్రిపూట లక్ష్మీదేవి పాదాలవద్ద అర్చన ద్రవ్యా లుండడం, లాంటివి ధ్వజస్తంభానికి తైలం రాస్తే కష్టాలు తొలుగుతా యనే నమ్మకంకూడా వుంది.

ఇది అరణ్యప్రాంతం. దగ్గరికి వచ్చేదాకా ఇంత విశాలప్రదేశం ఉన్నట్లు కనబడదు. కొండలోయలు, జలపాతాలు, వృక్షసము- దాయంలో అలరారుతున్నది. జనసంచారం చాలాతక్కువ. ప్రశాంత వాతావరణం, పక్షుల కిలకిలరావాలుతప్ప ఆధునిక ప్రపంచఛాయలు కనబడవు.

శాసనాలలో ఆలయ వివరాలు :

ఈ ఆలయం గోడపై ఒకే శాసనం కనిపిస్తుంది. ఇది క్రీ. శ. 1553వ సంవత్సరం అచ్యుతరాయుల కాలంనాటికి ఓగునూతులపల్లె అహోబలేశ్వరాలయానికి గండికోటసీమ పాలకుని కార్యకర్త అయిన బాచరసు తాళ్ళపాక తిరుమలయ్యగారి ఆజ్ఞను అనుసరించి “దుర్గ- దన్నాయనివర్తన” సంబంధించిన వృత్తాంతం వుంది.

ఆలయ విశేషాలు :

నరసింహస్వామి ఆలయం ఒకమూల ఎత్తైన ప్రదేశంలోవుంది. ఈ ఆలయానికి ప్రవేశగోపురం కాని, ప్రాకారం కానిలేదు. స్వామి ఉత్తరాభిముఖుడు.

ప్రధాన ఆలయానికి ముఖమంటపం, అంతరాళం, గర్భగుడి వున్నాయి. గర్భగుడిపైన విమానం వుంది. ఆలయప్రాంగణంలో యాగశాల, కల్యాణమంటపాలు, స్వామివారి తలంబ్రాల మంటపం వున్నాయి. ఆలయం ముందుభాగంలో కొయ్య ధ్వజస్తంభం వుంది. ఇది ఎప్పుడూ నూనెతో తడిసి జిడ్డుగా వుంటుంది.

ఆలయంలోని స్వామి లక్ష్మీసమేతుడై వీరాసనంలో వున్నాడు. అంతరాళంలో జయవిజయులున్నారు. స్వామికి ఎదురుగా ఆంజనేయ స్వామి అంజలి ఘటిస్తున్న భంగిమలో వున్నాడు.

నరసింహ ఆలయానికి తూర్పుదిక్కుగా మెట్లు దిగితే క్రింది భాగం చెట్లపొదలో లక్ష్మీదేవి కనబడుతుంది. ఈ ఆలయానికి ముఖ-మంటపం, గర్భగుడి వున్నాయి. ఈ ఆలయం దక్షిణాభిముఖంగా వుంది.

నరసింహస్వామి ఆలయానికి పడమటభాగంలో ఒక కొండ చరియ వుంది. ఇక్కడ వున్న రెండు కోనేర్లు శిథిలంగాకుండా వుంది. కొండచరియగుండా వచ్చే నీరు ఈ కోనేర్లద్వారా ప్రవహిస్తుంది.

పూజాదికాలు :

స్వామివారికి వైఖానస ఆగమప్రకారం నిత్యపూజా కైంకర్యాలు జరుగుతున్నాయి. ఇక్కడ స్వామివారికి వైశాఖమాసంలో (ఏప్రిల్ మే) ఉత్సవాలు మూడురోజులపాటు జరుగుతాయి. వైశాఖ శుద్ధ

చతుర్దశినాడు ధ్వజారోహణం, పౌర్ణమినాడు గరుడసేవ జరుగుతుంది. ఈ గరుడసేవ రోజు స్వామివారికి చిన్నదాసరిపల్లెలో మహోత్సవం జరుగుతుంది. తరువాత పాడ్యమిరోజు స్వామివారికి కల్యాణోత్సవం, కల్యాణం తరువాత కోనేటిదగ్గర వసంతాలు, చక్రస్నానంజరుపుతారు.

చినతిరుమలయ్య కీర్తించిన ఓగునూతుల నారసింహుడు :

చినతిరుమలయ్య ఈ స్వామిని దర్శించి కీర్తించినట్లు

నాలితనాలేటికోయి నారసింహుడా
నాలోనె నవ్వువచ్చీ నారసింహుడా
చిలుకుగోళ్ళ నన్ను జెనకుచు నీపైనా
నలువెట్టి వచ్చేవు నారసింహుడా
కలికితనాన శ్రీవెంకటనాథకూడితివి
నలుపై వోగునూతుల నారసింహుడా (16-2-18)

4. శ్రీరామచంద్రుడు :

చినతిరుమలయ్య తిరుపతిలోని శ్రీరామచంద్రుని, రెండు కీర్తనల్లో, వాయల్పాడు శ్రీరామచంద్రుని రెండు కీర్తనల్లో కీర్తించి-నట్లు తెలుస్తూంది.

తిరుపతి శ్రీరామచంద్రుడు :

చిత్తూరు జిల్లా, చంద్రగిరి తాలూకా, తిరుపతి పట్టణము ప్రసిద్ధమైన పుణ్యస్థలం. ఈ పట్టణంలో వెలసిన ప్రసిద్ధ ఆలయాలు రెండు. ఒకటి గోవిందరాజస్వామి ఆలయం, రెండవది శ్రీకోదండరామస్వామి ఆలయం. ఈ కోదండరామస్వామి ఆలయాన్ని క్రీ. శ. 1480 - 81 నరసింహ మొదలియార్ నిర్మించినాడు. ఇక్కడి స్వామికి అన్ని

హంగులతో నిత్యపూజలు, ఉత్సవాలు సంవత్సరం పొడవునా జరుగు-తున్నాయి.

ఈ స్వామిని చినతిరుమలయ్య రెండు శృంగార కీర్తనలలో కీర్తించినట్లు తెలుస్తూంది.

నీవెక్కడో ఆపెనీకంటె నెక్కడో
రావయ్య తిరుపతి రఘురామచంద్ర
తవిలి శివుడు కాశి దారక బ్రహ్మమని
యివల నిన్ను పదేశ మియ్యగా

నవమై శ్రీవెంకటనాథ మరుమంత్రము
రవళి నీకీపె యిచ్చె రఘురామచంద్ర (15-2-107)
ఏమి మందు గద్దె యింతులాల యీ
రామకు దిరుపతి రాముడేమందు (16-2-106)

వాయల్పాడు శ్రీరామచంద్రుడు :

వాయల్పాడు చిత్తూరు జిల్లాలో ఒక మండల కేంద్రం. ఇది పాకాల-ధర్మవరం రైలుమార్గంలో మదనపల్లికి 18 కి.మీ. దూరంలో వుంది.

స్థలపురాణం-స్థానిక కథలు :

1. ఒకప్పుడు ఈ ప్రాంతంలో వాల్మీకి మహర్షి నివసించేవాడట. అతని పేరుతో ఈ ప్రాంతానికి వాల్మీకిపురమని ఏర్పడింది. అంతే-కాకుండా వాల్మీకి బోయకులానికి చెందడంతో బోయలవాడ అనే పేరు వ్యవహారంలో ఏర్పడింది.

2. రామాయణ కావ్యాన్ని వాల్మీకిమహర్షి నోటితో పాటరూపంలో పాడేవాడు. తెలుగులో నోటిపాటను తమిళభాషలో "వాయినాలపాట్టు"

అంటారు. అది నిత్యవ్యవహారంలో "వాయల్‌పాడు"గా మారిందని స్థానికులు చెబుతారు.

3. తురుష్కుల కాలంనాడు ఈ ప్రాంతంలో వావిలిచెట్లు ఎక్కువగా ఉండేవి. దాంతో ఈ ప్రాంతాన్ని వాయల్‌పహాడ్ అనేవారు

వావిలిపాడు, వాయల్‌పహాడ్, వాయల్‌పాడు అనినామాంతరాలు.

4. వాయల్‌పాడులో సాక్షాత్కరించిన స్వామి పట్టాభిరాముడు. ఈ స్వామిని జాంబవంతుడు ప్రతిష్ఠించాడని కథ.

ఆలయ విశేషాలు :

వాయల్పాడు రామాలయానికి చుట్టూ ప్రహరీగోడ వుంది. ఈ ఆలయానికి ఒక రాజగోపురం మాత్రం వుంది. ప్రధాన ఆలయానికి వెనుకభాగంలో వుండే రాజగోపురం పడిపోయింది. ఈ ఆలయంలో వెలకొన్న స్వామి ఉత్తరాభిముఖంగా సాక్షాత్కరించి ఉన్నారు.

ఆలయప్రాంగణం మధ్యలో ప్రధాన ఆలయం వుంది. దీనికి ముఖమంటపం, అంతరాళం, గర్భగుడిఉన్నాయి. గర్భగుడి పై విమానం వుంది. ఆలయానికి చుట్టూ యాగశాల, ఉయ్యాలమంటపం, వాల్మీకి గుడి ఉన్నాయి. ఉయ్యాలమంటపం పైకప్పులో గోవింద-రాజస్వామి శయనించి ఉన్నాడు. వాల్మీకి గుడిలో వాల్మీకి ఆశీనుడై వున్నాడు. ప్రధాన ఆలయానికి ముందుభాగంలో అంజనేయస్వామి గుడి వుంది.

గర్భగుడిలో సీతారామలక్ష్మణులేకాక భరత శతృఘ్నులుకూడా వున్నారు. అంతరాళానికి ముఖమంటపానికి మధ్యలో ఆంజనేయ విగ్రహం వుంది.

ధ్వజస్తంభానికి ముందు స్వామికి ఎదురుగా ఆంజనేయస్వామి అంజలి ఘటిస్తున్న భంగిమలో నెలకొన్నాడు.

పూజాదికాలు :

ఈ ఆలయం పట్టాభిరామునికి పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజలు, కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉత్సవాలు స్వామి వారికి చైత్రశుద్ధ షష్ఠినుండి త్రయోదశివరకు (మార్చి, ఏప్రిల్) జరుగుతాయి. స్వామివారిని రకరకాల వాహనాల్లో ఊరేగించడమే కాకుండా పదవరోజు సీతారామకల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. పదకొండవ దినం రథోత్సవం. స్వామి వారిని బ్రహ్మరథంపై మఖా-నక్షత్రంలో ఊరేగిస్తారు. పవళింపు సేవ, ఉయ్యాలసేవ చివరిరోజు ఉంటుంది.

చినతిరుమలయ్య వావిలిపాటి రామచంద్రుని దర్శించి కీర్తించాడని రెండుకీర్తనలవల్ల తెలుస్తూంది.

సవతుల మైనాను సంగతి దప్పదగునా
రవళి వాలివిపాటి రామచంద్రు ముందర (16-2-70)

రావయ్య వావిలిపాటి రామచంద్ర
రావాడి వలపులు రామచంద్ర

మూగిన సబలలోన ముంచి మాటలాడగాను
రాగెగానీ మోవికెంపు రామచంద్ర
మాగిన మాటలనె మర్మము లెత్తితినని
రాగతనాలు మానుమీ రామచంద్ర (16-2-67)

శ్రీరామచంద్రుడు ఏకపత్నీ వ్రతుడు. ఏకపత్నీ వ్రతుని చిన తిరుమలయ్య శృంగార కీర్తనల్లోనే కీర్తించాడు.

5. విఠ్ఠలుడు :

మహారాష్ట్రంలో షోల్హాపురానికి పడమటిదిక్కులో సుమారు నలభై మైళ్ళ దూరంలో భీమానది వుంది. ఈ నదికి ఉపనది అయిన చంద్రభాగానదీతీరంలో పండరీపురం వుంది. ఈ పండరీపురానికి అక్కడ సాక్షాత్కరించిన విఠలునిబట్టి ప్రఖ్యాతి వచ్చింది. ఈవిఠలుడు జైనమూర్తి అని, శివుడని, విష్ణువని అభిప్రాయ భేదాలున్నాయి.

"విఠ్ఠ" అనేది విష్ణు శబ్దభవం. శాసనాల్లో కనిపించే విటరస, బిట్టగ మొదలయినవి "విష్ణువర్ధన" మాటకు ప్రాకృతరూపాలు. అదీ గాక కన్నడంలో "కృష్ణ" అనడాన్ని ఆప్యాయంగా "కిట్ట" అనడం వుంది. అలాగే విష్ణు "విట్టు" అయిందని ప్రేమసూచకమయినల చేరి విఠల అయిందనికూడా కొందరు చెబుతారు. అయితే భండార్కర్‌గారు ఇటుక అనే అర్థం యిచ్చే "విటె" నుండి విట్టలు పుట్టిందని అనడం సమంజసమని స్పష్టం చేశారు.

విశిష్టాద్వైతాన్ని స్థాపించినవారు రామానుజాచార్యులు. ఆళ్వారులు నూటఎనిమిది దివ్య తిరుపతుల్ని దివ్యదేశాలుగా కీర్తించినారు. వారికి శ్రీరంగం, అహోబిలం, కంచి, తిరుపతి ప్రధాన మత కేంద్రాలు. అన్నమయ్య మొదట స్మార్తుడైనా ఘన విష్ణువు చలువతో వైష్ణవుడయినాడు. మహారాష్ట్రులు, మాధ్వులు విఠలునికిచ్చే ఆదరాన్నిబట్టి అట్టి విఠల కీర్తనలు వ్రాసినాడు.

మహమ్మదీయుల ధాటికి గురికాకుండా హిందూమతాన్ని రక్షించడంకోసంస్థాపించబడినసామ్రాజ్యం విజయనగరసామ్రాజ్యం. ఉత్తమాశయంకోసం విభేదాలను విస్మరించడం న్యాయమని అన్నమయ్య భావించి వుండవచ్చు. అందువల్ల దక్షిణాది వైష్ణవులకు

విఠలుడు శ్రీరంగడంత ముఖ్యుడు కాకపోయినా అన్నమయ్య విఠలుణ్ణివిట్టలా (26-68), విట్టలరాయ (17-96), విట్టలేశ్వరా (24-216) విటలేశుడు (24-301), పండరంగివిట్టలా (26-369), పండరంగినాథా (17-127), పండరంగిరాయ (12-219), పాండురంగవిట్టలా (3-220) అన్న పేర్లతో కీర్తించి తరవాతి వారికి మార్గదర్శకుడయ్యాడు.

కన్నడ హరిదాసులలో శ్రీపాదరాయలు ప్రముఖుడు. ఇతడు ముళబాగల కేంద్రంగా ద్వైతమతాన్ని ప్రచారం చేసినాడు. మఠాధిపతుల సంకీర్తనల్లో "రంగవిఠల" ముద్రవుంది. వారు రంగని స్తుతించినట్టే తిరుపతి తిమ్మప్పనుకూడా సేవించినారు. అతని తరువాత పురందరదాసులవారు విఠల,వేంకటేశ్వర అభేదాన్ని తమసంకీర్తనల్లో శాశ్వతం చేశారు, ఇదేవిధంగా విఠలుణ్ణి వేంకటేశ్వరుని ప్రతిరూపం-గానే భావించినాడు.

ఈ విట్టల సంకీర్తనగానం అన్నమయ్యతోనే ఆగిపోకుండా పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలుకూడా కొనసాగించారు.

పెదతిరుమలయ్య విజయనగరం విట్టలేశ్వరుని ఒకసంకీర్తనలో, చినతిరుమలయ్య కోవెలకుంట్ల పాండురంగ విట్టలస్వామిని ఒక కీర్తనలో, గోపాలకృష్ణుని ఒక కీర్తనలో కీర్తించారు.

విజయనగర విట్టలేశ్వరుడు :

విజయనగరంలో ఎన్నో దేవాలయాలున్నా పెదతిరుమలయ్య విట్టలుణ్ణి స్వాభిమానంతో కీర్తించాడు. కన్నడిగులకు ముఖ్యంగా హరిదాసులకు ముఖ్యదైవం విట్టలేశ్వరుడు. పాలకులు కన్నడ ప్రభువులు కావడంవల్ల, విస్తృత వైష్ణవానికి తండ్రివలె ఇతడు ప్రయత్నించేవాడు కావడంవల్ల విట్టలుణ్ణి ఒక కీర్తనలో స్తుతించాడు.

వేడుకకాడు గదమ్మ విట్టలుడు
ఆడానీడా నేగివచ్చీనదె విట్టలుడు ॥పల్లవి॥

తుంగభద్ర నీటిలోన తొయ్యలులు దాను నీదీ
వెంగలి రతుల దోగీ విట్టలుడు
నింగిమోచిన తోపుల నీడల వినోదించి
నంగనలతో నవ్వుచునదె విట్టలుడు ॥వేడుక॥

తేరువీధి నల్లవాడే దిమ్మరై సతుల బిల్చి
వేరమ్మనీ చీకటింట్లో విట్టలుడు
కూరిమి నిలుపలేక కొండల పడవలలో
నారగించీ నూరవిందు లదే విట్టలుడు ॥వేడుక॥

అది వో విజయనగరమందు వాడల వాడల
వెదచల్లీ వరములు విట్టలుడు
ఉదుట శ్రీవేంకటాద్రి నుండి వచ్చి గుడిలోన
నదన రుక్మిణి దానునదే విట్టలుడు (23.289)

ఛాందస వైష్ణవులకు రంగ, వరద, శ్రీనివాస ఆరాధ్యమూర్తులు. ఇవి మహావిష్ణువు ప్రతిరూపాలని నమ్ముతారు. కొందరు "విఠల"రూపాన్ని రంగ, వరద మూర్తులతో సమానంగా గుర్తించరు. కాని విస్తృత వైష్ణవాన్ని లక్ష్యంగా పేర్కొన్నారు తాళ్ళపాక కవులు.

కోవెలకుంట్ల పాండురంగడు :

కర్నూలు జిల్లాలో కోవెలకుంట్ల ఒక తాలూకా. ప్రస్తుతం ఇది ఒక మండలకేంద్రం. కోవెలకుంట్ల నంద్యాలకు ఇరవై అయిదుమైళ్ళ దూరంలో వుంది. కోవెలకుంట్ల అనేపేరు ఈ పట్టణానికి రావడానికి ప్రధానంగా మూడు స్థలపురాణ గాథలు ప్రచారంలో వున్నాయి.

స్థలపురాణం-స్థానిక కథలు :

కోవెలకుంట్ల అని పిలువబడే ప్రాంతమంతా ఒకప్పుడు దండ-కారణ్యం. అప్పుడు అక్కడ చింతకుంట్ల అనే గ్రామం వుండేది. ఆ గ్రామానికి తూర్పుదిక్కులో ఒకకోట, కోటచుట్టూ అగడ్త ఉండేది. ఈ అగడ్త కోటను, చింతకుంట్ల గ్రామాన్ని వేరుచేసేది. 'ఈ ఊరికి ఒకమైలు దూరంలో అభివృద్ధి చెందిన ఒక కోవెల వుండేది. శ్రీకృష్ణ-దేవరాయిలు దిగ్విజయయాత్ర ముగించుకొని వెళుతూ ఈఆలయాన్ని దర్శించి జీర్ణోద్ధరణ గావించాడు. ఈ దేవాలయ పునర్నిర్మాణానికి ముగ్ధుడై చుట్టుపక్కల వుండే మీరాపురం, కనుమలపాడు, గుండ్లమల్ల మొదలైన గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి స్థిరనివాసం ఏర్పరచు కున్నారు. ఈ విధంగా అనేకమంది ఇక్కడ స్థిరపడడంవల్ల కోవెలకు దగ్గరగా చింతకుంట్ల ఉండడాన్నిబట్టి అది కోవెలకుంట్లగా స్థిర-పడింది.

పూర్వం ఈ ప్రాంతంలో ఒక కోవెల, ఆప్రక్కనే కుంటవుండేది. అది క్రమంగా జన వ్యవహారంలో కోవెలకుంట్లగా మారింది. పద-మూడవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని కాకతీయులు పరిపాలించేవారు. అక్కడ ఒక నాట్యకత్తె ఉండేది. ఆమెపేరు కోయిల. ఆమె కంఠధ్వని బహుమధురమైంది. రాజు అనుగ్రహానికి పాత్రురాలైంది. ఆమె పరమభక్తురాలు. ఒకరోజు ఆమెకు పాండురంగస్వామి కలలో కనబడి ఇలా అన్నాడు. "ద్వాపరయుగంలో పాండవులు, అరణ్యవాసకాలంలో ఈ ప్రాంతానికి వచ్చినపుడు కోవెలకుంట్లకు రెండుమైళ్ళ దూరంలో ఉన్న ఒక పెద్ద గుంటను చూశారు. ఆ గుంటకు కొంతదూరంలో కొంతకాలం ఆగి విశ్రాంతి తీసుకొన్నారు. అక్కడి ప్రశాంత వాతా-

వరణానికి, ప్రజల మంచితనానికి, ఆదరణకు ముగ్ధులైనారు. ధర్మరాజు అక్కడినుండి బయలుదేరే ముందు సాలగ్రామాన్ని బహూకరించినాడు. అక్కడి ప్రజలు ఆనందంతో ఆ సాలగ్రామాన్ని అక్కడ ప్రతిష్ఠించి భక్తితో పూజలు చేస్తుండేవారు. కలియుగ ప్రారంభంలో అక్కడి ప్రజలు నిర్లక్ష్యభావంతో సాలగ్రామాన్ని కుంటలో పారవేశారు. దాన్ని శతాబ్దాల తరబడి తలచుకొన్న పాపాన పోలేదు. ఆ సాలగ్రామాన్ని కుంటనుండి తీసి పునఃప్రతిష్ఠింపు"మని చెప్పి అంతర్హితుడైనాడు.

స్వామి ఆజ్ఞమేరకు ఆమె గర్భగృహాన్ని నిర్మించి అందులో పాండురంగస్వామి సాలగ్రామాన్ని ప్రతిష్ఠింపజేసింది. లక్ష్మీదేవి, ఆంజనేయస్వామి దేవాలయాన్ని కూడా కట్టించింది. ఈ దేవాలయాలకు ప్రహరీగోడ, దేవాలయానికి ముందుభాగంలో రాతి కట్టడంతో కోనేరు నిర్మించింది. ఆమె ప్రత్యేకంగా కొన్ని భూముల్ని దేవాలయంలోని స్వామి పూజలకు, దీపాలకు, నాటక, సంగీతాలకు దానం చేసింది. ఈ విధంగా దేవాలయ అభివృద్ధికి దోహదం చేసిన కారణంతో ఆమె పేరుతోనే ఆ వూరును కోయిలకుంట్లగా వ్యవహరిస్తారు.

శాసనాలలో ఆలయ విశేషాలు :

కోవెలకుంట్ల పాండురంగస్వామి దేవాలయ వివరాలను తెలిపే శాసనాలు మూడు క్రీ. శ. 1571 నుండి కనిపిస్తున్నాయి. ఈ మూడింటిలో మొదటి రెండుశాసనాలను తిమ్మయదేవమహారాజు వేయించినాడు. వాటిలో మొదటి శాసనం పూర్తిగాను, రెండవశాసనం అసంపూర్ణంగా ఉన్నాయి. మూడవ శాసనం క్రీ. శ. 1584లో కృష్ణమరాజు కుమారుడు వేంకటాద్రిరాజు వేయించినాడు. ఈ మూడింటి శాసన వివరాలు క్రిందివిధంగా ఉన్నాయి.

క్రీ. శ. 1571వ సంవత్సరం తిరుమలదేవ మహారాయలు పెనుకొండ పరిపాలకుడు. అతని రాజ్యపాలనలో తిమ్మయ్యమహారాజు కుమారుడు నరసింగరాజు దానశాసనం వేశాడు. ఈ దానశాసనంలో "కోగిలకుంటకు" చెందే చిన్నకొప్పిరాల గ్రామాన్ని కోగిలకుంట్ల విఠలేశ్వర పెరుమాళ్ళకు సమర్పించినట్లు వుంది.

క్రీ.శ. 1573వ సంవత్సరం తిరుమలదేవ మహారాయలకాలంలో నరసింగరాజు వేయించిన దానశాసనం. ఇతడు "కోగిల" కుంట్ల సీమలోని కోగిలకుంట్లను శ్రీరంగదేవమహారాయుని నుండి "నాయంకర"గా పొందాడు.

క్రీ.శ. 1584వ సంవత్సరం శ్రీరంగరాయదేవ మహారాయలు పరిపాలకుడు. ఇతని పరిపాలనలో కృష్ణంరాజుకుమారుడు వెంకటాద్రి రాజు కోగిలకుంట్ల పండరంగ విఠలేశ్వర దివ్యశ్రీ పాదపద్మాలకు కోగిలకుంట్ల సీమకుచెందే దేవాలయ భూములైన చింతలకుంట, విఠలాపురం, చిన్నకొప్పిరాల, నవదరదిన్నె మొదలైన గ్రామాల్ని ఏర్పాటుచేసినాడు. ఈ గ్రామాలనుండి వచ్చే ఆదాయంలో విఠలేశ్వర స్వామి అమృతపడి, అంగరంగభోగాలు, రామానుజకూటంలోని పల్లకి సేవ,తిరునాళ్ళమహోత్సవం మొదలైనవి నిర్వహించాలనిశాసించాడు.

ఆలయ విశేషాలు :

కోవెలకుంట్ల విఠలేశ్వర దేవాలయానికి తూర్పుదిక్కులో ప్రవేశ ద్వారంవుంది. ప్రవేశద్వారానికి ఉత్తరాన నవగ్రహాలు ఉన్నాయి. ప్రధాన ఆలయంలోని గర్భగుడిలో పాండురంగ విఠలేశ్వర సాలగ్రామం, దక్షిణదిక్కులో ఆళ్వారు విగ్రహాలు, ఉత్తరాన లక్ష్మీదేవి ఆలయం వున్నాయి. ఇవేగాక కల్యాణమండపం, హోమశాల, వాహన

శాల, ధ్వజస్తంభం, గరుత్మంతవాహనం, తేరుగది మొదలైనవి వున్నాయి. భజన నిర్మాణంమాత్రం నిర్మాణంలో వుంది.

పూజలు-ఉత్సవాలు :

ఈ ఆలయంలోని పాండురంగ విఠలస్వామికి సంవత్సరం పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతున్నాయి. దసరా పండుగరోజున ఉత్సవమూర్తుల్ని జమ్మిచెట్టు దగ్గరకు తీసుకెళ్ళి అక్కడ పూజలు జరుపుతారు. సంక్రాంతి రోజున కోవెలకుంట్లకు రెండుమైళ్ళదూరంలో వున్న ఆమడాల గ్రామందాకా స్వామిని ఊరేగిస్తాడు. వైకుంఠఏకాదశి రోజున ద్వారదర్శనం వుంటుంది. ఇక్కడ జరిగే ఉత్సవాలలోకెల్ల పెద్దదైంది వైశాఖశుద్ధ నవమినాడు జరిగే విఠలేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవం.

ఈ ఉత్సవం చాలా ప్రాచీనమైంది. సంప్రదాయబద్ధమైంది. ఉత్సవ వివరాలు ఇలా వున్నాయి. మొదటిరోజు రాత్రి కోటతిరునాళ, రెండవరోజు రాత్రి పేట తిరునాళ, మూడవరోజు రాత్రి కోనేటితిరునాళ నాల్గవరోజు రాత్రి తెల్లవారుజామున శ్రీవారికి అక్షతారోహణం, ఐదవ రోజు రాత్రి హనుమద్వాహనం. ఆరవరోజు రాత్రి సింహవాహనం, ఏడవరోజు శేషవాహనం, ఎనిమిదవరోజు రాత్రి గరుడవాహనం, తొమ్మిదవరోజు రాత్రి గజేంద్రవాహనం, పదవరోజు ఉదయం పూర్ణాహుతి, సాయంకాలం రథోత్సవం, పదకొండవరోజు సాయంకాలం మైల తిరునాళ, పండ్రెండవరోజు పగలు వసంతోత్సవం, రాత్రి నాకబలి నిర్వహిస్తారు.

పండ్రెండురోజులు జరిగే ఈతిరునాళ్ళలో వినోదకార్యక్రమాలు వుంటాయి. ఈ వినోద కార్యక్రమాలలో పురుషుల బలాబలాలు తేల్చుకోవడానికి బరువైన రాతిగుండ్లు ఎత్తడంలాంటివి వుంటాయి. అలాగే

పశువుల వినోద కార్యక్రమంలో ముఖ్యమైంది ఎద్దుల బలాబలాలు. ఒక పెద్దదూలాన్ని నిర్దిష్టప్రదేశంవరకూ లాగిన ఎద్దులకు దాతలపేరు మీదుగా బంగారుపతకాన్ని బహూకరిస్తారు. ముక్కోటి ఏకాదశిరోజున భజనలు, ఆషాఢశుద్ధ ఏకాదశిరోజున విశేషపూజలు జరుగుతాయి. ధనుర్మాసనంలో శ్రీవారికి తెల్లవారుజామున అష్టోత్తర శతనామావళి పూజల్ని పట్టణ ప్రజలంతా జరిపిస్తారు.

ఇక్కడి పాండురంగ విఠలేశ్వరస్వామిని—

"కళ్యాణాద్భుత గాత్రాయ కామితార్థ ప్రదాయినే
శ్రీమద్వేంకటనాథాయ శ్రీనివాసాయ మంగళమ్"

చినతిరుమలయ్య కోవెలకుంట్లకు సంబంధించిన రెండు కీర్తనలున్నాయి. ఒకటేమో పాండురంగనికి సంబంధించినది. రెండవదేమో గోపాలకృష్ణుని వుద్దేశించినది.

రచ్చ కెక్కితివి పండరంగ విఠలా
పచ్చిదేరే వింతలోనే పండరంగి విఠలా

తతి నీవున్న చోటికి దగ్గర వచ్చినంతనె
రతిగూడితివి పండరంగి విఠలా
గతియైన శ్రీవెంకటనాథ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగి విఠలా (16-2-27)

ఈ కీర్తన గోపాలకృష్ణుని ఉద్దేశించి సాగింది. కోవెలకుంట్లలో గోపాలకృష్ణుని విగ్రహంగాని, దేవాలయంగాని వున్నట్లు ఆధారాలేవీ కానరావు. ఇందులో నాయకుడు గోపాలకృష్ణుడు, నాయిక చినతిరుమలాచార్యుడు. మధురభక్తి సంప్రదాయంలో కృష్ణుని నాయకునిగా భావించి, తమని నాయికలుగా భావించి ఆరాధించడం వైష్ణవులకు

పరిపాటి. అందుకేనేమో కోవెలకుంట్లలో గోపాలకృష్ణుడు లేకపోయినా అక్కడి విరలేశ్వరస్వామినే గోపాలకృష్ణునిగా భావించిచినతిరుమలయ్య తన శృంగార సంకీర్తనను రచించినట్లున్నాడు.

చెల్లె నీవు సేసినట్టి చేతలెల్లాను
కొల్లలై కోవిలకుంట్ల గోపాలకృష్ణుడా
వేసారవు రతుల శ్రీవెంకటనాథ పొకరి
కోసమా కోవిలకుంట్ల గోపాలకృష్ణుడా (16-2-28)

6. ఇతర దేవతామూర్తులు :

పెదతిరుమలయ్య మండెము రాయని రెండు కీర్తనల్లో, చిన-తిరుమలయ్య అయిదు కీర్తనల్లో కీర్తించారు. అంతేకాక చిన-తిరుమలయ్య చెళ్ళపిళ్ళరాయని ఒకకీర్తనలో, బెలదలూరిచొక్కనాథుని ఒక కీర్తనలో, యాదవ నారాయణస్వామిని ఒక కీర్తనలోకీర్తించాడు.

మండెము-రాయడు :

కడప జిల్లా రాయచోటి తాలూకాలో చిన్నమండెం అనే గ్రామం వుంది. ఈ గ్రామంలోని నరసింహస్వామిని అన్నమయ్య నృసింహుడన్నాడు. పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య మండెమురాయడని కీర్తించారు.

పెదతిరుమలయ్య మండెము రాయని రెండు కీర్తనల్లో కీర్తించాడు—

చెవులార వినేగాని చెప్పవమ్మా నాకీసుద్ది
జవళి వలపు లిట్టే చల్లుదురా

యెమ్మెలతో నానేరువు లెంతునంటా నాడేవు
కొమ్మలతోడుత నిట్టే కొనియాడుదువా

మమ్ము శ్రీవేంకటేశుడు మండము రాయడవై
సమ్మతిగూడే విట్టే చనవిత్తువా (23-154)

కానీవయ్యా దానికేమి కలది గలట్టయీని
అనుకొని యింకా నెంత ఆ సోదవో ॥పల్లవి॥

మాడలవలె సతుల మారు పెళ్ళాడేవు
తోడనిట్టే యెందరిని దొడ్డిబెట్టేవో
దొమ్మి శ్రీవేంకటేశుడ తోడ బెండ్లాడేవు
మమ్మందరిని ఇక్కడ మండెము రాయడవె (23-141)

పై కీర్తనలో "మారుపెళ్ళి," "తోడపెళ్ళి" అనే మాటలనుబట్టి మండెము రాయనికి రెండో పెళ్ళి అయిందని ఊహించవచ్చు.

చినతిరుమలయ్య మండెమురాయని అయిదుకీర్తనలలో కీర్తించాడు.

ఇంతేసి పొరుపత్తేలేమి నీకు
అంతంతకు గరగించే వత్తునా నేనీకు
అద్దొ మండెము రాయడవై నన్ను గూడితివి
గద్దరివైన శ్రీవెంకటనాథుడా (16-2-34)

వలపేమి దాగునా వన్నె కాడ
అలవడి నీవెంత అణచజూచినను
పెన్నడించి యాపెను శ్రీవెంకటనాథుడ కూడి
మన్నించి నన్ను నిట్టె మండెము రాయడవై (16-2-35)

చిత్తమె చిమ్మి రేగితే సిగ్గేమి యెగ్గేమి
బత్తిపోని వేడుకల రుచిగొన్న వారికి
చెంగలించె నీచెలియ శ్రీవెంకటనాథుగూడి
అంగమైన మండెము రాయుడె తానై యుండగా (16-2-66)

ఎక్కడి పరాకుననో యిందాకా నుండెగాక
మక్కువ నాపై బత్తి మానలేడెవాడు
ఆదెస మండెము రాయడైన శ్రీవెంకటనాథు
డాదరించి నన్ను గూడె నతిమోహమునను (16-2-74)

అంతెపో నాతోడనౌ గాదనగరాదు
పంతమాడి గెలిచితే బంటవయ్యేవా
నీవు దలచిన సుద్ది నిక్కినన్ను జెప్పుమని
కాలించి మండెమురాయ కౌగలించేవు (16-2-88)

నందలూరు చొక్కనాథుడు :

కడప జిల్లాలోని నందలూరే నెలదలూరు. ఆ గ్రామం బాహుదా నదీ (చెయ్యేరు)ఒడ్డున చొక్కనాథస్వామిఆలయం వుంది.ఇది పురాతన సనాతన దేవాలయం. ఇక్కడ నెలకొన్న స్వామిని సౌమ్యనాథుడని, చొక్కనాథుడని వ్యవహరిస్తారు. ఈ ఆలయనిర్మాణంలో ఒక ప్రత్యేకత వుంది. సూర్యోదయమప్పుడు సూర్యకిరణాలు స్వామివారి పాదాలపై పడతాయని ప్రసిద్ధి.

చినతిరుమలయ్య సౌమ్యనాథస్వామిని చొక్కనాథస్వామిగాకీర్తించాడు

చుల్లర పెట్టు జేతల చొక్కనాథుడు
వుల్లములో నీ నెలదలూరి చొక్కనాథుడు
కప్పురపు మోవి శ్రీవెంకటనాథుడె నన్ను
వొప్పుగాగూడె నెలదలూరి (16-2-20)

చెళ్ళపిళ్ల రాయడు :

తమిళంలో చెల్లం అనేమాటకు గారాబం అని అర్థం. రామానుజుల గారాబుబిడ్డ మేల్కోటస్వామి. ఇంతేకాక "సెల్వం" అంటే సంపద

అనికూడా అర్థం. లక్ష్మీయుక్తుడయినవేళ సంపదలరాయడు కూడా. ఢిల్లీ రామానుజులు "సెల్వపిళ్లై"గా ఆహ్వానించాడని ఐతిహ్యం.

చినతిరుమలాచార్యుడు చెళ్ళపిళ్ళరాయనిపై ఒక శృంగార కీర్తన పాడినాడు. అయితే ఈ కీర్తనలో "ఏ ఊరి స్వామో పేర్కొన-లేదు. వేటూరి ఆనందమూర్తిగారు మైసూరు రాజ్యమునందలి "మేల్కోటె"లోని చెళ్లపిళ్ల రాయని స్తుతి యిది అగునా? లేదా కడప జిల్లా రాజంపేట తాలూకా నెలదలూరు గ్రామంలోని చొక్క [సౌమ్య] నాథస్వామియే ఈ చెళ్ళపిళ్ళ రాయుడగునా అని సందేహం వ్యక్తీ-కరించినారు. కానీ సంకీర్తన రాశిని పరిశీలిస్తే ఒక్క నెల్లూరు మినహా రాయలసీమ ప్రాంతం దాటి ఏ వైష్ణవ ఆలయాన్నిగాని దర్శించినట్లు ఆధారాలులేవు. కాబట్టి నెలదలూరి సౌమ్యనాథస్వామియే ఆ చెళ్లపిళ్ళ రాయడు అని చెప్పవచ్చు.

చెల్లపు మాటల చెల్లపిళ్ళ రాయడా నీకు
జెల్లునయ్య యేమైన చెళ్ళపిళ్ల రాయడా [16-2-80]

యాదవ నారాయణస్వామి :

నెల్లూరు జిల్లా వెంకటగిరి తాలూకాలో నాగపుదల్ లేక రాజమల్ల చతుర్వేదిమంగళం అనే గ్రామం వుంది. ఈ గ్రామంలో వెలకొన్న దైవం యాదవనారాయణస్వామి. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ముఖద్వారం ఎడమవైపు సుదర్శనస్వామి ఆలయంలో యాదవ నారాయణస్వామి వున్నాడు.

చినతిరుమలయ్య తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో వున్న యాదవ నారాయణస్వామినే కీర్తించాడని వూహించవచ్చు.

దొరవు నిన్నే గాదని దూరవచ్చునా
అరిది వడేముగాక యాదవ నారాయణా

యింటికి నీవెరాగా యిప్పుడిట్టె భ్రమసితి
నంటు జూపుల యాదవ నారాయణా
వెంట వెంట దిరిగి శ్రీవెంకటనాథుడవై
అంటుకొని కూడితివి యాదవ నారాయణా (16 2-22)

తాళ్ళపాక అన్నమయ్య తిరుమల వేంకటేశ్వరునితోపాటు విస్తృత దేశసంచారం చేసి, అనేక దేవతామూర్తులను కీర్తించాడు. అన్నమయ్య కొంతకమేరకు పెదతిరుమలయ్య కొండమీదనే వుండి సంకీర్తనసాహిత్యాన్ని చేపట్టాడు. పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య విస్తృతమైన దేశసంచారం చేయలేదు. వీరు సంకీర్తనలను రాగి-రేకులమీదచెక్కించడానికే ఎక్కువ కృషిచేశారు. అలాగే అన్నమయ్య ప్రవేశపెట్టిన అనేక ఉత్సవాలను కొనసాగించడానికి దీక్ష వహించారు. ద్రావిడ ప్రబంధ పారాయణానికి దీటుగా కొండమీద శ్రీవారి ఆలయంలో సంకీర్తన సాహిత్యారాధనకు నడుం కట్టారు.

ఉత్సవాలు :

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలలో మూడు రకాల ఉత్సవాలుకనిపిస్తాయి. పెదతిరుమలయ్య శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనల్లో నిత్యోత్సవాలయిన మేలుకొలుపు,ఆరగింపు, పవళింపులు, వారోత్సవమైన శుక్రవార అభిషేకం, సంవత్సరోత్సవాలయిన రథో-త్సవం, కల్యాణోత్సవం, ధనుర్మాసోత్సవం, కృష్ణాష్టమి మొదలైనవి కనిపిస్తాయి. చినతిరుమలయ్య సంకీర్తనలలో మేలుకొలుపు, బ్రహ్మో-త్సవంలో భాగమైన వాహనాల ప్రశంసలుమాత్రం కనిపిస్తాయి.

ఈ ఉత్సవ సంకీర్తనలను పరిశీలిస్తే ఎక్కువగా పెద-తిరుమలయ్య అభిషేక కీర్తనలు కనిపిస్తాయి. కొండమీదవున్న మూల విగ్రహం విష్ణువని, శివుడని, శక్తిస్వరూపమని రకరకాల అభిప్రాయాలున్నాయి. అయితే వివిధ ప్రాంతాలవారు, వివిధ భాషలవారు, వివిధమతాలవారు, ఆదేవదేవుని గోవిందా, ఏడుకొండలవాడా, బాలాజీ, తిమ్మప్పా, అండవా, పెరుమాళ్ అని పిలుస్తారు. ఈ అపోహలను తొలగించడానికే పెదతిరుమలయ్య అభిషేక కీర్తనలు ఎక్కువగా రచించి వుండవచ్చు. తిరుమలదేవుని రకరకాల పూలతో, బంగారు ఆభరణాలతో అలంకరించిన తర్వాతనే దర్శిస్తారు. మూలవిగ్రహ అభిషేకసమయంలో అలంకారాలన్నింటిని తొలగించి వివిధ వస్తు సామగ్రులతో అభిషేకం చేస్తారు. ఆ సమయంలో పెదతిరుమలయ్య మూలమూర్తిని కన్నులార దర్శించి ఆయన పూర్తిగా విష్ణువనే అభి-ప్రాయాన్ని స్పష్టపరచాడు.

1. మేలుకొలుపు :

స్వామికి జరిగే నిత్యసేవలలో మేలుకొలుపు మొదటిది. పెద తిరుమలయ్య అనేక కీర్తనలలో స్వామి మేలుకొలుపును కీర్తించారు. నేటికికూడా సుప్రభాతవేళలో తాళ్ళపాక కవుల కీర్తనలను తాళ్ళపాక వంశస్థులు పాడతారు. అంతేగాక స్వామివారికి జరిగే ఊంజల్ సేవలో గూడ తాళ్ళపాక వారి కీర్తనలను ఆలపిస్తారు.

"మేలుకో శృంగార రాయ మేటి మదనగోపాలా
మేలుకోవే నాపాలమించిన విధానామా (21-215)

దేవ శిఖామణి కామధేనువే కబల నీకు
వేవేగి సంధ్యాది విధుల వేళాయ వేళాయ లేవే ॥పల్లవి॥

మంచి జలధులే మొగమజ్జనమున కాయితమా
కాంచనపు మేరువేగదె పీట
అంచతుంబర నారదులదె మంగళపాటకులు
పుంచాన బాడేరు సూర్యుడుదయించె లేవే ॥దేవ॥

వుదయరాగపు మేఘమొగి గుంకుమ గనము
చదలపైది మణుగు జాంబూనది
అదనకాంతల చూపులనిగా మంత్రాక్షతలు
యెదురు చల్లేరు పొద్దెక్కినదె లేవే ॥దేవ॥

కల్పవృషపు టాకులు కాయటామంచివిడాలు
కలించే పారిజాతమె కమ్మబూవులు
పొల్పుగ శ్రీవేంకటాద్రి పురుషోత్తముడ భోగి
తల్పకొలుపు వేళాయె గద లేవయ్యా ॥దేవ॥ (21-201)

చినతిరుమలయ్య :

గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు 16-1-57 అని కీర్తించాడు.

2. రోజూ స్వామికి జరిగే చివరి పవళింపు సేవ. ఈ సేవను పెద-తిరుమలయ్య—

వట్టి యారడిబడేవు వలపు లోనబెట్టక
నెట్టున నేడు నీకు నిద్రవచ్చీనా 23-155 అని కీర్తించాడు.

3. అన్నమయ్య సంకీర్తనలలో అభిషేకం అనే మాట కనిపించదు. అయితే పెదతిరుమలయ్య అభిషేకం అనే మాటను స్పష్టంగా వాడాడు.

తేరుకొన బంగారు బిందెల నించి పన్నీటి
శ్రీరమణునకు నభిషేకము సేయగా (23-505)

ఆవేళ బన్నీటి నభిషేకము సేయగ
వేవేలు దెరగుల విభవములమరె (23-502)

ఆకాశమువంటి మేన నమరే మూర్తివి గాన
ఆకాశనిడిమె నీకు నభిషేకము (23-494)

పై కీర్తనను బట్టి ఆకాశగంగనుండి నీరుదెచ్చి అభిషేకం చేసే సంప్ర-
దాయం వుందని స్పష్టమవుతుంది.

పెదతిరుమలయ్య శుక్రవార అభిషేకాన్ని

"చూడరమ్మ యిదె నేడు సుక్కురాలము
వేడుక చక్కదనాలు వేవేలైనాడు ॥పల్లవి॥

చప్పుడుతో చన్నీట మజ్జనముతో నున్నవాడు
అప్పుడే ఆదినారాయణునివలె
కప్పుర కాపామీద గడు బూసుకొన్ననాడు
ముప్పిరి బులు కడిగే ముత్యమువలె ॥చూడ॥

పొదగనప్పటి దట్టు పుణుగలదుకొన్నాడు
కసుగందని కాలమేఘమువలెను
సుసరాన మేనునిండా సొమ్ము పెట్టుకొన్నవాడు
పసల బదారు వన్నె బంగారువలెను ॥చూడ॥

అలమేలుమంగ సురమందు నిడుకొన్ననాడు
వెలమి సంపదలకు నిల్లువలెను
అలరుచు శ్రీవేంకటాద్రిమీద నున్నవాడు
తరపోసి చూడగ దొంతరకొండవలెను (23-498)

అని కీర్తించాడు.

స్వామికి జరిగే కప్పురపుకాపు, పుణుగుకాపు, పన్నీటికాపు, మొదలైన కాపులు అనేక కీర్తనలలో కనిపిస్తాయి.

పన్నీటికాపు :

కడలేని పన్నీటి కాపమరెను [25-501]
తేరుకొన బంగారు బంగారు బిందెలనించి పన్నీటి (23-505)
చప్పుడుగాక పన్నీట జలకమాడి [23-493]
చాల బన్నీట మజ్జన మాడేటి వేళ నిన్ను [23-496]
పన్నీరే చల్లుకొనేల పదనెక్కి పలపులు [23-499]

కప్పురకాపు :

కప్పురకాపు మేన గడునిండా మెత్తుకోగా (23-492)
అదనగప్పున కాపు అవధరించే వేళ [23-495]
పూసేవు కప్పురధూళి పొడిమెక్కి గోలికలు [23-49]

పుణుగుకాపు :

చెలగి పుణుగుకాపు శ్రీవేంకటేశుడు పూసి [23-492)
నీతట్టు పుణుగు వేళ నీలవర్ణ నామమబ్బె [23-495]
తట్టు పుణుగలదున్ తాళిగా నలమేల్మంగ [23-497]

4. బ్రహ్మోత్సవం :

స్వామివారికి జరిగే అతి పెద్ద ఉత్సవాలలో బ్రహ్మోత్సవం ఒకటి. రథోత్సవాన్ని పెదతిరుమలయ్య ఒక కీర్తనలో కీర్తించాడు. ఇతర వాహనాల ప్రశంస పెదతిరుమలయ్య సంకీర్తనలలోకానరాదు.

మునులాల జనులాల మించిన దేవతలాల
పనిపూని మొక్కరో పరమాత్మునికి ॥పల్లవి॥

కనకాచలమువంటి ఘన దివ్యరథముపై
వనజాక్షు డెక్కి వీధి వచ్చినాడె
వెనుదళమై నడచె విష్వక్సేనుడిదె దేవిడి
కనిమని సేవించరో కన్నుల పండుగలు

గగన వాహినివంటి గరుడధ్వజముతోడ
అగడై వీధి నేగె చక్రాయుధుడు
సగటు విజయముతో పాంచజన్యము పట్టిని
నిగిడికొని యాడరో నిచ్చకల్యాణములు

వరుస భాగ్యదేవత వంటి యలువేలుమంగ
పురమెక్కగ శ్రీవేంకటోత్తముడు
తిరమై నెలవుకొనె దివ్యనగరులో నను
శరణని బదుకరో సాక్షాత్కరమున ॥వం

చినతిరుమలయ్య కీర్తించిన ఒక కీర్తనలో బ్రహ్మో
మయిన ఏనుగు, గుఱ్ఱం, రథ ప్రస్తావనలున్నాయి.

తలపు దలపు లెస్స తగులాయను
కలకంటి యిందుకె నిక్కము వలచనయా

యేనుగపై నీవురాగా యింతి పయ్యద జా
పూని మిద్దెమీదనుండి పొసగుజూచె
ఆని కలికుంభములు అంకుశాన నీవూదిన
కానుక నీ చేతలకు గడువలచెనయ్యా

నీవు గుఱ్ఱము దోలగ నెలత చిక్కుదీయుచు
తావుల మేడపైనుండి తప్పకచూచె
కావించి నీ సమకట్లలో నల్లజల్లి
దూవిన నేరుపుల కెదురు వలచెనయ్యా

తేరుపై నీవెక్కి రాగా తెలుపమై పులకించి
తేరువ పువ్వురిగెపై జెలగిచూచె
గారవించి వచ్చి శ్రీవేంకటనాథ నీవుగూడ
తారుకాణ చేతలకు దగ వలచెనయ్యా ॥తలపు॥ (1౯-2-10౭)

5. కళ్యాణోత్సవం :

కళ్యాణోత్సవం మొదట బ్రహ్మోత్సవంలో భాగంగా వుండేది. తర్వాత కాలంలో ప్రత్యేకంగా జరుపబడుతుండేది. నేడు ఆర్జితసేవగా భక్తాదుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. పెదతిరుమలయ్య కళ్యాణోత్సవాన్ని —

లక్ష్మీ కల్యాణము లీలతో బాడే మిదే నేము
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥పల్లవి॥ (23.1౯5)

ధారుణీపతికిని దలబాలో బహు
దారారతునకు దలబాలో ॥పల్లవి॥

తిరువేంకటమున దినపండ్లిగల
తరుణుల పతికిని దలబాలో
యిరవుగ బాయక యిందిర నురమున
ధరియించు హరికి దలబాలో [23.443]

6. ధనుర్మాసోత్సవం-ఆరగింపు సేవ :

మార్గశిరమాసంలో వైష్ణవాలయాలలో భక్తాదులు వేకువజామున లేచి స్వామికి కైంకర్యాలు ఒనరిస్తారు. ధనుర్మాసకాలంలో అండాళ్ తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. పెదతిరుమలయ్య ధనుర్మాస పూజా విశేషాల్ని ....

దేవుని ప్రసాదము: తెరశ అందురో
యీవేళ నారగించె యీశ్వరేశ్వరుడు ॥పల్లవి

వేగుజామునను లేచి వేదవిప్రులెల్లగూడి
ఆగపు ధనుర్మాసమందు పూజించి
రాగమున దేర్పావు: డి రంతు చేసి చదువగ
జాగుతోడ నారగించె సర్వలోకేశ్వరుడు ॥దేవుని

దిన సంభ్రమము:లతో దేవదుందుభులు మ్రోయ
తన చెరపులు పైపై దాసులు సేయ
సనకాదులిరువంక సంకీర్తన పాడగా
వినుకొంటానారగించె విశ్వలోకేశ్వరుడు ॥దేవుని

హత్తుకొని వైష్ణవులు అనుష్ఠానములు దీర్చి
యెత్తి చేతులు పుష్పాంజలు లియ్యగాను
హొత్తుల నలమేలుమంగ బోనము దొడుకగాను
చిత్తగించి అరగించె శ్రీవేంకటేశ్వరుడూ ॥దేవుని॥ (21-18

అని కీర్తించాడు.

7. ఉట్ల ఉత్సవం :

జన్మదినోత్సవానికి ప్రాధాన్యం యిస్తూ వినోదానికి కూ
అవకాశం కల్పించే పండుగ ఉట్ల పండుగ. దీన్ని సంస్కృతం
"శిక్యోత్సవ"మని తమిళంలో "ఉరిఅడి" అనిఅంటారు. పెదతిరుమలయ
శ్రీకృష్ణుని పుట్టుకను, ఆరోజు జరిగే ఉట్లపండుగను క్రింది కీర్తన
కీర్తించాడు.

"అవతారమందె నిదె అద్దనురేతిరికాడ
భవహరుడు శ్రావణ బహుళాష్టమిని ॥పల్లవి॥ [23-14

జనించెనిదిగో శ్రావణ బహుళాష్టమిని
ఘనచంద్రోదయవేళ కన్నులపండువగా ॥పల్లవి॥

బాపురే యెంతటి జాణ బాలకృష్ణుడు చూడ
బాపనివలె నున్నాడు బలరామకృష్ణుడు ॥పల్లవి॥

పొంటి గోపికల చన్నులుట్లపై కుండలంటా
అంటుచే జేతులు చాచీనిదే కృష్ణుడు [23-206]

దేవాలయపూజా సంప్రదాయాలను తెలిపేశాస్త్రం ఆగమశాస్త్రం. ఆగమ సంప్రదాయాలను ఇతర వాగ్గేయకారులు గుర్తించలేదని చెప్పలేము; కాని ఈసంప్రదాయాలలో ఎక్కువ అనుబంధం పెంచుకున్నవారు తాళ్ళపాకవారు. ఆగమ సంప్రదాయాలు అన్నమయ్యలో తక్కువగాను, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలందు ఎక్కువగా వున్నవి. తాళ్ళపాక కవులకు, దేవాలయములకు దగ్గరి సంబంధం వుండడమే దీనికి కారణం. ఈ సంబంధం జారుముడి లాంటిదికాదు. అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య ముగ్గురుకూడా తిరుమల వేంకటేశ్వరునితోపాటు అనేక దేవాలయములను, అక్కడి దేవతామూర్తులను దర్శించి, అక్కడనిర్వహింపబడే కార్యక్రమాలను కన్నులారగాంచి, కీర్తన సాహిత్యంలో పదిలపరచిన కవిత్రయం వారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందువల్లనే తిరుమల ఆలయంలో తాళ్ళపాక అర అనే వ్యవస్థ ఏర్పడింది.

సీ॥ ప్రథమ విభక్తికి బరగు వీరావళి
మఱి ద్వితీయకు* గీర్తిమతి దలంప
సుభగాభిధానమచ్చుగ ద్వితీయకు చతు
ర్థికి భోగమాలిని దృఢముగాగ
క్షితి బంచమికి కళావతి కాంతిమతి షష్ఠి
కమరు నుదాత్త సప్తమికి గమల
సంబోధనమునకు జయగతి యీగతి
దగు విభక్త్యధిదేవతాచయంబు
గీ॥ నెలమినయ్యయి విభక్తుల నెసగ జెప్ప
గావ్యములను సంతోషించి కరుణతోడ
నాత్మనామాభిరూప ఫలాభివృద్ధి
భర్తలకు గర్తలకు జేయు పద్మనాభ (3-64)

## శ్రీకృష్ణదేవరాయ యుగము
### [క్రీ. శ. 1500-1600]

వైష్ణవ మతమునకు సంబంధించిన మొదటి యుదాహరణ మీ యుగమున వెలసినది. అది తాళ్ళపాక పెదతిరుమలయ్య గారి "వేంకటేశ్వరోదాహరణము." దీనికి సమకాలికముగనే చిత్రకవి పెద్దన రచించిన "హనుమోదాహరణము"ను పేరు గన్నది.

సంపూర్ణమగు నుదాహరణములేగాక, ఈ కాలమున వెలసిన ప్రబంధములలో నుదాహరణ సూచనలు సందర్భానుసారముగా పొందుపరుపబడినవి.

---

* పైవానిలో గీర్తిమతి, కళావతి, భోగమాలిని, జయగతి మొదలగునవి అయా పాత్రల పేర్లనియు, తొల్లి దేవదాసీ లీ యుదాహరణములను చదివి నాట్యము సేయుచుండెడి వారనియు, వారి వారి పేర్లు ఆయా విభక్తులకు బెట్టబడెననియు, నిది ప్రాచీన సంప్రదాయమనియు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు తెలిపిరి.

# శ్రీ వేంకటేశ్వరోదాహరణము

## తాళ్ళపాక పెదతిరుమలయ్య

### ప్రథమావిభక్తి

[శ్రీతిరు వెంగళనాథదేవునికి దాళ్ళపాక అన్నమాచార్యుల కొమారుడు పెదతిరుమలాచార్యులు విన్నపము చేసిన యుదాహరణ.]

ఉ॥ శ్రీకరుణాకరుండగుచు-జీవుల ఠీవుల బ్రోచి కాచుచుం
గైకొని లోకముల్ మనిపి-కర్తయు భర్తయునై మునుల్ సురా
నీకము లోకముం బొగడ-నీరజజాతుని తాతయైన సు
శ్లోకుడు వేంకటేశ్వరుడు-చూడగ నొప్పెడు బ్రహ్మమింతకున్

కళిక-వృషభగతి రగడ

మఱియు నెఱుకలకెల్ల నెల్లగు-మహిత హితజనకల్పభూజము
మెఱపులొఱపులు జెలగు వెలుగుల - మించుమించుల మొదలి తేజము
మడుగుపెడలని చిలువచెలువము-మాయజేయు మహానుభావుడు
జడధినడుమను తెరువు విరివిగ- జరపి వఱచిన దేవదేవుడు
కరము లురలగ బాణప్రాణము-గాచి యేచిన నాటి నేర్పరి
పొరిది బిరుదుల యసురవిసరము-ప్రుక్క ద్రొక్కిన వేల్పు దిర్పరి
పడగ లడరెడు శయ్యసెయ్యపు-భామ ప్రేమ రమించు చెలువుడు
జడికి గొడుగుగ గేలశైలము-చాటు వీటికి జేయు బలుపుడు

ఉత్కళిక

దురితవిరహితగురుడు వేదపు
శరధి నుడుతర శాస్త్రవాదపు
నగము సుగుణపు గుణము జుట్టుచు
పొగడదగు సత్త్వమున బట్టుచు

గెరలి తరువగ నరుడు మీఱగ
సురల దొరలకు నోరులూఱగ
నంది పొడమిన యమృతసారము
నందవనితానందపూరము

ద్వితీయావిభక్తి

ఉ॥ ఏటికి లేల్పులార! చద-లేటికి బోయెద రిందు రండు కో
నేటికి వచ్చు దీర్ఘచయ-మేబదిలక్షలదోడగూడు ము
క్కోటియునంచు బల్కుమా ని-కోటుల మాటలు నేర్చి కీరము
చాటు తటాటవిన్నటన-సల్పెడు వేంకటభర్త గొల్చెదన్

కళిక

మఱియు నెఱిగిన బుధుల - మనసులెనసినవాని
మెఱుగులకు గుఱియైన - మేనుపూనినవాని
గొల్లెతల నెల్లెడల - గూడిమాడినవాని
మల్లులను విల్లునటు-మట్టికొట్టినవాని
జక్రమున నక్రమును-జడియ నడచినవాని
శుక్రుడొక వక్రగతి.......................
వీరుడగు కౌరవుని-వీడనాడినవాని
శూరుడగు సీరితో-జోడుగూడినవాని

ఉత్కళిక

మేడెములు గూడుకొని
వాడలను దాడిగొని
యుట్టులను జట్టులను
దెట్టెలుగ గొట్టి చని

యాటలను బాటలను
జోటులను మాటుకొని
కలసి మెలసినవాని
దులసివలసినవాని

తృతీయావిభక్తి

ఉ॥ తీఱునఘంబులెల్ల నిలు-దీర్ఘమువచ్చినయంత సంపదల్
మీఱు సుఖంబుగూరు-మతి మిక్కుటమై శ్రుతి వీథిదూఱు వే
నూఱులు జెప్పనేల సుమ-నోవిభుచే దిరువేంకటేశుచే
జూఱలుగా వరంబులిల-జొప్పడ గొందము రండు మానవుల్

కళిక-హయప్రచార రగడ

మఱియు వఱలు సుజనభజన - మానలేసి వానిచేత
మెఱపు మఱపులేక జోక-విడువ కడరు వానిచేత
శ్రుతుల గతుల నడువ నుడువ - జొక్కిచిక్కువానిచేత
అతులమతుల జెలగిమెలగి-నట్టిగుట్టువానిచేత
సగముమొగముచాయదాయ-జదియునదుచువానిచేత
బొగులు మగువ వలువలొలువ - బ్రోచి కాచువానిచేత
ఱాతి నాతిజేసి వాసి-ఱట్టుపెట్టువానిచేత
వాతజాతు బనుల గొనుచు-వసుధ నెసగు వానిచేత

ఉత్కళిక

పురములెఱియు శరమనంగ
బరగి దురము పురికొనంగ
బగతు లగల మిగులగొట్టి
నగజ మగడు పొగడునట్టి
గెలుపు నిలుపు తలపులెంచి

బలము చలము కలిమిమించి
జనుల మనుపు ఘనునిచేత
వనజతనుజు జనకుచేత

చతుర్థీవిభక్తి

ఉ॥ భావజుతండ్రియై కుసుమ-బాణుని మామయుందియై చకో
రావళి మిత్రుగన్నతని-యల్లుడునై జలరాశినాత్మమా
యా వటపత్రశయ్యునకి - లాబ్జభవాండపుగుడ్లబెట్టునం
చై విలసిల్లు వేంకటవి-హారునకై నుతు లేనొనర్చెదన్

కళిక-వృషభగతి రగడ

మఱియును గొఱగల పుడమికి వొడికవు
మగడై పెగడెడు నఖిలేశులకై
కఱకటిమెఱయ నృగాలుని గాలుని
గనుగొనబనిచిన విజితాళునకై
కన్నుల వెన్నెలయెండయుమెండుగ
గాయగ జేయగగల విష్ణునకై
జన్నము లెన్నడు చదువుల పదవుల
సరణుల దిరిగెడు వర్ధిష్ణునకై
జగముల మగటిమి గావగ బ్రోవగ
జాలిన యేలికయగు మూర్తికిసై
తగులమి మిగుల బ్రపన్నులసన్నిధి
దరలక మరగిన వరకీర్తికిసై
సరులకు సురలకు ముంగిట
జెంగట నమ్మిన పొమ్మగు నగధీరునకై
యురమున సిరి గడుజెలగగ మెలగెడు
సున్నత సన్నుతమణిహారునకై

ఉత్కళిక

ధారుణీ భారనివారణకలనకై
శౌరవిహార విచారమునెడికై
తపమున జపమున బవిరితిరుగుకై
దువుగాని వివిధ సవిధదానవకై
కసరుధిర సలిలమెసగ విసరికై
వనముగ సురవిసరమునేలినకై
లాసనివాస సతీవంద్యునకై
హాసనమున్నత బుదవంద్యునకై

పంచమీవిభక్తి

ఉ॥ కొండలవంటి సంపదలు-కొండనివేగమె చాగమిచ్చుచో
గండరగండడై వసిడి-కంబమునం బడగెత్తియుల్లస
త్కుండలమండలాధిపతి-గోత్ర విచిత్రనివాస సౌఖ్యమున్
దండిగ గాంచు వేల్పువల-నన్ సుఖమందెద మెల్లకాలమున్

కళిక

మఱియు గుఱుతగు గుణసు-మణులు గలపతివలన
మఱుగుమొఱగులు లేసి-మానవుల గతివలన
గురువరుని గతసుతుల-గూర్చు శూరునివలన
బురహరుని పగతుడెగ-బోడుధీరునివలన
గమలమున దనయుగను-గరుడవాహనువలన
సమితహిత యువతితతి-నవ్యమోహనువలన
నలువనెలవవల ధ్రువు-నకు నొసగు హరివలన
కలుచేలియులివి-గలయు బిత్తరివలన

### ఉత్కళిక

తెఱగు లెఱుగని బండి
నిఱిగి యెఱుగగ బండి
యుద్ధిమద్దుల వ్రాల్చి
గ్రుద్ది యెద్దులగూల్చి
ఘాతఖాతన దీర్చి
చేతనేతులు గూర్చి
యున్న వెన్నునివలన
నున్నతోన్నతువలన

### షష్ఠీవిభక్తి

ఉ॥ మానిసిదెండ్ల మొత్తునెఱ-మంటలపిల్లలకత్తి వేల్పు పెన్
బోనపుముద్ద నిద్దముల-పొల్పుదొలంకెడు సంకుగల్గు వె
వ్వానికి వానికి న్నతభ-వానికి వేంకటశైలశృంగస
న్మానికి భక్తసంపదభి-మానికి శరణంచు మ్రొక్కెదన్

### కళిక

మఱియు నెఱయు మంత్రతంత్ర-మర్మధర్మకీలకునకు
చిఱుతయుఱుత భక్తిశక్తి జెలగి మెలగు పాలకునకు
సోమధామనూత్నరత్న-సుకరమకరకుండలునకు
సామభూమగానమాన-సక్తభక్తమండలునకు
బంతిగొంతి తనుబననుజ-బండినుండు మాధవునకు
జంతయింతి గండమండి-చక్కనొక్క భూధవునకు
రాజితాజి కుంభికుంభ-రక్తసిక్తభీకరునకు
భోబరాజపుత్రి మైత్రి-బొదలి మొదలు శ్రీకరునకు

ఉత్కళిక

భువనసువన ఫలములలమి
జవనపవన బలముకలిమి
యెదలుపొదల మరగి తిరిగి
దదలతుదల కరిగి పెరిగి
పేపుమాపు మించి పొంచి
రూపుచూపి సంచరించు
యోగరాగ కీరమునకు
యాగభాగసారమునకు

సప్తమీవిభక్తి

ఉ॥ కోరి పదారువేలయిన-కొమ్మల నెమ్మది బెండ్లియాడియున్
ధారుణి బ్రహ్మచారినని-తప్పక పల్కి పరీక్షితున్ మహో
దారతఁ బ్రాణమెచ్చుఁ బ-తాపముమీఱగ బ్రోచి మోహనా
కారునియందు వేంకటశి-ఖామణియందు మనంబు నిల్పెదన్

కళిక

మఱియు శోభిగుణాభి-మానియందు
తఱినాభి జనితాభి-ధానియందు
శతపత్ర సమనేత్ర-శౌరియందు
తతచిత్రతర గోత్ర-ధారియందు
శతకోటి శతకోటి-సారియందు
క్రతువాటి రిపుధాటి-కారియందు
భుజగేంద్ర ఘనసాంద్ర-భుజునియందు
రజనీంద్రరుంద్రగో-త్రజునియందు

### ఉత్కళిక

భువియు బవనంబు
దివియు భువనంబు
రుచులు వచకంబు
ఖచర నిచయంబు
నలరు బలువొంపు
గలగు చెలువంపు
ధరణి ధరునందు
బరమ గురునందు

### సంబోధన

ఉ॥ వాలిన నీ ప్రభావములు-వర్ణన సేయగ రావు కీలికిన్
శూలికి దమ్మిచూలికిని-సోలికినున్న సురాలికిం బ్రభా
మాలికి నాకుసెన్న వశ-మా యసమాన గుణాత్మ ధన్యగో
పాలకా బాలకా నిగమభాషణ కీలక వేంకటేశ్వరా!

### కళిక

మఱియు దఱచగు సిరుల-మరుల కొసగెడు దాత!
కఱకు విఱిసెఱి విఱుచు-ఘనకజామాత!
వెక్కసపు రక్కసుల-వేచి కాచినవాడ!
యుక్కఱగనక్కడలి-యుబ్బగిబ్బిన జేడ!
విడుదు డెదుపుగజేయు-విందుపొదులజాణ!
ముదుటు వెదురున బాట-మూటగట్టిన గాణ!
లేటి శరకోటి బెడ-లించి త్రుంచిన రామ!
యేటి నాగేటిగది-యించి చించినరామ!

ఉత్కళిక

ఘనవనధియను పాదు
నను ముసుశలుకు బ్రోదు
లలర మొలచిన మొదలు
కలిమి చలువల బొదలు
ప్రమదసుమముల దొల్లి
యమరిన రమావల్లి
జెలగునో యెలదేటి!
కలికి తలముల మేటి!

శా॥ నీ వీశుండవు నిన్ను గొల్తు వరముల్ నీచేత గైకొందువే
గై వారం బొనరింతు నీకొఱకు సంకల్పింప నీడేటె మ
త్సేవల్ నీవలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీయందు ల
క్ష్మీవాల్లభ్యము గంటి భక్తవరదా! శ్రీవేంకటాద్రీశ్వరా!

ఉ॥ ఆరవితారకంబు ను-దాహరణంబు రచించె భక్తివి
స్తారత దాశ్శపాకపుర-శాసను డన్నయ తిమ్మనార్యుడిం
పారగ జక్రనందక గ-దాంబుజధారికి శ్రీవధూమనో
హారికి వేంకటాచల వి-హారికి శౌరికి నంకితంబుగాన్

మంగళమహ శ్రీశ్రీ జేయున్

శ్రీవేంకటేశ్వరోదాహరణము సమాప్తము.